


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 56 | బుధవారం 25 - 02 -2026 | పేజీలు : 12 | వెల-3


## శశికళ కొత్త పార్టీ ప్రారంభం

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలిత సన్నిహితురాలు, అన్నాడీఎంకే బహిష్కృత నేత శశికళ కీలక ప్రకటన చేశారు. తమిళనాట కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. జయలలిత జయంతి సందర్భంగా రామనాథపురంలో మంగళవారంనాడు జరిగిన కార్యక్రమంలో కొత్త పార్టీ ప్రకటన చేశారు. కొత్త రాజకీయ చరిత్రను మనం చూడబోతున్నామని, కొత్త పార్టీని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ద్రవిడ ఉద్యమం స్ఫూర్తితో అన్నాదురై, పురట్చి



## వైకాపా హయాంలో కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూల తయారీ

రూ.231.51 కోట్ల అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ

- 2019-24 మధ్య 59.71లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగం
- ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగానే కల్తీ జరిగిందని చెప్పా
- అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారు
- కల్తీపై దేవుడే తనతో విషయాలు వెల్లడించేలా చేశారు
- మహాపాపం' పేరిట లడ్డూ కల్తీ పై అసెంబ్లీలో బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

2లో

వైకాపా హయాంలో 20 కోట్ల లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేశారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని ఆక్షేపించారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 'మహాపాపం' పేరిట వైకాపా హయాంలో లడ్డూ కల్తీ జరిగిన తీరును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయన వివరించారు. రాజకీయ వివాదం ఉండకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సిట్ ఏర్పాటు చేశారు. సీబీఐ ఆధ్వర్యంలో విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపించింది. అందుకే ఏకసభ్య కమిటీ వేయాలని నిర్ణయించాం. లడ్డూ వ్యవహారంలో కాకుండా అనేక విషయాల్లో తప్పులు చేశారు.



## కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులకు శిక్షపడాల్సిందే

- ఆనాటి బోర్డును జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారు
- రసాయనాలతో కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని రుజువయ్యింది
- అసెంబ్లీలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

2లో

కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులు ఎవరైనా సరే శిక్ష పడాల్సిందేనని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై శాసనసభలో జరిగిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. కల్తీనెయ్యిలో ఏ రసాయనాలు వాడారో ఆ పెరుమాళ్లకే తెలియాలి. జంతు సంబంధ రసాయనాలు ఉన్నాయని ఎన్‌డీడీబీ రిపోర్టు చెప్పింది. అది నెయ్యే కాదని సీబీఐ రిపోర్టు ఇచ్చింది. ఇది ధర్మానికి సంబంధించిన విషయం. సకల మతాలను గౌరవించడం ఈ దేశ సంస్కృతి. తితిదే పాత బోర్డును జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారు?

## భారత్‌ను అమెరికాకు అమ్మేశారు



2లో

- అమెరికాకు తలొగ్గిన ప్రధాని మోడీ
- మరోమారు విమర్శలు గుప్పించిన రాహుల్

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విమర్శల దాడి చేశారు. మోదీ రాజీపడ్డారని, అమెరికా ఒత్తిడికి తలవంచారని ఆరోపించారు. భోపాల్‌లో మంగళవారంనాడు జరిగిన కాంగ్రెస్ కిసాన్ మహాచౌపాల్ కార్యక్రమంలో మాట్లాడుతూ, దేశాన్ని అమ్మేశారని, భారతీయుల డాటాను అమెరికా

## మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గుదల



2లో

- 20 నెలల్లో రాష్ట్రంలో నేరాలు 6.6 శాతం తగ్గాయి
- ఆడబిడ్డల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదు
- మండలిలో చర్చ సందర్భంగా హోంమంత్రి అనిత వెల్లడి

## పులివెందులకు చేరుకున్న జగన్



2లో

ఘనంగా స్వాగతించిన పార్టీ నేతలు



## సిఎం రేవంత్‌ను కలిసిన ఉద్యోగ సంఘాలు

2లో

- ఆరోగ్య, బీమా పథకాలపై హర్షం
- సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు



## మార్కెట్లపై ట్రంప్ దెబ్బ..

- భారీ నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు
- అమెరికా వాణిజ్య విధానాలపై ఆందోళనలతో అమ్మకాల ఒత్తిడి
- 1068 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 288 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ
- రెండేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన ఐటీ రంగ షేర్లు
- మార్కెట్లలో మరికొంత కాలం అస్థిరత కొనసాగే అవకాశం

2లో

అమెరికా వాణిజ్య విధానాలపై తాజాగా తలెత్తిన ఆందోళనలతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలను చవిచూశాయి. గత నాలుగు రోజుల్లో ఎన్నడూ లేనంతగా అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు కుప్పకూలాయి. బ్యాంకింగ్, ఇన్‌ఫ్రా, ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాలు జరగడంతో సెన్సెక్స్ 1,068.74 పాయింట్లు నష్టపోయి 82,225.92 వద్ద ముగిసింది. నిఫ్టీ 288.35 పాయింట్లు తగ్గి 25,424.65 వద్ద స్థిరపడింది.



## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం.

- ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ శాఖ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం
- ధృవీకరణ పత్రాలున్న దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి గ్రీన్ సిగ్నల్
- విశాఖలో రూ. 2,387 కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం
- రాష్ట్రవ్యాప్తంగా పలు పర్యాటక, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు పచ్చజెండా
- కల్తీ పాలు, డయేరియా ఘటనలపై సీఎం సీరియస్.. కఠిన చర్యలకు ఆదేశం

2లో

## మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ




- డిజిపి ఎదుట లొంగిన ప్రధాన నేతలు
- లొంగిన వారిలో దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, జగన్, గంగన్న
- 40 ఏళ్ల అజ్ఞాతానికి వీడ్కోలు పలికిన మావోలు
- వారిపై ఉన్న రివార్డును అందిస్తామన్న డిజిపి
- కేవలం ఇక 11 మంది మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడి

2లో

తెలంగాణలో నలుగురు మావోయిస్టు అగ్రనేతలు మంగళవారం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో అధికారికంగా లొంగిపోయారు. వీరిలో పొలిట్ బ్యూరో సభ్యుడు (పీబీఎం) తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ అలియాస్

## వైఎస్సార్‌పై చేసిన వ్యాఖ్యలను అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించాలి



2లో

- వైసీపీ చేసిన తప్పులను వైఎస్సార్ కు ఆపాదిస్తున్నారని షర్మిల మండిపాటు
- ఏడు కొండలు వెంకన్నవే అని జీవో ఇచ్చింది వైఎస్సారే అని వ్యాఖ్య
- వైసీపీలో వైఎస్సార్ లేరన్న షర్మిల

# వైకాపా హయాంలో కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూల తయారీ

2019-24 మధ్య 59.71లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగించారు. రూ.231.51 కోట్ల అక్రమాలు జరిగాయి. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చారు. ఒక పద్ధతి ప్రకారం లాలూచీ పడిన లూటీ అని స్పష్టంగా తేలింది. కల్తీ నెయ్యి అని నిర్ధారణ అయినా రిపోర్టును తొక్కిపెట్టారు. లడ్డూలో జంతుకొవ్వు కలిసిందని నేను సొంతంగా ఏమీ చెప్పలేదు. ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టునే చెప్పా. ఆ భగవంతుడే నాతో చెప్పించాడని చంద్రబాబు అన్నారు. గత వైసీపీ పాలనలో ఎన్నో విధ్వంసాలు చూశామని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దేవాలయాలపై దాడులు జరిగాయని ప్రశ్నిస్తే కేసులు పెట్టారన్నారు. రాముడి విగ్రహం ధ్వంసం చేశారని ప్రశ్నిస్తే తనపైనే దాడికి దిగారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రక్షాళన కోసం ఈవోను నియమించామని చెప్పారు. తన దృష్టికి వచ్చిన నేషనల్ డైయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ రిపోర్ట్ వివరాలు వెల్లడించానని తెలిపారు. శ్రీవారి లడ్డూ విషయంలోనే కాదు.. అనేక విషయాల్లో తప్పు చేశారంటూ వైసీపీ నేతలపై ఆయన మండిపడ్డారు. కుట్ర కోణాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. 59.71లక్షల కేజీల రసాయనాలతో కూడిన నెయ్యిని లడ్డూ తయారీలో వినియోగించారని వివరించారు. తద్వారా రూ. 234.51 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారంటూ వైసీపీ అగ్రనేతలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాబ్‌ల కళ్లుగప్పి నెయ్యి టెండర్లు దక్కించుకున్నారని విమర్శించారు. 2019 - 24 మధ్య రసాయనాలతో తయారు చేసిన నెయ్యితో 20 కోట్ల లడ్డూలు తయారు చేశారని పేర్కొన్నారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని సీఎం చంద్రబాబు గణాంకాలతో సహా వివరించారు. 2026 జనవరి 23న ఈ కల్తీ లడ్డూ వ్యవహారంలో సీబీఐ చార్జ్‌షీట్ వేసిందని గుర్తు చేశారు. అలిపిరి ఘటనలో శ్రీవేంకటేశ్వర స్వామి వారే తన ప్రాణాలను కాపాడారని సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. కల్తీ నెయ్యి వినియోగం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సిట్ వేయాలని ఆలోచించినట్లు ఏపీ సీఎం తెలిపారు. సిట్ ఏర్పాటును వైసీపీ నేతలు సుప్రీంకోర్టులో సవాల్ చేశారని గుర్తు చేశారు. రాజకీయ వివాదం ఉండొద్దనే కేంద్ర, రాష్ట్ర అధికారులతో సిట్ ఏర్పాటు చేశామని వివరించారు. సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీం సూచించిందన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపిందని పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పినందుకే ఏకసభ్య కమిటీ అని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సీబీఐ రిపోర్టుతోపాటు ఫోరెన్సిక్ ఆధారాలను ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. 2020 జనవరి, ఫిబ్రవరిలో టెండర్ల నిబంధనలు మార్చారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. నాణ్యతా ప్రమాణాలకు సైతం వారు తిలోదకాలిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022 మేలో భోలేబాబా సంస్థపై ఫిర్యాదు, విచారణకు ఆదేశించారన్నారు. 2022 ఆగస్టులో బీటా సిటోస్టిరాల్‌తో రసాయనాలు కలిశాయని నివేదిక వచ్చిందని చెప్పారు. అఈఃఖీఏ ల్యాబ్ రిపోర్ట్ వస్తే.. దానిని సైతం తొక్కిపెట్టారన్నారు. 2024 జులై 23న రిపోర్ట్ వచ్చిందని.. అందులోని అంశాలనే భగవంతుడు తనతో చెప్పించాడని సీఎం చంద్రబాబు తెలిపారు. జంతు కొవ్వు కలిసిందని తాను సొంతంగా చెప్పలేదని స్పష్టం చేశారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధనను సైతం తొలగించారన్నారు. 2019 ఆగస్టులో టెండర్ నిబంధనల్లో సడలింపు చేశారని చెప్పారు. టర్నోవర్, పాల సేకరణ సామర్థ్యాన్ని కూడా తగ్గించారని పేర్కొన్నారు. 2020 జనవరిలో శ్రీ వైష్ణవి ప్లాంట్‌ను తనిఖీ చేసి.. ఉత్పత్తి సామర్థ్యం లేకపోయినా నెయ్యి సరఫరాకు అనుమతి ఇచ్చారన్నారు. కేజీకి రూ.329 చొప్పున భోలేబాబాకు నెయ్యి సరఫరా ఆర్డర్ ఇచ్చారని పేర్కొన్నారు. 2022 జూన్‌లో ఫతేపూర్‌లోని భోలేబాబా లాంట్ తనిఖీ చేసి.. డబ్బులు ఇవ్వలేదని ఆ సంస్థపై అనర్హత వేటు వేశారని సీఎం చంద్రబాబు చెప్పారు.

ఒక పథకం ప్రకారం తిరుమల పవిత్రతను దెబ్బ తీసేందుకు కుట్ర చేశారంటూ వైసీపీ నేతలపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. తిరుమలకు ఏ మతస్థులైనా రావొచ్చునని.. అన్యమతస్థులు శ్రీవారి దర్శనానికి వస్తే డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉందన్నారు. అధికారంలో ఉన్నామని నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించారని చెప్పారు. టెండర్ నిబంధనలను పూర్తిగా గాలికొదిలేశారన్నారు. నాటి టీటీడీ బోర్డు చైర్మన్ పీఏ చిన్నఅప్పన్న లంచం తీసుకుని దొరికిపోయారని చెప్పారు. ఇవన్నీ నాటి టీటీడీ చైర్మన్, బోర్డుకు తెలిసే జరిగాయని తెలిపారు. నాడు లడ్డూలో నాణ్యత తగ్గిపోయిందని చాలా ఆరోపణలు వచ్చాయని గర్తు చేశారు. కల్తీ నెయ్యి తయారీకి ముఠాగా ఏర్పడ్డారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. నాటి టీటీడీ చైర్మన్ పీఏ చిన్నప్పన్న రూ.4.5 కోట్ల లంచం తీసుకున్నారన్నారు. నకిలీ సర్టిఫికెట్లతో టెండర్లు దక్కించుకుని రసాయనాల నెయ్యి సరఫరా చేశారని తెలిపారు.

కల్తీ నెయ్యి తయారీకి వివిధ రకాల రసాయనాలు వినియోగించినట్టు దర్యాప్తులో తేలిందని సీఎం చంద్రబాబు వివరించారు.

# కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులకు శిక్షపడాల్సిందే

అంటే ఆయనకూ భాగం ఉన్నట్టే కదా?' అని పవన్ అన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యి ఉపయోగించలేదని ఇప్పటికే తేలిపోయిందన్నారు. నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ అబద్దాలు చెబుతోందని.. అందుకే తాము వివరణ ఇవ్వాల్సి వచ్చిందని పవన్ తెలిపారు. కల్తీ నెయ్యి తయారీలోనూ సృజనాత్మకత చూపించారని.. నెయ్యి కావాలంటే పాల నుంచే కాదు రసాయనాల నుంచీ తయారు చేయొచ్చని నిరూపించారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాధినేత తప్పుచేశారని తానెక్కడా చెప్పలేదని.. అప్పటి టీటీడీ పాలకమండలి తన బాధ్యత నిర్వహణలో విఫలమైందని విమర్శించారు. తాము ఏ ఒక్కరిపైనా ఆరోపణలు చేయడం లేదని.. జగన్ నియమించిన బోర్డు హయాంలోనే తప్పు జరిగిందని డిప్యూటీ సీఎం అన్నారు. నాటి టీటీడీ బోర్డు సభ్యులను మాజీ సీఎం జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారని ప్రశ్నించారు. 'దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవచ్చని జగన్ చెబితే సరిపోయేది.. వెనకేసుకొస్తున్నారంటే మీకూ భాగస్వామ్యం ఉన్నట్టే కదా?' అని అనుమానం వ్యక్తం చేశారు పవన్. అసలు నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ నేతలు చెప్పడమేంటని నిలదీశారు. ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు కుట్ర జరిగిందని సిట్ తేల్చిందని చెప్పారు. నచ్చినవారికి కాంట్రాక్టులు ఇచ్చుకునేందుకు నిబంధనలు సడలించారని పవన్ ఆరోపించారు. రూ.20 కోట్ల లడ్డూలు రసాయనాల నెయ్యితో తయారైనట్టు తేలిందని, రసాయనాలతో తయారైన లక్ష లడ్డూలను అయోధ్యకు పంపారని ఈ సందర్భంగా పవన్ తెలిపారు. కల్తీ నెయ్యి కేసులో దోషులెవరైనా శిక్ష పడాల్సిందేనని స్పష్టం చేశారాయన. ఆ నెయ్యిలో.. ఏ రసాయనాలు ఉన్నాయో శ్రీవారికే తెలియాలన్నారు డిప్యూటీ సీఎం. నెయ్యిలో జంతు సంబంధ రసాయనాలు ఉన్నాయని ఎన్‌డీడీబీ రిపోర్టు ఇచ్చిందని.. అది అసలు నెయ్యే కాదని సీబీఐ సిట్ రిపోర్ట్ ఇచ్చిందని తెలిపారు. ఇది స్వామివారికి కాకుండా ఇతర ఏ మతానికి జరిగినా దేశం గగ్గోలు పెట్టేదని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## భారత్‌ను అమెరికాకు అమ్మేశారు

చేతిలో పెట్టారని మోదీని విమర్శించారు. 'వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులతో ముడిపడిన కారణంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయింది. పార్లమెంటు ప్రసంగంలో కేవలం ఆర్మీ మాజీ చీఫ్ నవరణెళి గురించే నేను మాట్లాడలేదు. నా ప్రసంగం పూర్తికాగానే సొంత మంత్రులను కూడా సంప్రదించ కుండా మోదీ ట్రంప్‌తో మాట్లాడారు. మహిళా ఎంపీలు దాడి చేయాలనుకున్నారంటూ అబద్దాలు చెప్పారు. దానికి బదులుగా అమెరికాతో డీల్‌కు రెడీగా ఉన్నట్టు ఆయన సూటిగా చెప్పి ఉండవచ్చు. మోదీ కళ్లలో భయం స్పష్టంగా కనిపించింది' అని రాహుల్ అన్నారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో ఆదేశంతో ట్రేడ్ ఒప్పందాలను వదులుకోవాలని ఇతర దేశాలు నిర్ణయం తీసుకుంటే, మోదీ మాత్రం మౌనంగా ఉండిపోయారని రాహుల్ విమర్శించారు. 'ఇదే వేదిక నుంచి మోదీని సవాలు చేస్తున్నాను. డీల్‌పై అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున ఆ దేశంతో వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి. ట్రంప్ ఒత్తిడి కారణంగానే డీల్‌ను మోదీ రద్దు చేసుకున్నారు. భారతదేశం అత్యధిక జనాభా కలిగిన దేశం. డాటా కూడా పెద్దదే. కానీ మోదీ మన డాటాను అమెరికాకు ఇచ్చేశారు. ఆయన మీద ఒత్తిడి లేకపోతే ఆ పని చేసేవారు కాదు. తన ప్రతిష్ట, రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు దేశాన్ని ఆయన అమ్మేశారు' అని మోదీపై రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు.

# మార్కెట్లపై ట్రంప్ దెబ్బ...

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్తగా 15 శాతం తాత్కాలిక టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించడంతో ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య ఉద్రిక్తతలు మళ్లీ రాజుకుంటాయన్న భయాలు మొదలయ్యాయి. గతంలో ఆయన విధించిన టారిఫ్‌లు చట్టవిరుద్ధమని అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, ట్రంప్ తాజా హెచ్చరికలు చేయడంతో అంతర్జాతీయ మార్కెట్ల సెంటిమెంట్ దెబ్బతింది. దీని ప్రభావం భారత మార్కెట్లపై కూడా ప్రతికూలంగా పడింది. ఈ అమ్మకాల ఒత్తిడిలో ఐటీ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. అమెరికా టెక్నాలజీ వ్యయంపై ఆందోళనలు, బలహీనమైన గ్లోబల్ సంకేతాలతో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 4.74 శాతం పతనమై 30,053.50 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో ఈ సూచీ రెండేళ్ల కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. ఐటీ తర్వాత రియాల్టీ రంగం 2.54 శాతం నష్టపోయింది. అయితే, మెటల్ ఇండెక్స్ మాత్రం మార్కెట్ పతనంలోనూ కాస్త మెరుగ్గా నిలిచింది. విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి 25,50025,600 స్థాయి కీలక నిరోధకంగా ఉంది. దీనిపైన నిలదొక్కుకుంటేనే మార్కెట్ పుంజుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ 25,300 స్థాయికి దిగువకు పడిపోతే, అమ్మకాల ఒత్తిడి మరింత పెరగవచ్చని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, ఏఐ టెక్నాలజీపై ఆందోళనల కారణంగా మార్కెట్లు సమీప భవిష్యత్తులో అస్థిరంగానే కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గుదల

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గాయని, ఎవరైనా సరే ఆడబిడ్డల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలపై శాసన మండలిలో చర్చ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడారు. సీఎం చంద్రబాబు తీసుకున్న చర్యల వల్లే 20 నెలల్లో రాష్ట్రంలో నేరాలు 6.6 శాతం తగ్గాయని, పోక్సో కేసులు 8 శాతం, మహిళలపై హత్యలు 45శాతం, సామూహిక అత్యాచారాలు 64 శాతం తగ్గాయని తెలిపారు. గతంలో కేసులు నమోదు కాలేదని, కానీ తాము ప్రతి కేసును నమోదు చేయడంతో నేరాల సంఖ్య తెలుస్తోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో శాంతి భద్రతలు లేవు కాబట్టే పెట్టుబడులు, పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోయాయని, బయటకు వచ్చిన మహిళ తిరిగి ఇంటికి వెళ్తుందో లేదో తెలియని దుస్థితి ఉండేదని అనిత విమర్శించారు. గత ప్రభుత్వం ఎ÷-లాన్ ఆఫ్ ఆక్షన్ ఇవ్వకపోవడం వల్ల రూ. 180 కోట్ల కేంద్ర నిధులు కోల్పోయామని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల టీడీపీ ఎమ్మెల్యే ఇంట్లో దొంగతనం కేసులో వైసీపీ గ్రామ సర్పంచ్ అరెస్టయ్యారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ప్రస్తుత ప్రభుత్వం రాజకీయాల కోసం వాడకోవడం లేదని, అందువల్లే రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 25 శాతం తగ్గాయని అనిత పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ నివారణకు ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తున్నామని, ఇప్పటివరకు 96,940 కేజీల గంజాయి సీజ్ చేశామని తెలిపారు. అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబోరేటరీ భవన నిర్మాణాన్ని జగన్ ఆపేశారని, తాము ఫోరెన్సిక్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రప్పా.. రప్పా.. నరుకుతాం' అని శాంతిభద్రతలకు భంగం కలిగిస్తూ రెచ్చగొట్టేలా మాట్లాడితే కేస్సు ÷ల్ చేశామని, వైసీపీ కార్యకర్తలు అసభ్యంగా మాట్లాడితే దాన్ని జగన్ సమర్థించడం దారుణమని అన్నారు. గీత దాటి రెచ్చ గొడుతూ మాట్లాడినా చూస్తూ ఊరుకునేందుకు ఇక్కడ సీఎంగా ఉన్నది జగన్ కాదని, చంద్రబాబు అని అనిత పేర్కొన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ నేతలు చేసిన ఆరాచకాల ఫలితంగానే వారు 151 నుంచి 11 సీట్లకు దిగజారారని విమర్శించారు.

## పులవెందులకు చేరుకున్న జగన్

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల చేరుకున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం, జగన్ పులివెందులకు బయల్దేరి వెళ్లారు. ఆయన ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని సమస్యలు తెలుసుకో నున్నారు. పులివెందులలోని భాకరావిపురం క్యాంప్ ఆఫీస్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలో బస చేస్తారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు పులివెందుల నివాసం నుంచి బయలుదేరి వేంపల్లి మండలం నందిపల్లి చేరుకుంటారు. అక్కడ వెలసిన నూతన నందీశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల సందర్భంగా జరిగే ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం పులివెందుల చేరుకుని భాకరాపురం క్యాంప్ ఆఫీస్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలో బస చేస్తారు.

### హైదరాబాదులో ఇద్దరు ఘరానా దొంగల అరెస్ట్

హైదరాబాద్ నగరం నడిబొడ్డున తీవ్ర కలకలం రేపిన కోఠి కాల్పుల దోపిడీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. జనవరి 31న ఎస్‌బీఐ ఏటీఎం వద్ద వ్యాపారిపై కాల్పులు జరిపి రూ. 6 లక్షలు దోచుకున్న అంతరాష్ట్ర ముఠాలోని ఇద్దరు సభ్యులను అరెస్ట్ చేసినట్టు టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మంగళవారం వెల్లడించారు. నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందినవారని తెలిపారు.

## సిఎం రేవంత్‌ను కలిసిన ఉద్యోగ సంఘాలు

ఉద్యోగులకు ప్రమాద బీమా, ఆరోగ్య పథకాలను ప్రకటించడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఇనర్ణయం తమకెంతో భరోసా నింపిందని అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో టీజీవో, టీఎన్జీవో, రెవెన్యూ, ఉపాధ్యాయ, పెన్షనర్ల తదితర సంఘాల నాయకులు, ఉద్యోగులు కలిసారు. తమ చిరకాల వాంఛను నెరవేర్చారంటూ ముఖ్యమంత్రికి ఉద్యోగ సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండు పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని ప్రశంసలు కురిపించారు. 652 గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్సలకు అవకాశాలు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలోతెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి నేతలు, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నాయకులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, వి.లచ్చిరెడ్డి , కె.రామకృష్ణ ఉన్నారు.

# మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ

కుమ్మ దాదా, సెంట్రల్ కమిటీ సభ్యుడు (సీసీఎం) మల్లారాజి రెడ్డి అలియాస్ సంగ్రామ్ అలియాస్ రంగారం, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు (ఎస్‌సీఎం) నూనె నరసింహా రెడ్డి అలియాస్ గంగన్న అలియాస్ రన్నా దాదా ఉన్నారు. 40 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో పనిచేసిన ఈ అగ్రనేతలు లొంగుబాటు నిర్ణయం తీసుకున్నారు. దీంతో మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తిగా నిర్వీర్యం అయినట్లు పోలీసులు ప్రకటించారు. ఈ నలుగురి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీలో అగ్రస్థాయి బాధ్యతలు నిర్వహించిన ఇద్దరు కీలక నేతలు జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన ఇంకా 11 మంది అజ్ఞాతంలో ఉన్నారని అన్నారు. వారు కూడా త్వరలో జనజీవనంలోకి రావాలని డీజీపీ కోరారు. ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి అడవుల్లో లేరని, బయట ఎక్కడో షెల్టర్ తీసుకున్నట్లు గుర్తించామన్నారు. తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీపై రూ.25 లక్షలు, మల్లారాజి రెడ్డిపై రూ.25 లక్షలు, బడే చొక్కారావు, నూనె నరసింహా రెడ్డిలపై రూ.20 లక్షల చొప్పున నగదు రివార్డు మొత్తాన్ని వారికి అందజేస్తామని ప్రకటించారు. 2019లో తెలంగాణలో మావోయిస్టులు రిక్రూట్‌మెంట్ జరిగిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. 1982లో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్‌లో చేరిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ దండకారణ్యంలో ఆయుధ దళ కార్యకలాపాలు నిర్వహించారు. 1984-89 మధ్య సిరోంచా, పెరిమిలి ప్రాంతాల్లో దళ కమాండర్‌గా పనిచేశారు. 1989లో డివిజనల్ కమిటీ సభ్యుడిగా, 2001లో సెంట్రల్ కమిటీ, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడిగా, 2017లో సీఎంసీ ఇన్‌ఛార్జ్‌గా, తర్వాత పొలిట్ బ్యూరో సభ్యుడిగా(పీబీఎం) ఎదిగారు. 1970లలో ఉద్యమంలోకి వచ్చిన మల్లారాజి రెడ్డి..1980లలో డివిజనల్ కమిటీ, రాష్ట్ర కమిటీ స్థాయికి ఎదిగారు. 1990లో సీసీఎంగా నియమితులయ్యారు. మహారాష్ట్ర, దండకారణ్య ప్రాంతాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2007లో పీబీ సభ్యత్వం, 2010-16 మధ్య ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. 1996లో ఆర్‌ఎస్‌యూ ద్వారా పార్టీలో చేరి 1999-2000లో ఏటూరునాగారం-మహాదేవపూర్ ప్రాంతాల్లో పార్టీ సభ్యుడిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ, ఇతర ప్రాంతీయ కమిటీలలో కీలక బాధ్యతలు చేపట్టారు. నూనె నరసింహా రెడ్డి కూడా రాష్ట్ర కమిటీ స్థాయిలో కీలక పాత్ర పోషించారు. మావోయిస్టు అగ్రనేతలు నలుగురు నేడు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయిన సంగతి తెలిసిందే. దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి(పొలిట్ బ్యూరో కమిటీ మెంబెర్).. మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్(సెంట్రమ్ కమిటీ మెంబెర్).. బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్(తెలంగాణ స్టేట్ సెక్రటరీ).. నూనె నరసింహారెడ్డి అలియాస్ గంగన్న సన్ను దాదా (స్టేట్ కమిటీ మెంబర్) పోలీసుల ముందు లొంగిపోయారు. పోలీసులు ఈ నలుగురినీ మంగళవారం మీడియా ముందుకు తీసుకువచ్చారు.

# శశికళ కొత్త పార్టీ ప్రారంభం

తలైవర్ ఎంజీఆర్, పురట్చి తలైవి అమ్మ అడుగుజాడల్లో పార్టీని ముందుకు తీసుకువెళ్తామని చెప్పారు. పేదలు, బడుగు వర్గాలు, సామాన్య ప్రజానీకం కోసం పార్టీ పాటుపడుతుందని, శత్రువులు, ద్రోహులను ఏరివేస్తామని శశికళ తెలిపారు. పార్టీ జెండాను ఈ సందర్భంగా శశికళ ఆవిష్కరించారు. నలుపు, తెలుపు, ఎరుపు రంగులు కలిగి, అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత చిత్తరువులతో ఈ జెండా రూపొందింది. పార్టీ పేరును త్వరలోనే ప్రకటిస్తామని శశికళ తెలిపారు. 2016లో జయలలిత మరణాంతరం జరిగిన సంఘటనలను శశికళ గుర్తుచేసుకుంటూ, అప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా తనను ముఖ్యమంత్రి కావాలని కోరారని చెప్పారు. 'చిన్నమ్మా... మీరు తప్పనిసరిగా ముఖ్యమంత్రి కావాలి అని వాళ్లంతా నాతో అన్నారు' అని తెలిపారు. అయితే ఆ సమయంలో తాను వ్యక్తిగత పనులు ఉండటంతో అందుకు నిరాకరించానని, ఓ పన్నీరు సెల్వం ముఖ్యమంత్రిగా కొనసాగారని తెలిపారు. ఆ తదుపరి క్రమంలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శశికళను అన్నాడీఎంకే పార్టీ నుంచి బహిష్కరించారు. కాగా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది ప్రథమార్ధంలో జరగాల్సి ఉన్నాయి.

### అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా హామీలు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అన్నాడీఎంకే హామీల వర్షం కురిపించింది. నేరుగా ఆర్థిక సాయం, సబ్సిడీల పెంపు, రుణాల మాఫీ, నిరుద్యోగులు, మత్స్యకారులు, చేనేత కార్మికులు, చిరు వ్యాపారాలను ఆదుకోవడం వంటి కీలక హామీలను అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సాయం అందిస్తామని, ఎప్లాంయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో పేరు నమోదు చేసుకుని ఉద్యోగం కోసం వేచిచూస్తున్న వారికి నెలవారీ సాయంగా రూ.2,000 చొప్పున ఇస్తామని, హైయర్ సెకండరీ వరకూ చదివి యిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో పేరు నమోదు చేసుకున్న వారికి రూ.1,000 చొప్పున నెలవారీ సాయం అందిస్తామని పళనిస్వామి తెలిపారు.

# దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సైన్స్, టెక్నాలజీ, ఆవిష్కరణల రంగాలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో 'సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్' పేరిట కొత్త శాఖను ఏర్పాటు చేసే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పాలనా సౌలభ్యం పెంచి, అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో మొత్తం 55 అజెండా అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో ముఖ్యంగా, ధృవీకరణ పత్రాలు కలిగిన దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు కేబినెట్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపే క్రమంలో విశాఖపట్నంలో రూ. 2,387 కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అదేవిధంగా, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, చీరాల, తిరుపతి, సత్యసాయి జిల్లాల్లో పర్యాటక ప్రాజెక్టులతో పాటు సౌర, పవన, హైబ్రిడ్ ఇంధన ప్రాజెక్టులకు కూడా మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) తీసుకున్న నిర్ణయాలను కూడా కేబినెట్ ధృవీకరించింది. కొల్లేరు అభయారణ్య సరిహద్దుల ఖరారుకు సంబంధించి కేంద్రానికి పంపాల్సిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. అలాగే, ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను ఈ నెల 28న పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆ రోజు అసెంబ్లీకి సెలవు ప్రకటించాలని కూడా తీర్మానించారు. సమావేశం సందర్భంగా రాజమండ్రిలో కల్తీ పాల ఘటన, శ్రీకాకుళంలో డయేరియా కేసులు ప్రబలడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మరో ఆసక్తికర అంశంగా, అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రుల ప్రసంగాలను కృత్రిమ మేధ (ఏఐ) సహాయంతో విశ్లేషిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతిపై చర్చకు మంత్రులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని కూడా సూచించారు. తాజా నిర్ణయాలతో రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

## వైఎస్సార్‌పై చేసిన వ్యాఖ్యలను అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించాలి

ఏపీ అసెంబ్లీలో తిరుమల లడ్డూ కల్తీపై జరుగుతున్న చర్చ ఇప్పుడు వైఎస్ కుటుంబాన్ని రచ్చకీడ్చమే కాకుండా, రాజకీయంగా కొత్త మలుపులు తిరుగుతోంది. వైసీపీ చేసిన తప్పులను తన తండ్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఆపాదించడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'అత్త మీద కోపం దుత్త మీద చూపినట్లు' కూటమి ప్రభుత్వ తీరు ఉందని ఎద్దేవా చేస్తూ, అసెంబ్లీ రికార్డుల నుంచి వైఎస్సార్‌పై చేసిన వ్యాఖ్యలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ హయాంలో ఏడు కొండలను రెండు కొండలు చేయాలని చూశారన్న విమర్శలను షర్మిల గట్టిగా తిప్పికొట్టారు. "జరిగిందంతా తప్పుడు ప్రచారమే. నాడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబే బురద చల్లారు. వాస్తవానికి ఏడు కొండలు వెంకన్నవేనని 2007లో శాశ్వత జీవో ఇచ్చి చరిత్ర సృష్టించింది వైఎస్సార్" అని ఆమె గుర్తు చేశారు. తిరుమల క్షేత్రంలో అన్యమత ప్రచారాన్ని అడ్డుకోవడానికి జీవో 746, 747లను తీసుకొచ్చి కఠిన నిబంధనలు అమలు చేసిన ఘనత తన తండ్రిదేనని, లడ్డూకు 2009లో అంతర్జాతీయంగా పేటెంట్ రైట్స్ సాధించింది కూడా ఆయనేనని స్పష్టం చేశారు. వైసీపీ పాలనను, వైఎస్సార్ సంక్షేమ పాలనను ఒకటిగా చూడవద్దని షర్మిల హితవు పలికారు. "వైసీపీ పాలన దోచుకుతినే పాలన అయితే, వైఎస్సార్ పాలన పేదల సంక్షేమ పాలన. వైసీపీలో అసలు వైఎస్సార్ లేనే లేడు" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజశేఖర్ రెడ్డి ముమ్మాటికీ కాంగ్రెస్ మనిషి అని, కడవరకు కాంగ్రెస్‌లోనే బతికిన ఆయనను వ్యక్తిగతంగా దూషించడం చంద్రబాబుకు భావ్యం కాదన్నారు. వేద పండితుల కోసం 'ఆయుష్మాన్ భవ', దళితుల కోసం 'దళిత గోవిందం' వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్న మహానేతను దేవుడిగా కొలుస్తారని అన్నారు.

# కేరళ..ఇకనుంచి కేరళం

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ కేంద్ర క్యాబినెట్ నేడు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇకపై రాష్టాన్ని 'కేరళం' అని పిలిచేలా సంబంధిత బిల్లుకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. మలయాళీ రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తాజా నిర్ణయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. తమ రాష్ట్రం పేరును మార్చాలనే ప్రతిపాదనలు మలయాళీ ప్రజల నుంచి ఎప్పటినుంచో వినిపిస్తున్నాయి. కేరళను మలయాళంలో 'కేరళం' అని పిలుస్తారని.. ఆ దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ 2023లో ప్రవేశపెట్టిన తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. అయితే.. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు కొన్ని మార్పుల అనంతరం కేరళ అసెంబ్లీ మరోసారి ఆ తీర్మానాన్ని ఆమోదించింది. ఆ తర్వాత ఇది ఇన్నాళ్లూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగా.. ఎట్టకేలకు మంగళవారం గ్రీన్ సిగ్నల్ లభించింది. ఢిల్లీలో ఇటీవల ప్రారంభమైన నూతన 'సేవా తీర్థం' భవనంలో జరిగిన మొదటి క్యాబినెట్ సమావేశం ఇది. మొదటి తీర్మానాన్ని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సమీక్షించిన అనంతరం.. కొన్ని సాంకేతిక మార్పులతో కేరళ అసెంబ్లీ రెండోసారి ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని ప్రతిపాదించిన ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్.. రాజ్యాంగంలోని మూడో అధికరణ ప్రకారం.. ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చిన అన్ని భాషలలో 'కేరళం'గా సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్న సందర్భంలో ఆయన మాట్లాడుతూ.. మలయాళంలో రాష్టాన్ని 'కేరళం' అని పిలుస్తారని, జాతీయ స్వాతంత్య్ర పోరాట సమయం నుంచి మలయాళం మాట్లాడే వర్గాల కోసం ఐక్య కేరళను ఏర్పాటు చేయాలనే డిమాండ్ బలంగా ఉద్భవించిందని అన్నారు.

# ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయండి





## దోర్నాల మండల జనసమీకరణ పరిశీలకులు, ఏపీ సీడ్స్ చైర్మన్ మన్నె సుబ్బారెడ్డి పిలుపు

నంది పత్రిక –డోన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్కాపురం పర్యటనకు విచ్చేస్తున్న నేపథ్యంలో, దోర్నాల మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దోర్నాల మండల జనసమీకరణ పరిశీలకులు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మన్నె సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. మార్కాపురం జిల్లా ఏర్పాటుతో ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిన ముఖ్యమంత్రి, జిల్లా ఏర్పాటు తర్వాత తొలిసారిగా మార్కాపురం వస్తున్నారని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా రూ.456 కోట్లతో చేపట్టనున్న ఫీడర్ కాలువ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని, అనంతరం మార్కాపురం పట్టణంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తారని వివరించారు. దోర్నాల మండలంలోని ప్రతి గ్రామం నుండి ప్రజలు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కేటాయించిన వాహనాల్లో తగు జాగ్రత్తలు తీసుకుంటూ జనసమీకరణ చేసి, సభను గ్రాండ్ సక్సెస్ చేయాలని కోరారు. సమావేశం అనంతరం దోర్నాల సర్కిల్ ఏరియాలో ఇంటింటికీ తిరుగుతూ ఆహ్వాన పత్రికలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు షేక్ మబూ, ఈఎస్ఎస్ చైర్మన్ బట్టు సుధాకర్ రెడ్డి, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు జెడి. లక్ష్మయ్య, జనసేన నాయకులు వెంకట మురళీ, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు ఎరువా మల్లిఖార్జున రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ టీ ఎన్టీ యు సి అధ్యక్షులు ఎదుర మల్లయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు చెంచయ్య మరియు ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిపిఐ సీనియర్ నాయకులు ఎస్. వెంకటేశ్వర్లు మృతికి సంతాపం



నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 24. (నంది పత్రిక ):కర్నూలు జిల్లా సిపిఐ సీనియర్ నాయకులు తుగ్గలి మండల పరిషత్ మాజీ మా అధ్యక్షులు సీలేంద్ర.వెంకటేశ్వర్లు అనారోగ్య కారణాలవల్ల మృతి చెందడం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె రామాంజనేయులు. సిపిఐ నంద్యాల జిల్లా సమితి ఒక ప్రకటనలో సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కే రామాంజనేయులు మాట్లాడుతూ కామ్రేడ్.ఎస్. వెంకటేశ్వర్లు. సిపిఐ కర్నూల్ జిల్లా పూర్వ కార్యదర్శి కామ్రేడ్. చదువుల రామయ్య నాయకత్వంలో సిపిఐ లో చేరి తుగ్గలి మండలంలోని బొంది మడుగుల గ్రామం తో పాటుచుట్టుపక్కల గ్రామాల్లో కరుడుగట్టిన పూడులు భూస్వామ్య పెతందార్లకు వ్యతిరేకంగా గ్రామీణ పేద రైతులు అణగారిన వర్గాల ప్రజల స్వేచ్ఛ కోసం సిపిఐ చేసిన పోరాటంలో కీలకమైన పాత్ర పోషించడం జరిగిందని పలు సందర్భాల్లో ఫ్యూడల్ పెత్తందార్ల దౌర్జన్యాలను ఎదిరించి ప్రజల హక్కుల కోసం అనేక దాడులకు ఎదుర్కొని పోరాటాలు చేసిన నాయకుడని కొనియాడారు. కామ్రేడ్ శీలేంద్ర.వెంకటేశ్వర్లు బొందిమడుగుల గ్రామ సర్పంచ్ గా ఎంపిటిసి సభ్యుడిగా తుగ్గలి మండల ఎంపీపీగా వహిస్తూ గ్రామీణ రైతాంగానికి వ్యవసాయంలో అభివృద్ధి కోసం కృషి చేసే వారని రైతు సంఘం నాయకుడిగా రైతు ఉద్యమంలో పాల్గొంటూ అనారోగ్యానికి గురైన తన తృదిశాస వరకు పార్టీ పట్ల నిబద్ధత పనిచేసి చేశారని కామ్రేడ్ వెంకటేశ్వర్లు మృతి జిల్లా కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని ఆయన మృతి పట్ల సిపిఐ నంద్యాల జిల్లా సమితి కార్యదర్శి ఎన్.రంగనాయుడు జిల్లా సహాయ కార్యదర్శిఎస్. బాబా ఫక్రుద్దీన్ సంతాపాన్ని తెలియజేస్తూ వారి కుటుంబ సభ్యులు కు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది.

# ఐటీ నుంచి క్వాంటమ్.. చంద్రబాబు విజన్‌కు నిదర్శనం

ప్రపంచ చరిత్రను తిరగేస్తే కాలంతో పాటు అప్‌డేట్ కానివారు చరిత్రలో కలిసిపోతారని, మార్పును ముందే పసిగట్టేవారు ప్రపంచాన్ని శాసిస్తారని స్పష్టమవుతోంది. మానవ పరిణామ క్రమంలో వ్యవసాయ విప్లవం నుంచి పారిశ్రామిక విప్లవం వరకు, అక్కడి నుంచి నేటి సమాచార సాంకేతిక (ఐటీ) యుగం వరకు ప్రతి కీలక దశలోనూ మార్పును ముందే గుర్తించి, అందిపుచ్చుకున్న దేశాలే ప్రపంచ యవనికపై ఆధిపత్యాన్ని సాధించాయి. సరిగ్గా నేడు ప్రపంచం మరో చారిత్రక మలుపు వద్ద నిలిచింది. ఆ సరికొత్త విప్లవం పేరే క్వాంటమ్ కంప్యూటింగ్. ప్రస్తుతం ఈ సాంకేతికతలో అమెరికాలోని సిలికాన్ వ్యాలీ, చైనాలోని హైనన్ ప్రావిన్స్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో అమరావతిని కేంద్రంగా చేసుకొని 'క్వాంటమ్ వ్యాలీ'ని నిర్మించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం కేవలం ఒక అభివృద్ధి ప్రాజెక్టు కాదు. అది రాబోయే శతాబ్దపు సాంకేతిక యుద్ధంలో భారత్‌ను అగ్రగామిగా నిలిపే సాహసోపేతమైన ముందడుగు. నాడు హైటెక్ సిటీతో ఐటీ విప్లవానికి పునాది వేసిన విజనరీ లీడర్ నేడు క్వాంటమ్ వ్యాలీతో భవిష్యత్తు ప్రపంచానికి దిశానిర్దేశం చేయబోతున్నారు. క్వాంటమ్ అంటే రాష్ట్ర ఆధునిక సాంకేతిక ప్రగతికి ఒక డిజిటల్ సంతకం. అమరావతికి క్వాంటమ్ వ్యాలీ రావడం వెనుక ప్రధానమంత్రి మోదీ ప్రజాసంకల్పం, ముఖ్యమంత్రి చంద్రబాబు దశాబ్దాల అనుభవం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిబద్ధత, మంత్రి నారా లోకేశ్ ఆధునిక వ్యూహం దాగి ఉన్నాయి. 2025 జనవరిలో దావోస్ వేదికగా జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో.. ఐబీఎం, గూగుల్ వంటి గ్లోబల్ టెక్ దిగ్గజాలతో లోకేశ్ జరిపిన చర్చలే ఈ ప్రాజెక్టుకు బలమైన పునాది వేశాయి. అమరావతిని కేవలం ఐటీ హబ్‌గా కాకుండా, భవిష్యత్తు సాంకేతిక కేంద్రంగా లోకేశ్ ప్రజెంట్ చేయగా, చంద్రబాబు తన రాజకీయ చతురత, అనుభవంతో దీనికి జాతీయస్థాయి ప్రాధాన్యం కల్పించారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి ఆదేశాలతో సీఎంవో నిరంతర పర్యవేక్షణ, వివిధ శాఖలను సమన్వయం చేస్తూ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసింది. ఐబీఎం వంటి సంస్థలతో ఒప్పందాల ఖరారులోనూ కీలక పాత్ర పోషించింది. ఫలితంగా ఫిబ్రవరి 7న అమరావతి చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలైంది. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి జితేంద్రసింగ్‌తో కలిసి శంకుస్థాపన చేయడం ద్వారా రాష్ట్రాన్ని ప్రపంచ క్వాంటమ్ పటంలో నిలిపే చరిత్రాత్మక ముందడుగు పడింది. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి అంతర్జాతీయ దిగ్గజాల భాగస్వామ్యంతో రూపుదిద్దుకుంటున్న ఈ కేంద్రం, దేశంలోనే మొట్టమొదటి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌కు వేదిక కానున్నది. ఆగస్టు నాటికి భవన నిర్మాణం పూర్తి చేసుకుని, డిసెంబర్‌లో కార్యరూపంలోకి రానున్న ఈ ప్రాజెక్ట్ రాష్ట్రానికే కాక దేశానికే గర్వకారణం. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కేవలం మౌలిక సదుపాయాలకే పరిమితం కాకుండా, రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి హైఎండ్ ఉపాధికి ద్వారాలు తెరుస్తోంది. సంప్రదాయ ఉద్యోగాల పరిధిని దాటి సరికొత్త అవకాశాలు ఇక్కడే లభించడంతో మేధో వలసలు తగ్గి, ప్రతిభ అంతా రాష్ట్రానికే సొంతమవుతుంది. ఇప్పటికే 54 వేల మంది విద్యార్థులు క్వాంటమ్ శిక్షణలో పాల్గొనడం ఈ రంగంపై వారికున్న ఆసక్తికి నిదర్శనం కాగా, తెలుగు విద్యార్థులు ప్రపంచ స్థాయిలో సత్తా చాటాలన్న ముఖ్యమంత్రి ఆశయం ఈ పునాదితో వాస్తవరూపం దాల్చుతోంది. క్వాంటమ్ కంప్యూటింగ్ దిశగా రాష్ట్రం అడుగులు వేయడం మొదలుపెట్టిన కొద్ది కాలంలోనే, గన్నవరంలోని మేధా టవర్స్ అంతర్జాతీయ టెక్ దిగ్గజాలకు నిలయంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతపై ఉన్న అచంచల విశ్వాసంతో క్యూక్లారివోయెన్స్, క్యూబీట్స్, సైబ్రానెక్స్, క్వాంటమ్ ఏఐ గ్లోబల్, క్యూబిటెక్, క్వాన్ ఫ్యూయెన్స్ వంటి దాదాపు 30 అగ్రశ్రేణి కంపెనీలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. ఒక నూతన సాంకేతికత వైపు చంద్రబాబు అడుగు వేస్తే, ప్రపంచం మొత్తం అటువైపే నడుస్తుందన్న నమ్మకానికి ఈ 'క్యూ' కట్టిన కంపెనీలే నిదర్శనం. భవిష్యత్తు సాంకేతికతను ముందే పసిగట్టి అమరావతిని గ్లోబల్ హబ్‌గా మారుస్తున్న ఆయన ప్రతిభకు ఈ పరిణామాలు నిలువుటద్దం. ప్రపంచం నేడు పాటు యువతను ఇంతలా ఆకర్షిస్తున్న ఈ క్వాంటమ్ కంప్యూటింగ్ అనేది గణన ప్రక్రియలోనే ఒక అసాధారణ విప్లవం. ఒక చిక్కుముడి నుంచి బయటపడటానికి సాధారణ కంప్యూటర్ ప్రతి దారినీ ఒక్కొక్కటిగా తనిఖీ చేస్తే.. క్వాంటమ్ కంప్యూటర్ ఒకే సమయంలో అన్ని దారుల్లోనూ ప్రయాణించి, క్షణాల్లో సరైన మార్గాన్ని కనిపెడుతుంది. సాధారణ కంప్యూటర్లకు శతాబ్దాల కాలం పట్టే సంక్లిష్ట సమస్యలను క్వాంటమ్ కంప్యూటర్లు కేవలం నిమిషాల్లోనే పరిష్కరిస్తాయి. ఇది కేవలం వేగం పెరగడం మాత్రమే కాదు.. కొత్త మందుల తయారీ నుంచి ఇంటర్నెట్ భద్రత వరకు అసాధ్యాలను సుసాధ్యం చేసే సాంకేతిక విప్లవం. అందుకే, అమరావతిలో నిర్మించే క్వాంటమ్ వ్యాలీ రాష్ట్రాన్ని గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చనుంది. నాడు ఐటీతో మన తలరాత మారినట్లే, రేపు ఈ క్వాంటమ్ వ్యాలీ ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచానికే ఒక దిక్సూచిగా నిలపబోతోంది. ఈ ప్రతిష్ఠాత్మక రంగంలో అడుగుపెట్టడం వల్ల అంతర్జాతీయ రీసెర్చ్ ల్యాబ్స్, గ్లోబల్ టెక్ కంపెనీలు రాష్ట్రాన్ని చూసే దృక్పథం పూర్తిగా మారుతుంది. టెక్నాలజీ పరంగానే కాకుండా, ఈ మార్పు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా దీర్ఘకాలిక ప్రభావం చూపుతుంది. అధిక విలువ కలిగిన పరిశ్రమలు, పరిశోధన ఆధారిత పెట్టుబడులు రావడం వల్ల ఆదాయ వనరులు గణనీయంగా పెరుగుతాయి. దీనివల్ల రాష్ట్రం కేవలం సేవా రంగాలకే పరిమితం కాకుండా, విజ్ఞానమే సంపదగా మారే ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు పడతాయి. ఇది కేవలం నేటి అవసరాల కోసం చేస్తున్న ప్రయత్నం కాదు. రాబోయే తరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఒక వ్యూహాత్మక నిర్ణయం. చంద్రబాబు హైదరాబాద్‌లో హైటెక్ సిటీకి శ్రీకారం చుట్టినప్పుడు వ్యక్తమైన సందేహాలను పటాపంచలు చేస్తూ, ఆ నిర్ణయం ఒక తరాన్ని ఐటీ యుగంలోకి నడిపించింది. సరిగ్గా అదే దూరదృష్టిని నేడు అమరావతి క్వాంటమ్ వ్యాలీ రూపంలో చూస్తున్నాం. అప్పట్లో ఐటీ విప్లవానికి తలుపులు తెరిస్తే, ఇప్పుడు అంతకంటే వేగవంతమైన క్వాంటమ్ యుగానికి రాష్ట్రం ద్వారాలు తెరుస్తోంది. కాలం ఎవరి కోసమూ ఆగదు, మనం కాలంతో పాటు పరిగెత్తాలా? కాలం మనల్ని పక్కన పెట్టాలా? అనే ప్రశ్నకు రాష్ట్రం సగర్వంగా ఇస్తున్న సమాధానమే ఈ క్వాంటమ్ వ్యాలీ.



# గాయాలకు గురైన పశువులకు వైద్యం



బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 24: అగ్ని ప్రమాదంలో ప్రమాదానికి గురై గాయాలకు గురైన పశువులకు వైద్యాధికారులు సిబ్బంది వైద్య సేవలను అందించారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న చిన్న దేవలాపురం గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన ఒక అగ్ని ప్రమాదంలో ఏడు పశువులు పూరి గుడిసెలోనే సజీవ దహనం అయిపోయాయి. ఈ సంఘటన అనంతరం తర్వాత మరో నాలుగు పశువులు కూడా చనిపోవడం జరిగింది. ఈ ప్రమాదంలో చాలా పశువులు కాలిన గాయాలతో మృత్యువాత నుండి తప్పించుకుని బయటపడ్డాయి. గాయాలకు గురైన పశువులకు వైద్యాధికారి అనూష, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సునీల్,ఆహా శివశంకర్ రెడ్డి, రమేష్ తదితరులు వైద్య సేవలను అందించారు. పశువులకు వైద్య సేవలు అందించేందుకు గాను మందులు లేకపోవడంతో, ఈ విషయంపై వెలుగోడు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు వెంటనే స్పందించారు. పశువులకు కావలసిన సెలైన్ బాటిల్లను, సిరపులను మాత్రలను వెలుగోడు, మోత్కూరు పశు వైద్య కేంద్రాల నుండి తెప్పించి చిన్నదేవలాపురం గ్రామానికి పంపించారు. మందులను సకాలంలో ఇక్కడికి పంపించిన ఎడిఏ వెంకటేశ్వర్లుకు, వైద్య సేవలు అందించిన పశువైద్య సిబ్బందికి బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలియజేసింది. చాలా పశువులు మృత్యువాతకు గురి కావడంతో తమ జీవనోపాధికి ఆటంకం ఏర్పడిందని ఈ విషయంలో ప్రభుత్వం తమను ఆదుకోవాలని పాడి రైతు మాబుసా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



# చౌరస్తా బైపాస్ విస్తరణ వేగవంతం

## నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



కర్నూలు నంది పత్రిక.... నగరంలోని చౌరస్తా బైపాస్ రహదారి విస్తరణ పనులను వేగవంతం చేసి ఆర్టీసీ బస్సుల రాకపోకలకు సౌలభ్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. నగరంలోని బళ్ళారి చౌరస్తా బైపాస్ వద్ద మలుపు ప్రాంతంలో ఉన్న మరో రెండు షాపులను తొలగించి రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. మంగళవారం ఆయన సంబంధిత ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ శాఖ అనుమతులు పొందిన అనంతరం తొలగింపు చర్యలు చేపట్టి రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నూతనంగా నిర్మించిన బైపాస్ వద్ద ఆర్టీసీ బస్సులు సులభంగా తిరుగుటకు మలుపు ప్రాంతంలో అడ్డంకులుగా ఉన్న నిర్మాణాలను తొలగించడం అవసరమని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మద్దూర్ నగర్ కారికతీయ పాఠశాల వెనుకనున్న మున్సిపల్ విద్యానవనం (పింగళి సూరన తెలుగు తోట)ను పరిశీలించారు. పార్కు అభివృద్ధి భాగంగా నడకబాట ఏర్పాటు, జిమ్ పరికరాల స్థాపన వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్ఈ రమణమూర్తి, ఇంచార్జ్ సిటి ప్లానర్ వై.వెంకటరమణ, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈ పవన్ కుమార్ రెడ్డి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



# చీకటి నుండి వెలుతురు లోకి సంజీవ నగర్ కాలని.

బేతంచెర్ల ఫిబ్రవరి 24 ( నందిపత్రిక ). బేతంచెర్ల పట్టణ పరిశీలనలో భాగంగా, పట్టణ పరిధిలోగల సంజీవ నగర్ కాలనీ ప్రజల స్థితి గతులపై, బేతంచెర్ల నగర పంచాయితి ఛైర్మెన్ సిహెచ్.చలం రెడ్డి,గత నెలన్నర క్రితం పరిశీలన చేసే సందర్భంలో,సంజీవ నగర్ కాలని ప్రజలు,మా కాలనీ లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని చైర్మన్ ను కోరారు. కమీషనర్ హరి ప్రసాద్ తో మాట్లాడి, సమస్యను పరిష్కరిస్థానని చైర్మన్ వారికి హామీ ఇవ్వడం జరిగింది. ఈ వీధిలైట్ల సమస్యను నగర పంచాయితి కమీషనర్, అధికారులకు ఛైర్మెన్ తెలిపారు. ఛైర్మెన్ తెలిపినా కూడా, వీధిలైట్ల సమస్య పరిష్కారం కాలేదు. దీనిపై భాద్యత కలిగిన ఛైర్మెన్ చెప్పినా కూడా,వీధి లైట్లు ఏర్పాటు చేయక పోవడంతో ఛైర్మెన్ చలం రెడ్డి మన స్థాపంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయ వలసి వస్తుందని అన్నారు. దీనిపై రాజకీయ రగడ మొదలై, ఇరు వర్గాల లోకల్ నాయకులు, ఒకరిపై ఒకరు మరీ ప్రెస్ మీట్లు పెట్టి, పై స్థాయి నాయకులపై భారీగా విమర్శలు చేసుకున్నారు. ఇది విన్న, తెలుసుకున్న, ప్రజానీకం ఆశ్చర్య పోయారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలే గాని మాటల యుద్ధాలు ప్రజలకు ఉపయోగ పడవని పలువురు చర్చించు కున్నారు. ఎట్టకేలకు మంగళవారం నగర పంచాయితి సిబ్బంది సంజీవ నగర్ కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేయడం జరిగింది. చిమ్మ చీకటి నుండి వెలుగు కాంతులు రావడంతో, హనుమాన్ నగర్ కాలనీ ప్రజలు సంతోషంతో,నగర పంచాయితి ఛైర్మెన్ చలం రెడ్డికి, కమీషనర్ హరిప్రసాద్ కు కృతజ్ఞ తాభివందనములు తెలియ జేశారు.



# నరసింహ మాలాధారులు అహోబిలంకి పయనం



శిరివేళ్ళ:; (నంది పత్రిక) సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి గురు స్వామి లక్ష్మీ నరసింహుడు ఆధ్వర్యంలో మాలదారులు సుమారు 30 మంది భక్తులు స్వామి మాల ధరించిన స్వాములు 41 రోజులు పాటు భక్తిశ్రద్ధలతో, నియమ నిష్ఠలతో కఠోర దీక్ష, చేసి, ప్రత్యేక పూజలు, దీక్ష విరమణ చేసి అహోబిలానికి మంగళవారం బయలుదేరారు. 11 మంది స్వాములు కాలినడకన అహోబిలానికి బయలుదేరారు. స్థానిక రామాలయం లో గురుస్వాములతో ఇరుముడి కట్టించుకుని మేళతాళాలతోబయలుదేరారు. ఈ కార్యక్రమంలో భక్తులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డబ్బులు ఇస్తే ఉద్యోగాలు రావు ..

**పోటీ పరీక్షలు , ప్రతిభ ఆధారంగానే ప్రభుత్వ , ప్రవేట్ ఉద్యోగాలు వస్తాయి ...**

**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ .**

**ఏ ప్రభుత్వ, ప్రవేట్ ఉద్యోగాలు కూడా మధ్యవర్తుల ద్వారా రావు.**

**నిరుద్యోగ యువత దళారుల మాటలు నమ్మి, డబ్బులు ఇచ్చి, మోస పోవద్దు .**

**నిరుద్యోగ యువత మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి.**

కర్నూలు నంది పత్రిక...... ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కొందరు వ్యక్తులు నిరుద్యోగ యువత నుండి డబ్బులు తీసుకొని మోసాలు చేస్తున్నారనే ఫిర్యాదులు ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందుతున్నట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మంగళవారం తెలిపారు. ఈ సంధర్బంగా కర్నూలు ఎస్పీ మాట్లాడుతూ ... ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ లో ఉద్యోగాలు, కోర్టులో ఉద్యోగాలు , స్టాఫ్ నర్స్, ఫీల్డ్ అసిస్టెంట్, సాఫ్ట్ వేర్ జాబ్స్ , బ్యాంకులలో ఉద్యోగాలు, ఫుడ్ కార్పోరేషన్ , విద్యుత్ శాఖ , అగ్రికల్చర్ , రెవిన్యూ శాఖ, ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ లలో జూనియర్ అసిస్టెంట్ , కంప్యూటర్ ఆపరేటర్ , క్లర్క్ అంటూ పలు రకాల ఉద్యోగాల పేరుతో వివిధ రకాలుగా దళారులకు డబ్బులు ఇచ్చి యువత మోసపోతూనే ఉన్నారన్నారు .

అమాయకులను లక్ష్యంగా ఎంచుకుని కొందరు మోసాలకు పాల్పడుతున్న నటువంటి సంఘటనల పై కేసులు నమోదు అవుతూనే ఉన్నాయన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించే వారికి ఇంకా డబ్బులు ఇచ్చి మోసపోతూనే ఉన్నారన్నారు. ఎక్కడైనా, ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసే వారి సమాచారాన్ని స్థానిక పోలీసు స్టేషన్ లలో లేదా డయల్ 112 కు గాని లేదా డయల్ 100 కు గాని ముందుగానే ఫిర్యాదు చేసి తెలియజేయాలన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసే వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగాల పేరుతో మోసపోతున్న ఫిర్యాదులు ఎక్కువగా అవుతున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు కేవలం పోటీ పరీక్షలు మరియు ప్రతిభ ఆధారంగానే లభిస్తాయని , ఎవరైనా మధ్యవర్తులు డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పడం పూర్తిగా మోసపూరితమన్నారు. ప్రైవేట్ రంగంలో కూడా అర్హతలు, నైపుణ్యాలు మరియు ఎంపిక విధానాల ప్రకారమే నియామకాలు జరుగుతాయన్నారు.

**యువత మోసపోవద్దని హెచ్చరించారు.** కర్నూలు ఎస్పీ గారి ప్రజలకు సూచనలు ఉద్యోగాల పేరుతో ఎవరికి కూడా డబ్బులు చెల్లించవద్దు. అధికారిక నోటిఫికేషన్లు మాత్రమే నమ్మాలి. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు వచ్చినప్పుడు వెంటనే పోలీసులకుతెలియజేయాలి. యువత తమ ప్రతిభపై నమ్మకం ఉంచుకుని కష్టపడి చదివి పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని, మోసగాళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఉద్యోగాల పేరుతో దళారుల



మాటలు నమ్మిమోసపోవద్దని, డబ్బులు ఇచ్చి నష్టపోవద్దని పోటీ పరీక్షలు, ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా యువతకు, విద్యార్థులకు, జిల్లా ప్రజలకు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ విజ్ఞప్తి చేశారు.

# దారి దోపిడీ కేసులో

## బంగారు పేట వాసి అరెస్ట్...

**కర్నూల్ నాల్గవ పట్టణ సీఐ విక్రమసింహా.**



కర్నూలు నంది పత్రిక...... ఈ నెల 7 వ తేదీన కర్నూల్ 1 టౌన్ ఏరియా, గడ్డ స్ట్రీట్ లో నివాసముండే షైక్ ఖలీల్ బాషా అను వ్యక్తి కర్నూల్ 4 వ పట్టణ పోలీస్ స్టేషన్ లోని సంపత్ నగర్ లో ఉన్న తన కార్పెంటర్ షాపులో పని చేస్తూ, పని ముగుంచుకొని రాత్రి గడ్డ స్ట్రీట్ లోని వారి ఇంటికి వెళ్లే మార్గం లో తన హీరో ఎఖీ డీలక్స్ మోటార్ సైకిల్ నెంబర్ ాూ21ాఖ 6496 పై ఐరా హాస్పిటల్ నుండి పాత ఈద్గా వైపుగా వెళ్తున్న సమయం లో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి తన మోటార్ సైకిల్ కి అడ్డు వచ్చి డబ్బులు అడిగి, ఇవ్వనందున అతన్ని కొట్టి, తన వద్ద ఉన్న రియల్ మీ స్మార్ట్ ఫోన్ ను మరియు తన మోటార్ సైకిల్ ను ఎత్తుకెళ్లిపోయాడన్న ఫిర్యాదు పై 4 ్ర టౌన్ పోలీస్ స్టేషన్ నందు దోపిడీ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా దొంగలించ బడిన మోటార్ సైకిల్ యొక్క ఆచూకి ని కనుగొని సదరు మోటార్ సైకిల్ ని మరియు రియల్ మీ స్మార్ట్ ఫోన్ ను దొంగలించుకుపోయిన బంగారుపేట కి చెందిన నిందితుడు గిడ్డయ్య ని కోడుమూరు రోడ్ లోని రిలయన్స్ మార్ట్ వద్ద ఈరోజున మధ్యాహ్నం అరెస్ట్ చేసి, దొంగలించబడిన మోటార్ సైకిల్ ని, స్మార్ట్ ఫోన్ ని అతని వద్ద స్వాదీనం చేసుకొని రిమాండ్ కి తరలించడమైనది.

# దేశ అభివృద్ధికి బలమైన పునాది ఖచ్చితమైన జనగణన గణాంకాలు





**పారదర్శకంగా, సమగ్రంగా డేటా సేకరణ చేయాలి**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**

నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 24(నంది పత్రిక):- దేశ అభివృద్ధి ప్రణాళికలకు జనగణన గణాంకాలు బలమైన పునాది వంటివని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని అయ్యలూరు మెట్టలో ఉన్న ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కాలేజిలో నిర్వహించిన జనగణన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ దేశ అభివృద్ధి ప్రణాళికలకు జనగణన గణాంకాలు బలమైన పునాది వంటివని ఖచ్చితమైన, సమగ్రమైన మరియు పారదర్శక సమాచార సేకరణ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు స్పష్టమైన దిశానిర్దేశం లభిస్తుందని తెలిపారు. జనగణన ప్రక్రియలో ప్రతి అధికారి అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని, ఇంటింటి సమాచారాన్ని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నమోదు చేయాలని ఆదేశించారు. సేకరించిన గణాంకాల ఆధారంగానే విద్య, వైద్యం, ఉపాధి, గృహనిర్మాణం మరియు మౌలిక వసతుల ప్రణాళికలు రూపుదిద్దుకుంటాయని పేర్కొన్నారు. కాబట్టి ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా పని చేయాలని సూచించారు.

**జనాభా గణన ముఖ్య సూచనలు** డూప్లికేషన్ నివారణ: ఒకే వ్యక్తి వివరాలు రెండుసార్లు నమోదు కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఇతర ప్రాంతాల్లో చదువుకునే లేదా ఉద్యోగం చేసే వారి నమోదుపై స్పష్టత తీసుకోవాలి. ఒకే చోట నమోదు: వ్యక్తి ఎక్కడ నమోదు కావాలనుకుంటున్నారో నిర్ధారించుకుని, ఒకే చోట నమోదు చేయాలి. సంస్థాగత గణన: హాస్టళ్లు, ఆశ్రమాలు, ఎన్‌జీఓలు నిర్వహించే వసతి గృహాలలో నివసించే వారిని 'ఇన్స్టిట్యూషన్' కింద పరిగణించి నమోదు చేయాలి. శిక్షణ ప్రాముఖ్యత: ఎన్నికల శిక్షణకు ఇచ్చే ప్రాధాన్యతతోనే సెన్సస్ శిక్షణను కూడా తీసుకోవాలని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను కిందిస్థాయి సిబ్బందికి సమగ్రంగా వివరించాలని సూచించారు. అధికారుల సహకారం: సిపిఓ, స్టాటిస్టికల్ అధికారులు మరియు ఛార్జ్ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. గౌరవ వేతనం: విధులు పూర్తి చేసిన అనంతరం నిబంధనల ప్రకారం సిబ్బందికి, ఛార్జ్ అధికారులకు గౌరవ వేతనం మరియు ఇతర ఖర్చులు చెల్లించబడతాయని వెల్లడించారు. ఖచ్చితమైన డేటా లక్ష్యం: జిల్లాకు సంబంధించిన 'ప్యూర్ డేటా' సేకరణే ప్రధాన లక్ష్యమని, పర్ఫెక్షన్‌తో పని చేయాలని నొక్కి చెప్పారు.

**ప్రశ్నావళి మరియు సేకరించాల్సిన వివరాలు** ఈ జనాభా గణనలో మొత్తం 33 ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. వీటి ద్వారా సేకరించిన సమాచారం ప్రభుత్వ విధానాల రూపకల్పనకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నివాస గృహం కచ్చా లేదా పక్కా ఇల్లు అన్నది నమోదు చేయాలి. త్రాగునీటి వనరులు, టాయిలెట్ సౌకర్యం, గ్యాస్ కనెక్షన్ వంటి వివరాలు నమోదు చేయాలి. కుటుంబాల సామాజిక, ఆర్థిక స్థితిగతులు మరియు మౌలిక వసతుల లభ్యతపై సమాచారం సేకరించాలి. కులం వివరాలు నమోదు చేసేటప్పుడు వారు చెప్పినదే నమోదు చేయాలి; ఎట్టి పరిస్థితుల్లోనూ డాక్యుమెంట్లు అడగరాదు డ్రాప్‌డౌన్ జాబితాలో లేని కులాలైతే 'ఇతర కులాలు' కింద నమోదు చేయాలి.

**కీలక మార్గదర్శకాలు** ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించాలి. ప్రశ్నావళిపై ప్రజలకు స్పష్టతనిచ్చి సమాధానాలు పొందాలి.

ప్రభుత్వం నిర్దేశించిన ఫార్మాట్‌లలోనే సమాచారం నమోదు చేయాలి. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ డేటా సేకరణ జరగాలి. వ్యక్తిగత వివరాల గోప్యతను కాపాడాలి. నిర్ణీత గడువులోపు గణన ప్రక్రియ పూర్తి చేయాలి.

**ప్రత్యేక సూచనలు** ప్రతి 1000 మంది జనాభాను ఒక యూనిట్‌గా పరిగణించి సుమారు నాలుగు బ్లాకులుగా విభజించి గణన నిర్వహించాలి. చెంచు పెంటలు, దూర ప్రాంత నివాసాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. గ్రామ పరిధి స్పష్టతతో నివాసాల గుర్తింపు జరపాలి. జనాభా, భౌగోళిక విస్తీర్ణాన్ని బట్టి తగిన సంఖ్యలో ఎన్యుమరేటర్లను నియమించాలి. ఏ ఒక్క వ్యక్తి గణనకు దూరం కాకుండా సమగ్రతతో పని చేయాలి. శిక్షణ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ & చీఫ్ ప్రిన్సిపల్ సెన్సెస్ ఆఫీసర్ డా. జగన్నాథ్ మజ్హి, డిప్యూటీ డైరెక్టర్ & డిప్యూటీ చీఫ్ ప్రిన్సిపల్ సెన్సెస్ ఆఫీసర్ దిబ్బకర్ బరిహ, జిల్లా ఇన్చార్జి స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ జి. విష్ణుమాధురి, డైరెక్టరేట్ శిక్షకులు మోహన్ రమణ, అమిత్ సింగ్, దీపక్ భరద్వాజ్, డిఆర్ఓ రామునాయక్, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీఓలు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# ముగిసిన కౌలు రైతుల నిరసన దీక్షలు.

**కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాము..**

**జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు.**



నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి24(నంది పత్రిక):- 30 గంటల పాటు సాగిన కౌలు రైతుల దీక్షలు విజయవంతంగా ముగిశాయి. తమకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేసీ పెట్టుబడి సాయం కింద 20 వేల రూపాయలు తక్షణమే తమ ఖాతాల్లో వేయాలని 30 గంటల పాటు కౌలు రైతులు నంద్యాల కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. చివరి రోజు జరిగిన ఈ దీక్షల్లో కౌలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు, తన సిబ్బంది కళ్యాణ్ కుమార్, అయూబ్ భాష లతో కలిసి కౌలు రైతులు చేపట్టిన దీక్షా శిబిరం వద్దకు వచ్చి కౌలు రైతుల సమస్యలను, డిమాండ్లను జిల్లా ఉన్నతాధికారులు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చి దీక్షలను విరమింప చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి .రామచంద్రుడులు వ్యవసాయ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకు కౌలు రైతుల సంఖ్య పెరిగిపోతుందని, ప్రభుత్వం ఇచ్చే గుర్తింపు కార్డుల సంఖ్య తగ్గిపోతుందని, ప్రభుత్వాలు ప్రకటించే సంక్షేమ పథకాలు అందడం లేదని, ఎన్నికల సందర్భంగా పెట్టుబడి సహాయంగా రైతులందరికీ ఇస్తామన్న 20వేల రూపాయలు జిల్లాలోని ఏ ఒక్క కౌలు రైతుకు దక్కలేదని, తమరు వెంటనే జోక్యం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఒకే విడతలో కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం అమలు జరపాలని విన్నవించుకుంటూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి చీ.వెంకటేశ్వర్లు గారు మాట్లాడుతూ తమ డిమాండ్స్ ను వెంటనే కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కౌలు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం దీక్ష లో పాల్గొన్న రైతులను ఉద్దేశించి కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి .రమేష్ కుమార్, మాజీ కౌలు రైతు సంఘం నాయకుడు పి. నరసింహ, సిఐటియు నాయకులు వి .బాల వెంకటే లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో రైతాంగ సమస్యలను చర్చించడం లేదని, ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను మరిచిపోయారని అన్నారు. గతంలో ఉన్న కౌలు చట్టాలను మార్పు చేసి నూతన కౌలు చట్టం తీసుకువస్తామని, ఈ క్రాప్ నమోదు ఆధారంగా ప్రభుత్వ పథకాలు కౌలు రైతులకు వర్తింప చేస్తామని, అన్నదాత సుఖీభవ పథకం అందరికీ అమలు జరుపుతామని సీఎం హామీలు తమ పరిపాలన రెండు సంవత్సరాలు కావస్తున్న అమలు నోచుకోకపోవడం అన్యాయం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతులందరూ సంఘటితంగా నిలబడి తమ హక్కులు సాధించుకునే వరకు పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహుడు, ఉపాధ్యక్షుడు మార్క్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తెలుగు రామచంద్రుడు ,డేవిడ్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గోస్పాడు, నంద్యాల, బండి ఆత్మకూరు, పాణ్యం మండలాల కౌలు రైతులతో పాటు రైతు సంఘాల నాయకులుటి.గు రెడ్డి, కెజె శ్రీనివాసులు, ఏలియా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 26 నుండి జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభం




**ప్రతి ఒక్క జనసేన కార్యకర్త సద్వినియోగం చేసుకోవాలి**

కర్నూలు నంది పత్రిక..... జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు ప్రక్రియ ఫిబ్రవరి 26వ తేదీ నుండి ప్రారంభం కానుందని కర్నూలు పార్లమెంట్ ఉద్యమి సభ్యత్వ పర్యవేక్షకులు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింత సురేష్ బాబు మంగళవారం జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గానికి 70 నుండి 100 మంది సాధిక్ లను ఎంపిక చేసామని వారు ప్రతి ఒక్క కార్యకర్తని జనసేన ఉద్యమి సభ్యత్వం చేస్తారని ప్రతి ఒక్క జనసేన కార్యకర్త సద్వినియోగం చేసుకోవాలని ఈ ప్రక్రియ ఫిబ్రవరి 26 నుండి మార్చి 10వ తేదీ వరకు కొనసాగనుంది అని అన్నారు. జనసేన ఉద్యమ సభ్యత్వం పొందిన కార్యకర్తకు ప్రమాదవశాత్తు ఏదైనా ప్రమాదం జరుగుతే 50వేల రూపాయల వరకు హాస్పిటల్ ఖర్చు మరియు ప్రమాదవశాత్తు మరణిస్తే 5 లక్షల వరకు బీమా వర్తిస్తుందని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో వందల మంది జనసైనికులు ప్రమాదవశాత్తు మరణించారని వారికి 5 లక్షల రూపాయల చెక్కు రూపంలో పవన్ కళ్యాణ్ గారు అందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జులు, సమన్వయకర్తలు షేక్ హర్షద్, అకెపోగు రాంబాబు, జవాజి రేఖ, మల్లప్ప, లక్ష్మన్న, సిజి రాజశేఖర్, ప్రభుత్వంలో వివిధ హోదాలో ఉన్న డైరెక్టర్లు పి.బి.వి సుబ్బయ్య, ఉదయ్ కుమార్, జనసేన ఐటి కోఆర్డినేటర్ లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# కామ్రేడ్ జీవీ కొండారెడ్డికి ఘనంగా నివాళి



కోయిలకుంట్ల ఫిబ్రవరి 24నందిపత్రిక కామ్రేడ్ జీవి కొండారెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం కోయిలకుంట్ల గాంధీ సెంటర్ లో ఉన్న కామ్రేడ్ జీవీ కొండా రెడ్డి మెమోరియల్ గ్రంథా లయంలో కోయిలకుంట్ల తాలూకా యువ సమాఖ్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా ఆయనకు నివాళి అర్పించారు . ఈ సమావేశం లో దాట్ల సుబ్బారెడ్డి,,రాంపుల్లయ్య నజీర్ గారలు ఆయనతో కలిసి పనిచే సినపటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని ఘనంగా నివాళులు అర్పించారు.. ఈ సమావేశం లో విశ్రాంత ఉద్యోస్త్రఉ శేఖర్ కుమార్,, నారాయణ,, సంతపేట మస్తాన్,, గుద్దేటి వెంకట సుబ్బా రెడ్డీ,, షేక్ జాఫర్,, గ్రంథా లయ పాఠకులు పాల్గొన్నారు

# నైపుణ్య నిధిగా "స్టార్ట్ అప్ కడప" అభివృద్ధి..!!



## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి "స్టార్ అప్ కడప" ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సెంటర్ నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష

## నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**కడప, చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 24 : నంది పత్రిక** జిల్లా యువతకు నైపుణ్య నిధిగా రూపుదిద్దుకుంటున్న "స్టార్ట్ అప్ కడప" ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సెంటర్.. రాష్ట్రానికే స్ఫూర్తిగా నిలవనుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో పి4 విధానం ద్వారా జిల్లాలో ఇన్నోవేటీవ్ గా నిర్మిస్తున్న "స్టార్ట్ అప్ కడప" ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సెంటర్ నిర్మాణ పనుల పురోగతిపై జేసీ డా. నిధి మీనా తోకలిసి.. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆశించే స్థాయి నుండి శాశించే స్థాయికి ఎదగాలంటే ప్రతిఇంటి నుండి ఒక స్టార్ట్ అప్ గా ఎదగాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి జిల్లా యంత్రాంగం చేసిన సూపకల్పన ప్రతి యువతకు ఆదర్శనీయం అన్నారు. ఇలాంటి స్టార్ట్ అప్ కడప కార్యక్రమాన్ని ఆకాంక్ష జిల్లా కడపలో ప్రప్రథమంగా ఏర్పాటు చేస్తున్నామని చెప్పడానికి గర్వపడుతున్నాం అన్నారు. జిల్లాలో రూపుదిద్దుకుంటున్న "స్టార్ట్ అప్ కడప" ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సెంటర్.. యువ స్టార్టప్ వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థల అభివృద్ధికి పునాది వేస్తూ, కడపను వ్యాపార అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కీలక పాత్ర పోషించనుందన్నారు.స్టార్టప్ కడప" కేవలం ఒక భవనం మాత్రమే కాదని.. ఇది యువత కలలకు రూపురేఖలు ఇచ్చే వేదిక అన్నారు. ఆవిష్కరణ, ఆధునికత, అభివృద్ధికి దిక్సూచిగా నిలవనుందన్నారు. కడపను పారిశ్రామిక, సాంకేతిక దిశలో ముందుకు నడిపించేందుకు ఇది ఒక మంచి విజ్ఞాన, ఉద్యోగ, ఉపాధి వనరుగా ఉపయోగపడనుందన్నారు. కడప జిల్లా ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరిచే దిశగా.. "స్టార్ట్ అప్ కడప" పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన.. నిర్మాణ ప్రాజెక్ట్ కు సంబంధించిన వివరాలను బిల్డింగ్ నమూనా మ్యాపు ద్వారా వివిధ విభాగాల నిర్వహణకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఏడిపి ప్రొఫెషనల్స్, అధికారులు, "స్టార్ట్ అప్ కడప" గురించి పలువురు వారి అభిప్రాయాలను జిల్లా కలెక్టర్ తో పంచుకున్నారు. "స్టార్ట్ అప్ కడప" నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్..! మంగళవారం మధ్యాహ్నం కడప ఆర్ట్స్ కాలేజ్ సమీపంలో నిర్మణంలో ఉన్న పి-4 "స్టార్టప్ కడప" సెంటర్ నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. నాణ్యతలో ఎలాంటి రాజీలేకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబందిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, , కెఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, డిఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, హౌసింగ్ పీడి రాజా రత్నం, స్టెప్ సీఈవో నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, ఏడిపి యంగ్ ప్రొఫెషనల్స్ తదితరులు పాల్గొన్నారు



# సిలిండర్లు బ్లాక్ లో విక్రయిస్తే చర్యలు



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 24:** ప్రభుత్వం గృహ అవసరాల కోసం వినియోగదారులకు సబ్సిడీ రూపంలో అందించే గ్యాస్ సిలిండర్లు వాణిజ్య వ్యాపారస్తులకు విక్రయిస్తే సంబంధిత గ్యాస్ ఏజెన్సీ లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జ్యోతి రవిబాబు హెచ్చరించారు. బండి ఆత్మకూరులో ఆకస్మికంగా నిర్వహించిన తనిఖీలలో గృహ అవసరాలకు వినియోగించే హెచ్పి గ్యాస్ సిలిండర్లు కనిపించడంతో ఏజెన్సీలకు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బండి ఆత్మకూరు బస్టాండ్ ఆవరణంలో పలు హోటలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటళ్ల లో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లు కనిపించడంతో హోటల్ యజమానులను తీవ్రంగా హెచ్చరించారు. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లు బ్లాక్ లో కానీ అధిక రేట్లకు వాణిజ్య వ్యాపారస్తులకు అమ్మినట్లు తమ దృష్టికి వస్తే ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వినియోగదారులు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు వినియోగించాలని సూచించారు. 19 కేజీల బరువు గల వాణిజ్య సిలిండర్లు మాత్రమే వినియోగించాలని పేర్కొన్నారు. ఆయన వెంట డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసులు , బండి ఆత్మకూరు వీఆర్వోలు నాగార్జున, రవీంద్ర తదితరులు ఉన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎన్ఎండి ఫిరోజ్



**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 24 ( నంది పత్రిక )** నంద్యాల నియోజకవర్గంలో మంత్రి ఫరూక్ తనయుడు నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ప్రజలకు నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు. ప్రజలు ఆపద సమయాల్లో అందించే మెడికల్ రీయబర్స్మెంట్ ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్దిదారులకు ఈరోజు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో 36 మంది లబ్ధిదారులకు 23 లక్షల 25 వేల 962 రూపాయలు పంపిణీ చేయడం జరిగిందన్నారు ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ వ్యాప్తంగా 23 లక్షల రూపాయలకు పైగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధ్యత కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని తెలిపారు . కూటమి ప్రభుత్వం అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న లబ్ధిదారులకు ఆర్థికంగా ఆదుకునేందుకు సహాయ నిధిని అందిస్తున్నట్లు తెలిపారు . నంద్యాల టౌన్ , నంద్యాల మండలం మరియు గోస్పాడు మండల ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించారు . ముఖ్యమంత్రి సహాయ నిధిని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రులు నారా లోకేష్ , ఎన్ఎండి ఫరూక్ లతో పాటు ఫిరోజ్ , ఫయాజ్ లకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్ , గోస్పాడు మండల టిడిపి కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి , కౌన్సిలర్ నాగార్జున, బీసీ సాధికార సమితి కన్వీనర్ గోవింద్ నాయుడు, ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర సురేష్ కుమార్ , షేక్ మున్న మరియు టిడిపి నాయకులు పాల్గొన్నారు




# ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు : పోతిరెడ్డి నాగార్జున రెడ్డి



**పోరుమామిళ్ల ఫిబ్రవరి24 (నంది పత్రిక ):** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రమంగా నిర్వీర్యం చేస్తున్నాయని మాజీ పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి విమర్శించారు. 2006 ఫిబ్రవరి 2న కేంద్ర ప్రభుత్వం చట్టం ద్వారా ఈ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. గ్రామీణ కూలీలకు ఏడాదికి 100 రోజుల పని కల్పించడం, వలసలను అరికట్టడమే లక్ష్యంగా అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో ఈ పథకాన్ని ప్రారంభించారని చెప్పారు. గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులతో ఈ పథకం అమలయ్యేదని, ప్రస్తుతం కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భారం మోపుతోందని విమర్శించారు. దీనివల్ల రాష్ట్రాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందన్నారు. ముందుగా రాష్ట్రం తన వాటా విడుదల చేస్తేనే కేంద్రం నిధులు ఇస్తున్న పరిస్థితి వల్ల కూలీలకు సమయానికి పనులు దక్కడం లేదని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి 95 వేల కోట్ల రూపాయలకే పరిమితం చేయడం వల్ల పాత బకాయిలు తీర్చడానికే సగం నిధులు సరిపోతున్నాయని, క్షేత్రస్థాయిలో 125 రోజుల పని దినాలు దక్కడం కష్టమవుతోందని విశ్లేషకులు కూడా చెబుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఐదు కిలోమీటర్ల పరిధిలోనే పనులు కల్పించేవారని, ఇప్పుడు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎండాకాలంలో మజ్జిగ, టెంట్లు, పనిముట్లు అందించే పద్ధతి కూడా కనుమరుగైందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు కొత్త నియామకాలు లేకపోవడంతో అదనపు బాధ్యతలు వేస్తున్నారని, ఫోటోలు అప్‌లోడ్ చేసే నిబంధనలు కూలీలకు, మేటీలకు భారంగా మారాయని తెలిపారు. దేశంలో ఒకప్పుడు ఉపాధి హామీ పథకంలో ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా నిలిచిందని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా బలహీన కుటుంబాలు ఉపాధి హామీపై ఆధారపడే పరిస్థితి తగ్గిపోయిందన్నారు.అదే సమయంలో ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తే రైతులు బాగుపడతారని పోతిరెడ్డి నాగార్జున రెడ్డి సూచించారు. చెరువుల మరమ్మతులు, కాలువల శుభ్రత, పొలాల సరిహద్దుల పనులు, వర్షపు నీటి సంరక్షణ వంటి పనులను ఉపాధి హామీ ద్వారా చేయిస్తే రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. అలా చేస్తే కూలీలకు పని, రైతులకు సాగునీరు, గ్రామాలకు అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రస్తుత విధానాలు కొనసాగితే రాబోయే రోజుల్లో ఉపాధి హామీ పథకం పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.



# మాదిగలపై దాడులు, హత్యలు చేస్తే సహించం

## దళితులపై దాడులను అరికట్టండి

## ఏపీ ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ



**కర్నూలు నంది పత్రిక ......** సోమవారం హత్యకు గురైన అడ్డాకుల మనోహర్ కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యాన్ని చెప్పిన ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ కర్నూలు జిల్లాలో దళితుల పైన ముఖ్యంగా మాదిగలపై దాడులు, హత్యలు రోజు రోజుకు పరంపరంగా కొనసాగుతున్నప్పటికీ అరికట్టడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలం చెందిందని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ మంగళవారం స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సోమవారం కర్నూలు నగరంలో కండేరి ప్రాంతంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన మనోహర్ పైన మరి కొంతమంది మీద బీసీ సామాజిక వర్గానికి చెందిన బెస్త (తెలుగు వారు) విచక్షణ రహితంగా వెంటాడి వేటాడి మారుణాయుధాలతో దాడి చేసి పాశవికంగా హత్య చేయడం హేయమైన చర్య అని దీనిని ఏపీ ఎమ్మార్పీఎస్ తీవ్రంగా ఖండిస్తోంద న్నారు. పోలీసు యంత్రాంగం ప్రదర్శిస్తున్న ఉదాసీనత వైఖరి వల్లే మాదిగలను రోజురోజుకు చంపుతున్నారని ఆవేదన చెందారు. ఏడాది గడవక ముందే ఆలూరులో లక్ష్మీనారాయణ ను, కర్నూలు నగరంలో సంజన్న ను, తుగ్గలి మండలం బొందిమడుగులలో టి.ఎమ్. రమేష్ మాదిగను నేడు కర్నూలు నగరంలో మనోహర్ ను పొట్టన పెట్టుకున్నారని దుయ్యపడ్డారు. ఆదిపత్య కులాలకు చట్టాలు చుట్టాలుగా మారడంతో, శిక్షలు కఠినంగా లేకపోవడంతో పైగా రాజకీయ అండదండలు వారికే ఉండడంతో హత్యలు పరంపరంగా జరుగుతున్నాయని వీటిని అరికట్టాలి అంటే ప్రభుత్వం తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా తక్కువ సమయంలో శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. అలాగే మనోహర్ కుటుంబానికి కోటి రూపాయలు ఆర్థిక పరిహారం అందించాలని డిమాండ్ చేశారు రాష్ట్రంలో జరుగుతున్న మాదిగలపై దాడులకు, హత్యలకు నిరసనగా దళితుల ఆత్మగౌరవ నిరసన కార్యక్రమాన్ని చేపట్టి అధికార యంత్రంగా యొక్క కళ్ళు తెరిపిస్తామని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు ఏపీ ఎమ్మార్పీఎస్ అవిశ్రాంతంగా పోరాడుతుందన్నారు. ఇకనైనా అధికారులు దళితులపై దాడులను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోకపోతే జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించక తప్పద న్నారు. ప్రజల పక్షాన పోరాడే దళిత నాయకులకు లైసెన్స్ తుపాకీలను రక్షణగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా నాయకులు ధరూర్ గోపి,భైరాపురం రాజు, దేవనకొండ ఆంజనేయులు, రెడ్డి పోగు రాజశేఖర్, గూడూరు ప్రతాప్, దాసరావు మాదిగ పాల్గొన్నారు.



# న్యాయ మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశాలతో..

## వైయస్సార్ నగర్ టైలర్స్ కాలనీలో పనులు ప్రారంభించిన టిడిపి ఇన్చార్జ తాటికొండ బుగ్గ రాముడు



**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 24 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణం 38వ వార్డు వైఎస్ఆర్ నగర్ టైలర్స్ కాలనీలో సరైన రోడ్లు డ్రైనేజీ వీధిలైట్లు లేక ఉన్నవి వెలగక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు. విషయం తెలుసుకున్న 38వ వార్డు టిడిపి ఇన్చార్జ్ తాటికొండ బుగ్గ రాముడు న్యాయ మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వారి కుమారులు ఎన్ ఎం డి ఫిరోజ్ ఎన్ఎండి ఫయాజ్ ఆదేశాలతో టైలర్స్ కాలనీని సందర్శించి ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్వయంగా చూసి తెలుసుకుని వెంటనే జెసిబి తెప్పించి రోడ్డు మరమ్మత్తులు చేయించారు. అలాగే స్ట్రీట్ లైట్లు వెలగకపోవడంతో సంబంధిత అధికారులకు విషయం తెలిపి అధికారులు వచ్చే వరకు అక్కడే ఉండి స్ట్రీట్ లైట్ మరమ్మత్తులు చేపించారు. అలాగే కాలనీ లో ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని కాలనీవాసులను కోరారు. ఈ సందర్భంగా టైలర్స్ కాలనీవాసులు మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాలుగా మేము పడుతున్న ఇబ్బందులను గమనించిన వార్డు ఇన్చార్జ్ తాటికొండ బుగ్గ రాముడు స్వయంగా కాలనీలో రోడ్డు మరమ్మత్తు పనులు స్ట్రీట్ లైట్స్ మరమ్మత్తు పనులు చేపించడంతో సంతోషం వ్యక్తం చేసి తాటికొండ బుగ్గ రాముడి కు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు వడ్డే నాగేంద్ర, హిమామ్ హుస్సేన్, కాలనీవాసులు శిరీష పాల్గొన్నారు.





# ఈ నెల 27న మహానంది దేవస్థానంలో హుండీ లెక్కింపు

**మహానంది, ఫిబ్రవరి 24 (నంది పత్రిక ):-** మహానంది దేవస్థానంలో ఈనెల 27న హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈవో ఎన్.శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.ఆయన మాట్లాడుతూ శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివారి ఆలయం హుండీతో పాటు ఉభయ దేవాలయాల హుండీలను అధికారులు, సేవకులు,భక్తుల ద్వారా లెక్కింపు చేస్తామన్నారు.



# విద్యార్థులా.. పని మనుషులా..

**- చదువు చెప్పమని హాస్టల్లో వదిలేస్తే వంటపని, క్లీనింగ్ పనులు చేయిస్తారా..?**
**- ప్రిన్సిపాల్, సిబ్బంది తీరుపై స్కూల్ ముందు నిరసనకు దిగిన తల్లిదండ్రులు**
**- లోపలికి అనుమతి లేదని కవరేజ్ కు వెళ్ళిన మీడియాను సైతం అడ్డుకున్న సిబ్బంది**
**- తన విధులకు ఆటంకం కలిగిస్తున్నారంటూ.. తల్లిదండ్రులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రిన్సిపాల్**
**- తమను బయటకు తోసేశాడంటూ ప్రిన్సిపాల్ పై విద్యార్థి తల్లి ఫిర్యాదు**
**- గతంలో పని చేసిన ప్రదేశాల్లోనూ ప్రిన్సిపాల్ వ్యవహార శైలి పై అనేక ఆరోపణలు**
**- అయినా మారని తీరు**
**- విద్యార్థులు తో పాటు సిబ్బంది, ఉపాధ్యాయులు సైతం తీవ్ర ఇబ్బందులు**
**- ప్రిన్సిపాల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో,** విద్యార్థులను భావి, భారత పౌరులుగా తీర్చిదిద్దే ఆలయాలు విద్యాలయాలు. అలాంటి విద్యాలయంలో విద్యార్థుల పరిస్థితి దారుణంగా మారింది. చదువు సంగతి పక్కన పెడితే వంట పనులు, క్లీనింగ్, ఇతర పనులకే సమయం సరిపోతోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. చీపుర్లు, బల్బులు, ఇతర వస్తువులు ఏవైనా పాడైపోతే.. పిల్లల డబ్బులతోనే తెప్పిస్తున్నారని వాపోతున్నారు. ఇదేమిటని నిలదీస్తే పిల్లలను ఇబ్బందులకు గురిచేయడం పరిపాటిగా మారిందని ఆరోపించారు. సెలవుల్లో పిల్లలతో మాట్లాడదామని వస్తే కూడా అనుమతించరని, ఇది స్కూలా..? జైలా..? అని నిలదీశారు. ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పూర్తి వివరాలలోకి వెళితే.. నగర శివారులోని సంతోష్ నగర్ లో ఏపీ రెసిడెన్షియల్ (మైనారిటీ) బాయ్స్ స్కూల్ ఉంది. ఇక్కడ స్కూల్ తో పాటు హాస్టల్ సౌకర్యం కూడా ఉంది. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పిల్లలకు చదువు బోధిస్తున్నారు. అయితే గత కొంత కాలంగా ఇక్కడ చదువు గాడి తప్పినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా విద్యార్థులకు చదువుల కంటే వంట పనులు, క్లీనింగ్ పనులే ఎక్కువగా చేయిస్తున్నారని విద్యార్థులు తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా 8,9 వ తరగతి విద్యార్థులు ప్రతివారం 500 చపాతీలు చేయడంతో పాటు కాల్చడం కూడా వారితోనే చేయిస్తున్నట్టు తల్లిదండ్రులు చెబుతున్నారు. పిల్లలు చిన్న చిన్న గా చేయడం వల్ల అవి పిల్లలకు సరిపోవడం లేదని, అర్ధాకలితో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తున్నారు. అలాగే హాస్టల్ రూం ల క్లీనింగ్ లు కూడా పిల్లల చేత చేయిస్తున్నారని, చీపుర్లు పోతే కూడా పిల్లల డబ్బులతో తెచ్చుకోవాల్సిందే అని చెబుతున్నారు. అలాగే రూములో బల్బులు పోయినా పిల్లల డబ్బులతోనే తెచ్చుకోవాలని చెబుతున్నారని అర్పించారు. ఇదేమిటని దిగితే పిల్లలను తీవ్రంగా కొట్టడం చేస్తున్నారని వాపోతున్నారు. తల్లిదండ్రులకు చెబితే టీసీలు ఇచ్చి పంపిస్తామని కూడా బెదిరిస్తున్నారని ఆరోపించారు. మరో ఒక్క కొంత మంది సిబ్బంది సహకారంతో విద్యార్థులు, సిబ్బంది, అధ్యాపకుల పై కూడా తీవ్ర వేదింపులకు పాల్పడుతున్నారని, ఎవరికి చెప్పుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మీడియా ముందు వెల్లడించారు. ప్రిన్సిపాల్ వైఖరి వల్ల పిల్లలు ఇక్కడ చదువుకునేందుకు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇలాంటి ఆరోపణలతో ఆయన్ను నెల్లూరు జిల్లా నుంచి ఇక్కడకు బదిలీ చేసినట్టు తెలుస్తోందని, ఇక్కడ కూడా అంతకంటే ఎక్కువ గా వ్యవహరిస్తున్నారని చెప్పారు. జిల్లా అధికారులు స్పందించి ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకొని విద్యార్థులకు పని భారం నుంచి, అర్ధాకలి నుంచి రక్షించాలని కోరారు.

**స్కూల్ లోకి అనుమతించని ప్రిన్సిపాల్:** విద్యార్థులకు చదువు చెప్పకుండా పని మనుషులుగా మారుస్తున్నారని తెలుసుకున్న కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ దగ్గరకు చేరుకున్నారు. అయితే వారిని స్కూల్ లోకి రాకుండా గేటు బయటే ఆపేశారు. దీంతో వారు మీడియా కు సమాచారం ఇచ్చారు. మీడియాను సైతం గేటు దగ్గరే ఆపేశారు. ఇది ఏమైనా ప్రైవేట్ ప్రాపర్టీ నా..? ఎందుకు లోపలికి రానివ్వడం లేదని మీడియా ప్రతినిధులు చెబుతున్నా.. లోపలికి ఎవరికి అనుమతి లేదని, డీఈఓ ఆదేశాలు ఉన్నాయని సిబ్బంది చేత ఒక సర్కులర్ పంపారు. అందులో మీడియాకు అనుమతి లేదని ఎక్కడా లేదని చెప్పినా.. అయినా మీకు అనుమతి లేదంటూ.. గేటు దగ్గరే ఆపేశారు. దీంతో వారు ఆందోళన చేస్తున్న తల్లిదండ్రుల వీడియోలు, ఫోటోలు, వాయిస్ లు తీసుకుని వెళ్లి పోయారు.

**ప్రిన్సిపాల్, తల్లిదండ్రుకు పరస్పర ఫిర్యాదులు:**

విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగడంతో ఆగ్రహంతో ఊగిపోయిన ప్రిన్సిపాల్ తన విధులకు ఆటంకం కలిగించారంటూ.. నాలుగవ పట్టణ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అయితే ప్రిన్సిపాల్ పై కూడా ఓ విద్యార్థి తల్లి కూడా ఫిర్యాదు చేశారు. తమ కుమారుడికి చదువు చెప్పకుండా ఎందుకు పనులు చేయిస్తున్నారని అడగడానికి వెళితే తనపైన చెయ్యి వేసి బయటకు తీసేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరి ఫిర్యాదులు తీసుకున్న పోలీసులు విచారణ చేసి కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

**విచారణ చేపట్టిన ఏడీ - 1, ఏడీ - 2 అధికారులు:**

నగర శివారులోని ఏపీ రెసిడెన్షియల్(మైనార్టీ) బాయ్స్ స్కూల్ లో విద్యార్థుల కు చదువులు చెప్పమంటే పని చేయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తల్లిదండ్రులు ఆందోళనకు దిగడం, మీడియాలో వైరల్ కావడం తో కమిషన్, ఆర్జేడీ,







డీఈఓ అధికారులు సీరియస్ అయ్యారు. ఏడీ - 1, ఏడీ - 2, మరికొంత మంది అధికారులను విచారణకు ఆదేశించారు. దీంతో వారు మంగళవారం మధ్యాహ్నం స్కూల్ కు వెళ్లి విచారణ చేపట్టారు. పిల్లలను, సిబ్బందిని, ప్రిన్సిపాల్ ను విడివిడిగా విచారణ చేశారు. హాస్టల్లో పరిస్థితి ఎలా ఉంది.? ప్రిన్సిపాల్, సిబ్బంది తీరు ఎలా ఉంది..? అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. రిపోర్ట్ కూడా తయారు చేశారు. మరో పక్క విద్యార్థుల తల్లిదండ్రులు సాయంత్రం డీఈఓ కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తమ పిల్లల చేత పనులు చేయించడమే కాకుండా.. తమ పట్ల దురుసుగా ప్రవర్తించిన ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. విచారించి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. మొత్తం మీద విద్యాబుద్ధులు నేర్పాల్సిన విద్యాలయంలో వెట్టిచాకిరి చేయిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది తీరుపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ప్రిన్సిపాల్ పైన, సిబ్బంది పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మరి ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో..? ఎలాంటి చర్యలు తీసుకుంటారో..? తెలియాలి అంటే కొంతకాలం వేచి చూడాల్సిందే..

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

**- ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ**



**కొత్తపల్లి - నంది పత్రిక:** పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో 2026- 27 విద్యా సంవత్సరానికి మోడల్ ప్రైమరీ స్కూల్ శివపురం పాఠశాల నందు చేర్పించుటకు ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులైన మోహన్ కుమార్ , తులసి , దివ్య లీల అందరూ కలిసి శివపురం గ్రామంలో సందర్శణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్ కు వెళ్లే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోకి చేర్పించుటకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలన్నారు ప్రభుత్వ బడుల్లో ప్రైవేట్ స్కూల్ తీసిపోకుండా అన్ని వసతులు ఉన్నాయన్నారు ప్రైవేట్ స్కూల్ లకు దీటుగా ప్రభుత్వం పాఠశాలలో విద్యను బోధిస్తున్నామన్నారు తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్లపై మగ్గుచూపకుండా ప్రభుత్వ పాఠశాలలో మంచి భవిష్యత్తు ఉందని గమనించి పాఠశాలలో చేర్పించాలన్నారు ప్రైవేట్ స్కూల్ కు వెళ్లే విద్యార్థులు కూడా ప్రభుత్వ పాఠశాల పట్ల నమ్మకంతో మన పాఠశాలలోకి చేర్పిస్తామని మాకు హామీ ఇచ్చురన్నారు మంగళవారం మొదటి విడత సందర్శనలో భాగంగా మొత్తం 12 అడ్మిషన్స్ పూర్తి చేయడం జరిగిందన్నారు



## ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతానికి సహకరించాలి

**కర్నూలు నియోజకవర్గ ఆర్వో, కమిషనర్ పి.విశ్వనాథ్**

**రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన**



**కర్నూలు నంది పత్రిక....** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయడానికి రాజకీయ పార్టీల సహకారం అత్యంత కీలకమని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. మంగళవారం వెంకటరమణ కాలనీలోని నగరపాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎస్ఐఆర్ అనేది ఓటర్ల జాబితాను సమగ్రంగా పరిశీలించి సవరించే ప్రత్యేక ప్రక్రియగా ఆర్వో వివరించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చేయడం, మరణించిన వారు, డూప్లికేట్ పేర్లు తొలగించడం, చిరునామా మారిన ఓటర్ల వివరాలు సరిచేయడం, కొత్తగా అర్హత పొందిన యువ ఓటర్లను ఓటర్ల జాబితాలో చేర్చడం ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ విధంగా రూపొందే ఓటర్ల జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆర్వో పేర్కొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ప్రజల్లో ఏర్పడే సందేహాలు, అపోహలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహా సూచనలతో నివృత్తి చేసి, ఎన్నికల సంఘం అందించిన అధికారిక సమాచారాన్ని మాత్రమే ప్రజల్లోకి తీసుకెళ్లేలా సమన్వయంతో ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించడం అందరి బాధ్యతగా పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులు ఓటిపిలు అడగరని, గుర్తింపు కార్డుతోనే ఇంటింటికీ వచ్చి ధృవీకరణ చేపడతారని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన ప్రచారాన్ని మరింత ఉధృతం చేస్తామని, బీఎల్‌వోలు ప్రజల వద్దకు వచ్చినప్పుడు సహకరించేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు చొరవ చూపాలని ఆర్వో కోరారు.ఈ సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, ఎస్ఈ రమణమూర్తి, తహశీల్దార్ రవికుమార్, డిప్యూటీ సిటి ప్లానర్ వై.వెంకటరమణ, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, ఎలక్షన్స్ సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

## శాసన వ్యవస్థ ఆటవిడుపులో ఉత్సాహంగా పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి

**నంది పత్రిక -డోన్** విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం వేదికగా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ ఆటవిడుపు కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ క్రీడా వేడుకలో డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవనీయులు శ్రీ కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి పాల్గొని సందడి చేశారు.

**క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం** ప్రజాప్రతినిధుల మధ్య పరస్పర సౌహార్దాన్ని పెంపొందించడం, రాజకీయాలకు అతీతంగా స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కోట్ల ఇతర శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులతో కలిసి వివిధ క్రీడా పోటీలలో చురుగ్గా పాల్గొన్నారు. తనదైన శైలిలో క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అందరిలో ఉత్సాహాన్ని నింపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. నిరంతరం ప్రజా సేవలో, రాజకీయ ఒత్తిళ్లలో ఉండే ప్రజాప్రతినిధులకు ఇలాంటి ఆటవిడుపు కార్యక్రమాలు మానసిక ప్రశాంతతను ఇస్తాయని పేర్కొన్నారు.శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.సభలో చర్చలు, వాదోపవాదాలు ఎలా ఉన్నా, బయట అందరూ ఐక్యంగా ఉంటూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పెంపొందించుకోవడానికి ఇవి తోడ్పడతాయని తెలిపారు.శాసన వ్యవస్థలో సఖ్యతను చాటడానికి ఇదొక మంచి వేదిక అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు అసెంబ్లీ అధికారులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.



# విద్యార్థులకు క్రీడలు ఒత్తిడిని తగ్గిస్తాయి.







## విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ప్రోత్సాహాన్ని ఇస్తాయి.

**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 24 ( నంది పత్రిక )** విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ప్రోత్సాహాన్ని అందిస్తాయని,క్రీడలతో మానసిక ఒత్తిడిలు తగ్గిస్తాయని ఆర్డీఓ సి.విశ్వనాథ్ పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్ లోని శ్రీ సంకల్ప్ పాఠశాలలో వార్షిక క్రీడా దినోత్సవం - బ్లేజింగ్ రాకెట్స్-2026కు సంబంధించిన రెండవ రోజు సోమవారం కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల ఆర్.డి.ఓ శ సి విశ్వనాథ్ , సంకల్ప్ పాఠశాలల అధినేత సుధాకర్ సర్ , సతీమణి రమ్యా రెడ్డి ,పాఠశాల ప్రిన్సిపల్ పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ముఖ్య అతిధి గౌరవ సత్కారం తదనంతరం వారి చేతుల మీదుగా బహుమతి ప్రధానోత్సవం జరిగింది. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు మధ్య వివిధ వినోద క్రీడలను నిర్వహించారు. విద్యార్థులకు వారి గణ విభాగాల మధ్య వివిధ క్రీడా పోటీలు కబడ్డీ, కోకో, క్రికెట్, వాలీబాల్, షాట్ పూట్, త్రోబాల్, పరుగుపందెం, టగ్ ఆఫ్ వార్ తో పాటు వివిధ రకాల వినోద క్రీడలలో విద్యార్థులు అత్యుత్సాహంగా పాల్గొని, పోటాపోటీగా ఆడి తమదైన సత్తాను ప్రదర్శించారు. క్రీడా ప్రాంగణం ఆనంద కేరింతలతో, కరతాళ ధ్వనులతో మారుమ్రోగింది. ముఖ్య అతిథులు తమ సందేశంలో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలలో ప్రోత్సాహనివ్వడం ఆనందంగా ఉందని, క్రీడలు విద్యార్థులలో శారీర దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను, వివిధ నైపుణ్యాలను, ఒత్తిడిని, ఆందోళనలను క్రీడలు తగ్గిస్తాయని మంచి నిద్రకు ఆరోగ్యానికి దోహదపడతాయని తెలిపారు. ఈ పాఠశాల క్రీడా మైదానం అద్భుతంగా అనేక సౌకార్యాలతో విశాలంగా ఉందని కొనియాడారు.పోటీలలో పాల్గొని విజయం సాధించిన ప్రతి జట్టుకు, ప్రతి ఒక్కరికి షీల్డ్స్, మేమెంటోస్, మెడల్స్ , ప్రశంసా పత్రాలతో సత్కారిస్తూ బహుమతి ప్రధానం ముఖ్య అతిథుల చేతుల మీదుగా జరిగింది.ఈ క్రీడా వార్షిక దినోత్సవాన్ని రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించడానికి తోడ్పడిన ప్రతి ఒక్కరికి పాఠశాల యాజమాన్యం వారు పేరుపేరున ధన్యవాదములు తెలియజేశారు. ఇంతటితో ఈ కార్యక్రమం ఆనందోత్సవాల మధ్య ముగిసినది.









# రెవెన్యూ ఆదాయ లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలి



## జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా ఆదేశాలు

**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 24(నంది పత్రిక):-** జిల్లాలోని ప్రధాన ఆదాయ వనరులైన ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, రిజిస్ట్రేషన్, రవాణా తదితర శాఖలకు కేటాయించిన వార్షిక ఆదాయ లక్ష్యాలను వందశాతం సాధించడమే కాకుండా, అధిగమించే దిశగా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదాయ వనరుల పెంపుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె శాఖల వారీగా ఆదాయ సాధన పురోగతిని సమీక్షించారు. సమావేశంలో డిఆర్ఓ రాము నాయక్‌తో పాటు ఎక్సైజ్, మైనింగ్, వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖ శాఖ మార్చి 31 నాటికి రూ.1,105 కోట్ల ఆదాయాన్ని సాధించే లక్ష్యాన్ని నిర్దేశించగా జనవరి 31 నాటికి 803 కోట్ల ఆదాయం ఆర్జించినప్పటికీ, మిగిలిన రూ.193 కోట్ల లక్ష్యాన్ని మార్చి నెలాఖరు వరకు సాధించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే మైనింగ్ శాఖ మార్చి చివరి నాటికి మొత్తం రూ.247 కోట్ల లక్ష్యం (మేజర్ మినరల్స్ కింద రూ.195 కోట్లు, మైనర్ మినరల్స్ కింద రూ.52 కోట్లు) నిర్దేశించగా ఇప్పటివరకు మేజర్ మినరల్స్ ద్వారా రూ.140.05 కోట్లు, మైనర్ మినరల్స్ ద్వారా రూ.70.31 కోట్లు కలిపి రూ.210.36 కోట్లు వసూలైనట్లు వెల్లడించారు. మిగిలిన రూ.36.64 కోట్ల వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి శాఖల సమన్వయంతో ముందుకు సాగాలని కలెక్టర్ మైనింగ్ అధికారులను ఆదేశించారు. వాణిజ్య పన్నులు శాఖ ద్వారా ఫిబ్రవరి చివరి నాటికి రూ.677.02 కోట్ల లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు రూ.531.59 కోట్లు వసూలైనట్లు తెలిపారు. మిగిలిన రూ.145.43 కోట్ల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ముఖ్యంగా జీఎస్టీ బకాయిల కింద ఉన్న రూ.80.44 కోట్లను బ్యాంకర్లతో సమన్వయం




చేసుకుని వసూలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి మార్చి చివరి నాటికి రూ.201 కోట్ల లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు రూ.183 కోట్లు ఆర్జించినట్లు తెలిపారు. మిగిలిన మొత్తాన్ని నిర్దిష్ట కార్యాచరణతో సాధించాలని ఆదేశించారు. రవాణా శాఖ ద్వారా మార్చి నాటికి రూ.160.54 కోట్ల లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు రూ.133.79 కోట్లు వసూలైనట్లు తెలిపారు. మిగిలిన రూ.26.75 కోట్ల వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. లీగల్ మెట్రాలజీ శాఖ నుండి రూ.77 లక్షల లక్ష్యానికి గాను ఇప్పటికే రూ.76 లక్షలు వసూలైనట్లు తెలిపారు. లక్ష్యాన్ని పూర్తిగా సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే రెవెన్యూ ఆదాయంలో స్పష్టమైన వృద్ధి కనిపించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆదాయ వనరులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, లక్ష్య సాధనలో ఎలాంటి అలసత్వం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# పన్ను వసూలు ప్రత్యేక డ్రైవ్‌కు డీడీఓ ప్రత్యక్ష పర్యవేక్షణ



**పోరుమామిళ్ల ఫిబ్రవరి 24 (నంది పత్రిక ):** పోరుమామిళ్ల మండలంలోని పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీల్లో చేపట్టనున్న పన్ను వసూలు ప్రత్యేక డ్రైవ్‌ను బద్వేల్ డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి వెంకట శేషయ్య ప్రత్యక్షంగా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీల్లో ప్రస్తుతం పన్ను వసూలు 50 శాతం కంటే తక్కువగా ఉందని పేర్కొన్నారు. వసూలును మెరుగుపరిచేందుకు బుధవారం నుంచి శుక్రవారం వరకు మండలంలోని అన్ని పంచాయతీల అభివృద్ధి అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తామని చెప్పారు. పంచాయతీ వాసులు తమ పన్ను బకాయిలను వెంటనే చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఆస్తి పన్నును ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని, నగదు చెల్లింపులు స్వీకరించబోమని స్పష్టం చేశారు. ఈ పన్ను వసూలు డ్రైవ్‌ను ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్ రావుల సైతం పర్యవేక్షించనున్నట్లు ఆయన వెల్లడించారు.

# చిన్నారుల భవిష్యత్ ను తీర్చిదిద్దే అంగన్వాడీ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలి:

**గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు.**

**వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్.**



**నందికొట్కూరు ఫిబ్రవరి 24( నంది పత్రిక)** అంగన్వాడి కేంద్రాలు అక్షర జ్ఞానం నేర్పిస్తూ చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత మోస్తున్న అంగన్వాడి కార్యకర్తలకు ప్రభుత్వాలు తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం 26వేల రూపాయలు చెల్లించాలని వారి సేవలకు తగ్గ గుర్తింపు ఇస్తూ గౌరవించాలని వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలో ఐసిడిఎస్ కార్యాలయం ముందు రెండో రోజు కొనసాగుతున్న అంగన్వాడి ల రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు సందర్శించి తన మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా దీక్ష శిబిరంలోనే రిలే నిరాహార దీక్ష చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు తమ విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు మాట్లాడుతూ సమాజంలో సేవా దృక్పథంతో పని ఒత్తిడి అధికమైన బాధ్యతతో విధులు నిర్వహిస్తున్న వ్యవస్థ అంగన్వాడి వ్యవస్థలని, మీ సేవలు కొనియాడ తగినవని ఆయన పేర్కొన్నారు. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడి కార్యకర్తలు మరియు హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ప్రభుత్వ సర్వీసులో గౌరవేతనంతో అనేక కార్యక్రమాలను ప్రభుత్వం వేట్టి చాకిరి చేయించుకుంటుందని, శ్రమకు తగ్గిన ఫలితం గౌరవం లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వాలు అంగన్వాడి కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారి న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అంగన్వాడీలు చేయబోయే న్యాయపరమైన కోరికల సాధనలో భవిష్యత్తు ఉద్యమాలకు వాల్మీకి బోయ సంఘం ఎల్లప్పుడు మద్దతుగా నిలుస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గోపాలకృష్ణ, సిపిఎం నాయకులు నంద్యాల జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు పకీర్ సాహెబ్ పాల్గొన్నారు.

# వేసవిలో నీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సమగ్ర చర్యలు



## ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో చలివేంద్రాలు - ట్రాఫిక్ కూడళ్లలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి
## వంద శాతం ఇన్‌లైన్ క్లోరినేషన్ అమలు చేయాలి
## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 24(నంది పత్రిక):-** రానున్న రోజుల్లో ఎండ తీవ్రత పెరుగనున్న నేపథ్యంలో వేసవిలో నీటి ఎద్దడిని పకడ్బందీగా అధిగమించేలా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా నీటి మరియు పరిశుభ్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి, వాటిలో నిరంతర త్రాగునీటి సరఫరా ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రజా రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో తాత్కాలిక త్రాగునీటి సదుపాయాలు కల్పించాలని మున్సిపల్, పంచాయతీ అధికారులకు సూచించారు. అలాగే ప్రధాన ట్రాఫిక్ కూడళ్లలో, సిగ్నల్ ప్రాంతాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాలో కేవలం బ్లీచింగ్‌కే పరిమితం కాకుండా, వంద శాతం ఇన్‌లైన్ క్లోరినేషన్ అమలు చేయాలని స్పష్టం చేశారు. ఇన్‌లైన్ క్లోరినేషన్ ద్వారా డయేరియా వంటి నీటిజన్య వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఎక్కడా త్రాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఆళ్లగడ్డ, చాగలమర్రి, సంజామల, ఆత్మకూరు మండలాల్లో చేతిపంపుల మరమ్మత్తుల కోసం పంపిన ప్రతిపాదనలను త్వరితగతిన ఆమోదించి పనులు పూర్తి చేయాలన్నారు. వేసవి కాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా వ్యవహరించి సమగ్ర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఆవుపాలతో శ్రీ జగజ్జననీ అమ్మవారి కి అభిషేకాలు.

**తరలివచ్చిన వేలాది మంది భక్తులు .**

**ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అభిషేకాలు.**





**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 24 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలో శ్రీ జగజ్జననీ అమ్మవారి కి భక్తులు ఆవు పాలతో అభిషేకాలు నిర్వహించారు.శ్రీ జగజ్జననీ అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా అయిదు రోజుల పాటు అభిషేకాలు,అలంకరణలు చేస్తారు.అమ్మవారికి మొదటి రోజు నీటితో అభిషేకాలు నిర్వహించారు.రెండవరోజు అమ్మవారికి ఆవు పాలతో అభిషేకాలు నిర్వహించారు.గత 17 ఏళ్ళుగా శ్రీ జగజ్జననీ దేవాలయంలో వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.అమ్మవారికి ఆవుపాలతో అభిషేకాలు చేయడానికి మహిళలు పెద్ద ఎత్తున ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అభిషేకాలు నిర్వహించారు. ఆంధ్రా,తెలంగాణ పాతాళ నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.కోరిన కోర్కెలు తీరిన వారు కొందరు వందల లీటర్ల ఆవుపాలతో అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.ఉద్యోగాలు వచ్చాయని,పెళ్ళిళ్ళు జరిగాయని, ఆరోగ్యం కుదుటపడిందని అమ్మవారి పై విశ్వాసంతో తండోప తండాలుగా వచ్చి అభిషేకాలు నిర్వహించారు.దేవాలయం నిర్వాహకులు పుల్లయ్య ,నారాయణ,భక్తులు పాల్గొన్నారు.







# అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలను పటిష్టంగా నిర్వహించాలి



## భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలి
## జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 24(నంది పత్రిక):-** అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను ఎటువంటి లోపాలు లేకుండా భక్తిశ్రద్ధలతో, పటిష్టంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బ్రహ్మోత్సవాల నిర్వహణపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ యుగంధర్ బాబు, నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, ఆలయ పరిపాలనాధికారి రామానుజన్ మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 21వ తేదీన ప్రారంభమైన అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 4వ తేదీ వరకు నిర్వహించబడుతున్నాయని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఎగువ మరియు దిగువ అహోబిలాల్లో జరిగే కళ్యాణోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రవేశ మార్గాల వెంట చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని, ఆలయ పరిసరాలను శుభ్రంగా, పచ్చదనంతో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని డీపీఓను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తగిన వైద్య సిబ్బంది, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. పార్కింగ్ సదుపాయాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, త్రాగునీటి సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీఓను ఆదేశించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని జలప్రసాదం కౌంటర్ల సంఖ్యను పెంచాలని సూచించారు. భక్తుల రవాణా సౌకర్యార్థం అవసరమైన సంఖ్యలో బస్సులు సిద్ధంగా ఉంచాలని, బ్రహ్మోత్సవాల సమయంలో టోల్ రుసుము మినహాయింపుపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రముఖుల వేదిక, రథం తదితర ఏర్పాట్లను ఆర్ & బీ అధికారులు సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. విద్యుత్ తీగలు ఎక్కడా వేలాడకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. దిగువ అహోబిలంలో లడ్డు కౌంటర్లను పెంచి భక్తుల రద్దీని తగ్గించాలని పేర్కొన్నారు. త్రాగునీరు మరియు ఇతర అవసరమైన వస్తువులు ఒకే ధరకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత తహశీల్దార్‌కు ఆదేశించారు. నీటి కుంటల వద్ద భద్రతా చర్యలుగా గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని, క్యూలైన్లలో ఉన్న భక్తులకు త్రాగునీరు, మజ్జిగ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



# ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణీ స్త్రీల ప్రసవాలు తగ్గడంపై వైద్యాధికారులు, డాక్టర్లపై కలెక్టర్ ఆగ్రహం

**ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సిబ్బంది రోగుల నుండి సొమ్ము డిమాండ్ చేస్తే కఠిన చర్యలు.**
**ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.**
**జిల్లాలో అన్ని ఆరోగ్య కార్యక్రమాలలో నూరు శాతం లక్ష్యసాధనకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలి.**
**ప్రభుత్వ ఆసుపత్రులలో అందించే వైద్య సేవలపై సంతృప్తిస్థాయి పెరిగే విధంగా వైద్యాధికారులు, డాక్టర్లు మెరుగైన సేవలందించాలి.**
**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**

భీమవరం: చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 24, నంది పత్రిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల మెడికల్ అధికారులు, ఏరియా ఆసుపత్రుల వైద్యాధికారులు, సూపరింటెండెంట్స్, పిహెచ్సి డాక్టర్లు, ప్రోగ్రాం ఆఫీసర్లతో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు అందుతున్న సేవలు, వివిధ ఆరోగ్య అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని విభాగాలలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణీ స్త్రీల ప్రసవాలు తగ్గడం పట్ల వైద్యాధికారులు, డాక్టర్లపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణీ స్త్రీల ప్రసవాలు పెరిగే విధంగా గైనకాలజిస్టు, వైద్య సిబ్బంది గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితులలో ఆస్పత్రులకు వచ్చే రోగులకు ఎటువంటి డేటా, వివరాల కోసం ఆలస్యం చేయకుండా తక్షణమే వైద్యులు వైద్య సహాయం అందించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. సాధ్యమైనంత వరకు ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలు జరిగే విధంగా చూడాలని, సిజేరియన్ల శాతం తగ్గే విధంగా డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు అందించే సేవలపై రోగులు సంతృప్తి స్థాయి పెరిగే విధంగా వైద్యాధికారులు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రులకు వచ్చే రోగుల పట్ల ఆప్యాయంగా వ్యవహరించాలని, పరిశుభ్రమైన వాతావరణ ఉండాలని, వార్డులలో బెడ్ షీట్స్ ఎప్పటికప్పుడు మార్చే విధంగా నిరంతరం పర్యవేక్షించాలని, ఆస్పత్రులలో ప్రసవాలు పెరిగే విధంగా చూడాలని ఆసుపత్రి సూపరిండెంట్లను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు అందుతున్న మెరుగైన సేవలపై గత మూడు నెలల నుండి మన జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండటం పట్ల కలెక్టర్ వైద్య సిబ్బందిని అభినందించారు.

**డాక్టర్లు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి:** రోగుల వైద్య సేవలో వైద్యులు నిరంతరం కష్టపడి పనిచేస్తారని, కొంతమంది వైద్యులు పని ఒత్తిడి వల్ల తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. ముఖ్యంగా వైద్యులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని ఎప్పటికప్పుడు వారు కూడా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ డాక్టర్లకు హితవు పలికారు. ఇటీవల ఆర్ ఎం ఓ డాక్టర్ తాతారావు ఆకస్మికంగా మరణించడం పట్ల జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఎం అండ్ హెచ్ ఓ జి.గీతాబాయి, డిసిహెచ్ఎస్ డా.పి.సూర్యనారాయణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ దేవసుధ, ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ డిస్టిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ కీర్తి, వివిధ విభాగాల వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులు, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పునర్వికకు పాపకు అనాధ రక్షక్ సేవా ఫౌండేషన్ నుంచి ఆర్థిక సాయం.




నంది పత్రిక / చాగలమర్రి న్యూస్ ; వెల్దుర్తి పట్టణములో పునర్విక అనే పసికందుకు ఎస్ ఎం ఏ టైప్ -1 అనే వ్యాధి సోకడంతో డాక్టర్లకు చూపిస్తే ఈవ్యాధి అరుదుగా వస్తుంది దీనికి ఇంజెక్షన్ వేయాలి అంటే దాదాపుగా పదహారు కోట్లు ఖర్చు అవుతుంది అని చెప్పడంతో సొమ్మసిలిపోయిన ఆ కుటుంబం ఆర్థిక సాయం కోసం ఎదురు చూపులు చూసింది. నంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణములో నిత్యం సేవా చేసే యువకులు అనాధ రక్షక్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యములో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల , జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సాయం చేసిన 15వేల రూపాయలకు పైగా ఆర్థిక సాయం చేయనున్నారు అని త్వరలో వెల్దుర్తి లో పునర్విక కుటుంబాన్ని కలిసి ఆర్థిక సహాయం చేయనున్నారని దర్శన్ వల్లంకొండు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొండెం రమేష్ , అంగడి విశ్వనాథ్ , గిరీష్ , దుర్గం నవీన్ కుమార్ రెడ్డి , చైతన్య , తదితరులు పాల్గొన్నారు.




# అరసం జిల్లా అధ్యక్షుడిగా మరియాదాస్ ఎన్నిక.

**బేతంచెర్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియాదాస్**



బేతంచెర్ల ఫిబ్రవరి 24 ( నందిపత్రిక) నంద్యాలలోని భగత్ సింగ్ గ్రంథాలయంలో గత ఆదివారం జరిగిన అభ్యుదయ రచయితల సంఘం సమావేశం లో నంద్యాల జిల్లా నూతన అరసం కమిటీని ఎన్నుకున్నట్లు అరసం ప్రధాన కార్యదర్శి మద్దిలేటి,ప్రముఖ స్థానిక నంద్యాల కోర్టు న్యాయవాది శంకరయ్య తెలిపారు. అధ్యక్షుడిగా బేతంచెర్ల గోరుమానకొండ మోడల్ స్కూల్ లో పనిచేస్తున్న ప్రిన్సిపల్ మర్యాదాస్ గారిని జిల్లా అరసం అధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు ఉపాధ్యక్షుడిగా విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు కమలాకర్ ను ఎన్నుకున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా అరసం నూతన అధ్యక్షులు మర్యా దాస్ మాట్లాడుతూ మాతృభాషా ప్రాముఖ్యతను , తెలుగు భాష గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేయాలని శ్రీశ్రీ ,వేమన, గురజాడ అప్పారావు, గుర్రం జాషువా వంటి గొప్ప గొప్ప కవులు రచయితల యొక్క దార్శనిక ఆలోచనలను భవిష్యత్ తరానికి అందించాలని మూఢ విశ్వాసాలపై ఆధారపడకుండా ఆధునిక ఆలోచనలతో భవిష్య భారత యువతను ప్రోత్సహించాలని దీనికోసం ఆలోచింపజేసే ఆధునిక కవిత్వం అనేకమంది నుంచి పుట్టుకు రావాలని తెలియజేశారు. కార్యక్రమం లో అరసం నాయకులు ప్రభాకర్ రెడ్డ, ప్రసాద్, శివశంకర్ ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

# రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి అవసరమైన పనులను వేగవంతం చేయాలి



**జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి**

భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 24 నంది పత్రిక జిల్లాలో చేపట్టనున్న రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి అవసరమైన పనులను వేగవతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఛాంబర్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి లెవిల్ క్రాసింగ్స్ లో ఆర్ యు బి లకు సంబంధించి రైల్వే కన్స్ట్రక్షన్స్ డిప్యూటీ సీఈఓ, ఆర్ అండ్ బి, రెవిన్యూ శాఖ ల అధికారులతో మంగళవారం గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం నుండి అనుమతులు లభించిన నవాబ్ పాలెం 378, పత్తిపాడు 376, ఆరుగొలను 379 తదితర లెవిల్ క్రాసింగ్ గేట్లకు సంబంధించి చేపట్టనున్న రైల్వే అండర్ బ్రిడ్జిలు నిర్మాణాలకు అవసరమైన భూ సేకరణ సర్వేలు, సరిహద్దులు గుర్తింపు, తదితర ప్రక్రియలలో ఎటువంటి జాప్యం లేకుండా పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ముఖ్యముగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. 376 లెవిల్ క్రాసింగ్ కి సంబంధించి ప్రభుత్వ భూములు ఎటువంటి అభ్యంతరాలు ఉన్న ఉన్నతాధికారులు దృష్టికి తీసుకురావాలని అన్నారు. రైల్వే, రెవిన్యూ, ఆర్ అండ్ బి, స్థానిక సంస్థల మధ్య సమన్వయం అత్యంత కీలకమని ఆయన తెలిపారు. సమర్థవంతమైన కమ్యూనికేషన్ ద్వారా పనులను వేగవంతంగా పూర్తి చేయవచ్చు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ గూగుల్ మీట్ లో ఆర్డీవోలు కె .ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, ఖతీబ్ కౌసర్ భానో, రైల్వే కన్స్ట్రక్షన్స్ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, ఆర్ అండ్ బి ఇంజనీర్, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ భాను కుమార్, డిటి కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.



# జలజక్క మరణం కళారంగానికి తీరని లోటు.

**డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్.**



మహబూబాబాద్, ఫిబ్రవరి 24(నంది పత్రిక): ఉద్యమ గాయని, రచయిత్రి జలజక్క అకాల మరణం కళా కుటుంబాలలో తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని, క్యాన్సర్ మూలంగా ఆమె మరణించడం, కళాకారుల్లో తీవ్ర విషాదాన్ని నింపిందని మహబూబాబాద్ డిపిఆర్వో రాజేంద్రప్రసాద్, సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి సత్యనారాయణ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మహబూబాబాద్ లోని అమరవీరుల స్థూపం వద్ద జలజక్క చిత్రపటం ఎదుట నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎం కృష్ణవేణి, మెప్మా అధికారిని కళాకారులు కోమిరే వెంకన్న, గడ్డం రాజమౌళి, రవీందర్ గౌడ్, బండ వెంకన్న, ఐలేష్ కుమార్, భరత్, యుగేందర్, పరమేష్, ప్రవీణ్ కుమార్, బిక్షపతి, కవిత, అశ్విని, కీర్తి, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# భీమవరంలోని శ్రీ ఆదిత్య డిగ్రీ కాలేజ్ నందు ఫిబ్రవరి 27న నిర్వహించే మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ ను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**

భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 24 నంది పత్రిక ఎవరు ఆ పిల్లమాడే కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాల కల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థచే భీమవరం శ్రీ ఆదిత్య డిగ్రీ కాలేజ్ నందు ఈ నెల 27వ తారీఖున మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్ లో సుమారు 21 ప్రముఖ కంపెనీలతో పాటు, మరికొన్ని ఇతర కంపెనీలలో ఉద్యోగఅవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. వివిధ కంపెనీలలో మొత్తం 2 వేలకు పైగా ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందని, 18 - 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. నిరుద్యోగ యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు ఈ లింక్ నందు రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని, ఇతర వివరములకు ఈ క్రింది నెంబర్ల నందు 9492885556 సంప్రదించాలనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్, చీజ్నూ కిషోర్ రెడ్డి , ఆదిత్య కాలేజ్ ప్రిన్సిపల్ అనురాధ , ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమకారులకు అనుకూలంగా హైకోర్టు తీర్పు.

**హర్షం వ్యక్తం చేసిన ఉద్యమకారులు.**

కేసముద్రం, ఫిబ్రవరి 24(నంది పత్రిక):తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు, పెన్షన్ 8 వారాల్లో ఇవ్వాలని హైకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇవ్వడంతో కేసముద్రం మండల తెలంగాణ ఉద్యమకారులు సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం కేసముద్రం పట్టణంలోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సమావేశమై హైకోర్టు తీర్పు ఉద్యమకారులకు అనుకూలంగా ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చాగంటి కిషన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు, పెన్షన్ 8 వారాల్లో ఇవ్వాలని హైకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చినందున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విధివిధానాలు ప్రకటించి, సంబంధిత జి.వో.



విడుదల చేయాలని, వీటితో పాటు కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలైన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, మరణించిన ఉద్యమకారుల కుటుంబాలకు ఆర్థిక సహాయం, అర్హత ఉన్న ఉద్యమకారులకు ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. పిసిసి సభ్యులు గుగులోత్ దస్రూనాయక్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల ఉద్యమకారుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మాంకాల కట్టమల్లు, ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్, విద్యార్థి, యువజన జెఎసి పూర్వ కన్వీనర్ దండు శ్రీనివాస్, భట్టు శ్రీనివాస్, శివారపు శ్రీధర్, గంధసిరి సోమన్న, వంగాల అశోక్, పింగిళి శ్రీనివాస్, జనిగల కొమురెల్లి, బాలు మోహన్, వేం నరసింహారెడ్డి, సోమారపు వెంకటయ్య, జనిగల పరమేశ్వర్, చుంచు సూరయ్య, కీర్తి సమ్మయ్య, మాందాటి ఆంజనేయులు, గాండ్ల మలేంద్రం పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సేవలకు 8 అవార్డులు




కేసముద్రం, ఫిబ్రవరి 24(నంది పత్రిక):తొర్రూర్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన లయన్స్ క్లబ్ రీజినల్ దామెర సేవా సమ్మేళనం కార్యక్రమంలో కేసముద్రం లయన్స్ క్లబ్ కు ఎనిమిది అవార్డులు లభించినట్లు క్లబ్ అధ్యక్షుడు మామిడి అశోక్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన శాశ్వత ప్రాజెక్టులు, రక్తదాన కార్యక్రమాలు, కంటి ఆపరేషన్లు, విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా అవార్డులు అందుకున్నామని తెలిపారు. క్లబ్‌కు ఈ ఘనత సాధించేందుకు సహకరించిన క్లబ్ సభ్యులు, క్లబ్ పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం లయన్స్ క్లబ్ పాస్ట్ జడ్సీలు చిర్ర యకాంతం గౌడ్, యర్నం శ్రీరాములు, చార్టర్ ప్రెసిడెంట్ కే.చంద్రశేఖర్, జడ్సీ ఎం.వెంకటరెడ్డి, బెజ్జం ప్రేమ్ కుమార్, శామకూరి నర్సయ్య, లక్కాకుల సత్యనారాయణ, మలిశెట్టి శోభన్, గంజి వీరేందర్ రెడ్డి, దాసరి అశోక్, మారం సమ్మిరెడ్డి, మదిపెద్ది వెంకటేష్, బొల్లు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాలు పెంపుపై క్షేత్రస్థాయి చర్యలు చేపట్టాలి.

**లీకేజీలు నివారణ, ఇంకుడు గుంతలు నీటి సంరక్షణే లక్ష్యం.**
**రాబోయే వేసవిలో నీటి అవసరాలు దృష్టిలో ఉంచుకుని పకడ్బందీగా క్షేత్ర స్థాయి పనులు ప్రారంభించాలి.**
**జిల్లా కలెక్టరు కె.వెట్రి సెల్వి ...**

**ఏలూరు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 24: నంది పత్రిక** జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం"జిల్లాలో భూగర్భ జలాలను పెంచుకునే అంశంపై" సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇరిగేషన్, భూగర్భ జలాలు, డ్వామా, మైక్రో ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆ దిశగా క్షేత్ర స్థాయిలో వెంటనే చర్యలు తీసుకోవాలని, భవిషత్తు కార్యాచరణపై పూర్తి స్థాయిలో నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలాలు గణాంకాలపై నిశితంగా దృష్టి సారించి, పెరుగుదల దిశగా స్పష్టమైన కార్యాచరణ చేపట్టాలని సూచించారు. డ్వామా ఆధ్వర్యంలో డిసిల్టేషన్, బుష్ క్లీరెన్స్, ఇంకుడు గుంతలు, కుంటలు పునరుద్ధరణ వంటి పనులకు సంబంధించిన సమగ్ర ప్రణాళికలు సిద్ధం చెయ్యాలని ఆదేశించారు. గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో కూడా జల సంరక్షణ పద్ధతులుపై స్థానిక సంస్థలు భాగస్వామ్యంతో చేపట్టాల్సి ఉందన్నారు. జలవనరులు శాఖ ప్రధాన కాలువల్లో లీకేజీలు నివారణ, గట్లు పటిష్టతపై తక్షణ చర్యలు





తీసుకోవాలని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో సమగ్ర నివేదిక అందజేయ్యాలని సూచించారు. భూగర్భ జలాలు శాఖ మండలాలు వారీగా ప్రత్యేక గణాంకాలు, రియల్ టైమ్ పర్యవేక్షణ అందించాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో భూగర్భ జలాలు పెరిగే దిశగా మండల అభివృద్ధి అధికారులు నిర్దిష్ట లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. జిల్లాలోని 394 గ్రామాల్లో ప్రస్తుతం 194 గ్రామాల్లో 8 నుంచి 20 మీటర్లు లోతులోనూ, 20 మీటర్లు పైబడి 200 గ్రామాల్లో భూగర్భ జలాలు స్థాయి ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తుతరాలకు నీటివనరులు సమృద్ధిగా ఉండే విధంగా భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని అన్నారు. ఆదిశగా ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చెయ్యాలని అన్నారు. ప్రభుత్వంతో పాటు, ప్రైవేటు భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అడవులు సంరక్షణ పద్ధతుల్లో, విస్తృత స్థాయిలో ఇంకుడు గుంతలు నిర్మాణాలు, చెరువులు పూడిక తీతలు, ఇతర పరిరక్షణ వంటి చర్యలు ద్వారా నూటికినూరుశాతం భూగర్భ జలాలు డిశ్చార్జ్ నిల్వలు చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. రాబోయే వేసవి సీజన్లో నీటి అవసరాలు దృష్టిలో ఉంచుకుని పకడ్బందీగా క్షేత్ర స్థాయి పనులు ప్రారంభించాలన్నారు.వచ్చే సమీక్ష సమావేశం నాటికి సమన్వయ శాఖలు అధికారులు సమగ్రనివేదికలు అందజేయాలని, అందుకు అనుగుణంగా జిల్లాలో భవిషత్తు కార్యాచరణ అమలు చేస్తామని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, గ్రౌండు వాటరు డిప్యూటీ డైరెక్టరు పైలా కోదండరామ్, నీటిపారుదల శాఖ యస్ఇ సి.హెచ్. దేవప్రకాష్, ఏపి యంఐపి పిడి డా.యస్. రామ్మోహన్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె.షాజా నాయక్, డిబ్ల్యూయంఏ అడిషనల్ పిడి రాజశేఖర్, నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖ, పొల్యూషన్ బోర్డు, సంబంధిత శాఖల అధికారులు, వివిధ నీటిసంఘాలు ప్రతినిధులు, రైతు నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు. ..

# పిసిపియన్డిటి చట్టం అమలుపై సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్.





**మహబూబాబాద్, ఫిబ్రవరి 24(నంది పత్రిక):** మహబూబాబాద్ జిల్లాలో సిజేరియన్(సి-సెక్షన్) ప్రసవాల శాతాన్ని తగ్గించే దిశగా, పి సి పి యన్ డి టి చట్టం అమలు పైన కీలక సమీక్ష సమావేశం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టొప్పో అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యంగా ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న సిజేరియన్ ప్రసవాల శాతాన్ని, పి సి పి యన్ డి టి చట్టం అమలు పైన సమీక్షించారు. ముందుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ జిల్లా లోని ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రులలో జరుగుతున్న సి సెక్షన్ ప్రసవాలు, పి సి పి యన్ డి టి చట్టం ప్రకారం తీసుకుంటున్న చర్యల పైన ప్రారంభోపన్యాసం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన సందర్భాల్లో మాత్రమే సిజేరియన్ శస్త్ర చికిత్సలు నిర్వహించాలని, సాధ్యమైనంతవరకు సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని సూచించారు. గర్భిణీల ఆరోగ్యం, శిశువుల భద్రతను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుని వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ, గర్భిణీలకు సరైన కౌన్సెలింగ్ అందించి, వైద్యపరమైన కారణాలు ఉన్నప్పుడే సిజేరియన్ చేయాలని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులు సిజేరియన్ రేటును నియంత్రణలో ఉంచి, పారదర్శకంగా రికార్డులు నిర్వహించాలని సూచించారు. పిసిపియన్డిటి చట్టం ప్రకారం జిల్లా లోని స్కానింగ్ సెంటర్ లను తరుచుగా తనిఖీలు చేయాలని, నిబంధనలు అతిక్రమించిన వారి పైన చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ఆడ పిల్లల నిష్పత్తిని పెంచాలని పేర్కొన్నారు. జిల్లాలో సురక్షిత మాతృత్వాన్ని ప్రోత్సహించడం, అనవసర సిజేరియన్ శస్త్ర చికిత్సలను తగ్గించడం లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస రావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ కో ఆర్డినేటర్ డాక్టర్ చింత రమేష్, ఐయంఏ అధ్యక్షుడు డాక్టర్ జగదీశ్వర్, తొర్రూరు అధ్యక్షుడు డాక్టర్ రాజేందర్ రెడ్డి సంబంధిత విభాగాల అధికారులు, వైద్యులు, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులు, సర్జన్లు, మెడికల్ ఆఫీసర్లు సమావేశంలో పాల్గొన్నారు.



# జిల్లాలో సత్ఫలితాలనిస్తున్న రెవిన్యూ క్లినిక్ లు..

**7 విడతలుగా 72 దరఖాస్తులు పరిష్కారం..**
**రెవెన్యూ క్లినికల్ ల ద్వారా భూ సమస్యల పరిష్కారం వేగవంతంగా జరుగుచున్నది..**
**ప్రతి సోమవారం నిర్వహించే రెవెన్యూ క్లినిక్ లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**
**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం చీఫ్ బ్యూరో: ఫిబ్రవరి 24, నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం భూసమస్యలపై ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్స్ లు సత్ఫలితాలను నిస్తున్నాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించే పీజీఆర్ఎస్ తో పాటు సమాంతరంగా భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్ లను నిర్వహించడం జరుగుచున్నదన్నారు. డిసెంబర్ 29,2025న రెవెన్యూ క్లినిక్ లు ప్రారంభం నాటి నుండి ఫిబ్రవరి 23, 2026 వరకు ఏడు దఫాలుగా రెవెన్యూ క్లినిక్ లను నిర్వహించుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం 394 దరఖాస్తులు అందగా 65 దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందని, ఏడు దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందని, ఇంకా 322 దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉందన్నారు. జిల్లాలోని డివిజన్ ల వారీగా భీమవరం డివిజన్ ఏడు మండలాల్లో 155 దరఖాస్తులు అందగా వీటిలో 29 పరిష్కరించడం జరిగిందని, నాలుగు తిరస్కరించడం జరిగిందని, ఇంకా 122 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. నరసాపురం డివిజన్ ఎనిమిది మండలాల్లో 161 దరఖాస్తులు అందగా 24 దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందని, రెండు దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందని, ఇంకా 134 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. తాడేపల్లిగూడెం డివిజన్ లోని ఐదు మండలాల్లో 78 దరఖాస్తులు అందగా 12 దరఖాస్తుల పరిష్కరించడం జరిగిందని, ఒక దరఖాస్తును తిరస్కరించడం జరిగిందని ఇంకా 65 దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉందన్నారు. పరిష్కారానికి మిగిలిన దరఖాస్తులు వివిధ దశలలో ఉన్నాయని, వాటిని నిర్ణీత గడువు లోపుగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. సదరు ఫిర్యాదులపై విచారణకు ఎక్కువ సమయం ఉండటం వలన వాటిని పూర్తిగా అవగాహన చేసుకుని నాణ్యతతో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. రెవిన్యూ క్లినికల్



ద్వారా భూ సమస్యలకు చక్కటి పరిష్కారం లభించిందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

# రాఘవేంద్రుని సన్నిధిలో వైసిపి నేత ప్రదీప్ రెడ్డి



**మంత్రాలయం, ఫిబ్రవరి 24,** ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వైసిపి నేత జిల్లా ఉపాధ్యక్షులు వై ప్రదీప్ రెడ్డి సతీ సమేతంగా దర్శించుకున్నారు. మంగళవారం శ్రీ గురు వైభవోత్సవాల్లో భాగంగా రాఘవేంద్రస్వామి జన్మదినం సందర్భంగా స్వామి వారి దర్శనార్థమై శ్రీ మఠం చేరుకున్న ఆయనకు శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం. గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళవారం హారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు వారికి శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు. ఆయన వెంట వైసిపి నాయకులు న్యాయవాది లక్ష్మి నారాయణ రెడ్డి వార్డు సభ్యులు రామాంజనేయులు నాయకులు రాము తదితరులు ఉన్నారు.



# సైబర్ నేరాల దోపిడీ కేసులో కీలక నిందితుడు అరెస్ట్





**నిందితుడు వికాస్ చౌదరితో పాటు 14 మంది అరెస్ట్**

**ఖమ్మం జిల్లా/సత్తుపల్లి క్రైమ్ న్యూస్:** సైబర్ నేరాల దోపిడీ కేసులో అత్యంత కీలక నిందితుడైన ఉడతనేని వికాస్ చౌదరి సహా 14 మంది నిందితుల ముఠాను ఖమ్మం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ సత్తుపల్లి పోలీస్ స్టేషన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఏసీపీ వసుంధర యాదవ్ కథనం ప్రకారం.. సైబర్ నేరాల్లో మోసపోయిన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం ముష్టిబండకు చెందిన ఉడతనేని వికాస్ చౌదరి, అతని భార్య బొప్పన నాగప్రియ, అడపా రామ వెంకట చరణ్ చౌదరి అలియాస్ చరణ్ అనే ముగ్గురిపై కేసు నమోదైంది. ఈ కేసులో నిన్న రాత్రి 7.00 గంటల ప్రాంతంలో సత్తుపల్లి బస్టాండ్ వద్ద చరణ్ ను అరెస్ట్ చేయగా, వికాస్ చౌదరి దంపతులు సాగించిన సైబర్ మోసాల గుట్టును పోలీసులకు వివరించాడు. వికాస్ చౌదరి, అతని భార్య నాగప్రియ 2020 సంవత్సరం నుంచి ఆన్ లైన్ గేమింట్, బెట్టింగులు ఆడి, విదేశాల్లోని కొందరితో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే వికాస్ చౌదరి దంపతులు కాల్ సెంటర్ నడుపుతూ, వాటి ద్వారా మనదేశంలోని పౌరులకు ఫోన్లు చేస్తూ, అధిక లాభాల ఆశ చూపి, స్టాక్ మార్కెట్ ట్రేడింగ్, క్రిప్టో ట్రేడింగ్, గేమింట్, బెట్టింగ్, ఓటీపీల మోసాలకు, మ్యాట్రిమోనీ పేర్లతోనూ వివిధ రకాల లింక్ లు, క్యూఆర్ కోడ్ లు పంపుతూ మోసపూరిత మార్గాల ద్వారా బాధితుల బ్యాంక్ అకౌంట్ల నుంచి డబ్బును కాజేసేవారు. అరెస్ట్ చేసిన నిందితులతో ఏసీపీ వసుంధర యాదవి, తర పోలీసు అధికారులు అంతేగాక స్టాక్ మార్కెట్ లో ట్రేడింగ్ చేస్తున్నామని, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ నిర్వహిస్తున్నామని, అందుకు తమకు పలు బ్యాంక్ అకౌంట్ల అవసరం ఉందని చెప్పేవారు. తద్వారా కొందరితో పలు బ్యాంకుల్లో కరెంట్ అకౌంట్స్ ఓపెన్ చేయించి వారికి నెలకు రూ. 50,000తోపాటు ప్రతి కరెంట్ అకౌంట్ కు రూ. 20,000, దాన్ని ఓపెన్ చేసిన వ్యక్తికి రూ. 10,000 చొప్పున ఇచ్చేవారు.వికాస్ చౌదరి అండ్ గ్యాంగ్ అంతర్జాతీయ సైబర్ క్రైమ్ నేరస్థులతో జతకట్టి విదేశాల్లో కాల్ సెంటర్లు నిర్వహిస్తూ వాటి ద్వారా మనదేశంలోని పౌరులను మోసం చేస్తూ అకౌంట్లలోని డబ్బును ఖాళీ చేస్తుండేవారని ఏసీపీ వివరించారు. ఈ తరహా సైబర్ క్రైమ్ నేరాల ద్వారా వచ్చిన సొమ్మును ఏజెంట్ల ద్వారా తెరిపించిన బ్యాంక్ అకౌంట్లలోకి బదలాయించేవారని, ఆ తర్వాత కొన్ని కరెంట్ అకౌంట్లలోకి మార్చి, చివరగా తమ వ్యక్తిగత ఖాతాల్లోకి ట్రాన్స్ ఫర్ చేసుకునేవారని చెప్పారు. చివరి ప్రక్రియగా అమెరికా డాలర్లలోకి, క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చేవారని ఏసీపీ తెలిపారు.ఈ విధంగా తన ద్వారా మొత్తం 22 మంది వ్యక్తులతో బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేయించారని, అందుకు ప్రతి అకౌంట్ కు రూ. 10,000 మొత్తాన్ని ఇచ్చి, ఇందుకు కమిషన్ గా తాను రూ. 20,000 మొత్తాన్ని ఉడతనేని వికాస్ చౌదరి, అతని భార్య బొప్పన నాగప్రియ నుంచి తీసుకునేవాడినని అడపా రామ వెంకటచరణ్ చౌదరి తమ విచారణలో వెల్లడించినట్లు ఏసీపీ వసుంధర యాదవ్ వివరించారు.కేసు దర్యాప్తులో భాగంగా అడపా చరణ్ ఇచ్చిన సమాచారంతో కీలక నిందితుడైన వికాస్ చౌదరి సహా 14 మందిని అరెస్ట్ చేశామని చెప్పారు. తాజాగా అరెస్టయిన నిందితుల్లో అడపా వెంకట రామచరణ్, అడపా సూర్య వెంకట తరుణ్, ఇలాసారపు అనిరుధ్, పోట్రు వంశీ, పోట్రు చైతన్యసాయి, దోసపాటి నవీన్, నల్లబోతుల భవాని సత్యశేఖర్, కాపుగంటి జోగేంద్ర శేషు, దేవళ్ల వేణు, మామిడిశెట్టి సాయికుమార్, పటాన్ ఇమ్రాన్ ఖాన్, ఉప్పతల గోపి, దొబ్బల వెంకటేష్ ఉన్నట్లు పేర్కొన్నారు.ఇదే కేసులో మరో ఎనిమిది మంది నిందితులు బొప్పన నాగప్రియ, ఇస్లావత్ లక్ష్మి కళ్యాణ్, శీలం వేణుగోపాల్ రావు, నల్లంగుల శ్వేతన్, వీరంశెట్టి వంశీ, బిల్లా సాయితరుణ్, సంగం ప్రవీణ్ కుమార్, భూక్యా తరుణ్ పరారీలో ఉన్నారని ఏసీపీ చెప్పారు. కేసు ఇంకా పరిశోధనలో ఉందని, పూర్తి వివరాలను తర్వాత వెల్లడిస్తామని ఏసీపీ వసుంధర యాదవ్ మీడియా సమావేశంలో పేర్కొన్నారు.



# హైదరాబాద్‌లో అకాల వర్షం... నగరానికి ఆరెంజ్ అలర్ట్

హైదరాబాద్ నగరంలో మంగళవారం అకాల వర్షం ముంచెత్తింది. గత రెండు రోజులుగా ఉక్కపోతతో అల్లాడిన నగరవాసులకు ఈ వర్షం ఉపశమనం కలిగించినప్పటికీ, పలుచోట్ల జనజీవనానికి అంతరాయం కలిగించింది. ముఖ్యంగా మియాపూర్, చందానగర్, కోండాపూర్, మదీనాగూడ, లింగంపల్లి వంటి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. గంగారం నుంచి మియాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై వర్షపు నీరు చేరడంతో వాహనాలు నిలిచిపోయి తీవ్రమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని, గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద, పాత భవనాల వద్ద నిలబడవద్దని సూచించింది. ఈ అకాల వర్షాలు రైతులపై మిశ్రమ ప్రభావం చూపుతున్నాయి. కొన్ని ఆరుతడి పంటలకు ఈ వానలు మేలు చేస్తుండగా, ఈదురుగాలులు, వడగళ్ల కారణంగా చేతికొచ్చిన వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీ చేసింది.

# ఇంటర్, 10వ తరగతి పరీక్షలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయండి.







## విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించాలి.

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు.

**మహబూబాబాద్, ఫిబ్రవరి 24(నంది పత్రిక):** రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్, 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ లోని డా.బి.ఆర్.అంబేద్కర్ సచివాలయం నుండి కార్యదర్శి డా.యోగితా రాణా, కృష్ణ ఆదిత్య, నికోలస్ తదితర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్, 10వ తరగతి పరీక్షల నిర్వహణ, పీఎంశ్రీ పాఠశాలలు, సమగ్ర శిక్షా అభియాన్ తదితర అంశాలపై సమీక్షించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, వైద్య సదుపాయాలు, సీసీ కెమెరాలు వంటి మౌలిక వసతులు సమృద్ధిగా ఉండాలని సీఎస్ స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల రవాణా, భద్రతా చర్యలు, పోలీసు బందోబస్తు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లడానికి అనుమతి లేదని, పకడ్బందీ తనిఖీ అనంతరం విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా సానుకూల వాతావరణం కల్పించాలన్నారు. ప్రత్యేకించి దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పీఎంశ్రీ పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, సమగ్ర శిక్షా అభియాన్ అమలు పురోగతిని సమీక్షిస్తూ నాణ్యమైన విద్య అందించేందుకు అధికారులు కృషి చేయాలని సీఎస్ రామకృష్ణారావు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు 18 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి సంవత్సరంలో 4158 మంది, 2వ సంవత్సరం లో 4129 మంది, మొత్తం (8287) మంది విద్యార్థులు హాజరు అవుతున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు నిర్ణీత సమయం కంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 10 తరగతి పరీక్షలకు 45 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 8157 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఇంటర్, 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పీ డాక్టర్ శబరీష్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ)అనిల్ కుమార్, విజయలక్ష్మీ, డీఈఓ రాజేశ్వర్, ఇంటర్మీడియట్ అధికారి మదార్, జిల్లా వైద్యాధికారి డా.రవి రాథోడ్, ఆర్టిఓ క్రిష్ణవేణి, ఆర్టీసీ డిఎం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు.





## ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్.

**మహబూబాబాద్, ఫిబ్రవరి 24(నంది పత్రిక):** తెలంగాణలో ఆదివాసీ, గిరిజనుల ఆరాధ్య దైవం సమ్మక్క సారక్క జాతర తరహాలో శ్రీసంతు సేవలాల్ మహారాజ్ జయంతిని కూడా అంగరంగ వైభవంగా, మహా జాతరగా నిర్వహిస్తామని మహబూబాబాద్ ఎంఎల్ఏ డా.భూక్య మురళి నాయక్ అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన శ్రీసంత్ సేవలాల్ జయంతి ఉత్సవాలలో ఎంఎల్ఏ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి అనంతారం లోని సంత్ సేవలాల్ మహారాజ్ ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంఎల్ఏ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహరాజ్ బంజారాల ఆరాధ్య దైవం, హిందూ ధర్మం గొప్పతనాన్ని బంజారాలకు తెలియజేయడానికి జన్మించిన మహానుభావునిగా భావిస్తారు. సేవాలాల్ మహారాజ్ ఈ సమస్త జీవకోటికి మాతృరూపం (తల్లిగా) వెలిసిన అమ్మభవాని గురించి అమ్మను పూజించాలని, కాని ఫలితం ఆశించవద్దని బంజారా లకు బోధించారని తెలిపారు. సంత్ సేవాలాల్ మహరాజ్ హింస పాపమని, మత్తు, ధూమ పానం శాపం అని హితవు పలికి, బంజారా జాతికే కాకుండా యావత్తు ఇతర కులాలకు ఆదర్శ పురుషుడయ్యారని తెలిపారు. సేవాలాల్ మహరాజ్ ఆనాడు బంజారా జాతి పరువు ప్రతిష్టల గురించి ముందుగానే ఊహించి అహింస సిద్ధాంతానికి పునాది వేసి ఆచరించి చూపారు. ఆ



తరుణంలో బంజారాలు రాజుల కాలం నుంచి బ్రిటిష్ కాలం వరకు ఆయా రాజ్యాలకు అవసరమైన యుద్ధ సామాగ్రిని చేరవేస్తూ సంచార జీవనం సాగిస్తూ ఉండేవారు. ఆ క్రమంలో బ్రిటిష్, ముస్లీం పాలకుల మత ప్రచారం ద్వారా బంజారా సమాజం అనేక ఇబ్బందులకు గురి అయ్యింది. ఈ పరిస్థితులలో బంజారా జాతిని సన్మార్గంలో నడిపించేందుకు సేవాలాల్ మహారాజ్ అవతరించారు. సేవాలాల్ మహరాజ్ బోధనల ద్వారా బంజారా జాతి ఔన్నత్యం పెంపొందుతుందన్నారు. అనంతారంలో ఉన్న సంతు సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. దీనిని గిరిజనుల అందరికీ అంకితం చేస్తానన్నారు. అదేవిధంగా బంజారాలందరూ ఐకమత్యంగా ఉండాలని, ప్రతి ఒక్క తల్లి బంజారా బిడ్డకు జాతి ఖ్యాతిని వారికి వివరించాలని కోరారు. బంజారా జాతిలో ఎంతో మంది మంచి స్థాయిలో ఉన్నారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోతు జ్యోతి, వైస్ చైర్మన్ సోమయ్య, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి జి.దేశీ రామ్ నాయక్, ఉత్సవాల ప్రత్యేక అధికారి జి.మరియన్న, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మహబూబాబాద్ నియోజకవర్గం లోని బంజారా సోదరులు, మహిళా మణులు, గిరిజన నాయకులు, ప్రభుత్వ సంబంధిత శాఖల అధికారులు, నాయకులు, పట్టణ అధ్యక్షులు, పట్టణ కౌన్సిలర్లు, నియోజకవర్గ సర్పంచులు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

# నిషేదిత భూముల జాబితా - 22-ఎ కు దరఖాస్తులు విచారణపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా యంత్రాంగం

**నెలలో ప్రతి మంగళవారం (సెలవు దినాలు మినహా) 22-ఎ కేసుల విచారణ.**

**నేడు విచారణకు చేపట్టిన 30 కేసులు..**

**మధ్యాహ్నం ప్రారంభించిన కేసులు విచారణ రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగింది**

**కేసుల విచారణను సంయుక్తంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**



**భీమవరం చీఫ్ బ్యూరో: ఫిబ్రవరి 24, నంది పత్రిక** భీమవరం కలెక్టరేట్ చాంబర్ నందు మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా వ్యాప్తంగా అందిన నిషేదిత భూముల జాబితా – 22–ఎ కు సంబంధించిన దరఖాస్తులలో నేడు 30 దరఖాస్తులకు సంబంధించి విచారణ చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులలో పట్టా భూములుగా నమోదై క్రయ, విక్రయాలు జరిగిన భూములు ఆన్లైన్లో 22 ఏ లో చూపించడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, అనారోగ్య సమయాలలో తమ ఆస్తులను అమ్మవలసిన పరిస్థితుల్లో 22–ఏ లో చూపించడం ద్వారా రైతులు అమ్ముకోలేక ఇబ్బందులు పడటం జరుగుచున్నదన్నారు. దీనికి సంబంధించి రైతులు నుండి భూముల క్రమబద్ధీకరణకు పి.జి.ఆర్.ఎస్ ద్వారా ఎక్కువ దరఖాస్తులు రావడంపై రెవెన్యూ శాఖ 22 ఏ కేసులు పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. ఈ కేసుల విచారణ నిమిత్తం నెలలో ప్రతి మంగళవారం ప్రత్యేకంగా కేటాయించి, భూమికి సంబంధించిన అన్ని రికార్డులు విచారణ సమయంలో సమర్పిస్తే విచారణ జరిపి నిబంధనల మేరకు సత్వరంగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే రెండు దఫాలుగా నిర్వహించిన విచారణలో 09 కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు.

నేడు నిర్వహించిన విచారణలో 14 కేసులను పరిష్కరించగా, భూములకు సంబంధించిన రికార్డులను సమర్పించకపోవడంతో 16 కేసులు వచ్చే వారానికి వాయిదా వేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రతి మంగళవారం ఈ కార్యక్రమానికి చేపట్టడానికి చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత మండలాల తహసిల్దారులు, డిప్యూటీ తహసిల్దారులు, మండల సర్వేయర్లు, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్, దరఖాస్తుదారులు, తదితరులు పాల్గొన్నారు.

# శక్తి యాప్... బాలికలకు సురక్ష

## చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలి



**పాణ్యం ఫిబ్రవరి 24 నంది పత్రిక** . నంద్యాల జిల్లాలోని యువతులకు మహిళలకు శక్తి యాప్ సురక్షితమ ని, యువతకు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది విద్యార్థులకు చైతన్యం కలిగించారు. మంగళవారం పాణ్యం మండలంలోని కొణిదెడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శక్తి అవగాహన కల్పించారు. ఏ ఎస్ పి జావళి ఉత్తర్వుల మేరకు వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది మరియు డిస్టిక్ ఈగల్ టీం సిబ్బందితో కలిసి విద్యార్థులకు చైతన్యం కలిగించారు. విద్యార్థినిలకు శక్తి ఆప్ గురించి వివరంగా తెలిపా రు. శక్తి ఆప్ నంబర్ 7993485111 ను తెలిపి వాటి గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఈ సెల్ నీ సెల్లులో ఈ నెంబర ను నమోదు చేసుకుని శక్తి యాప్ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్ 1930 బాల్యవివాహాలు చైల్డ్ వెల్ఫేర్ 1098 ఉమెన్ వెల్ఫేర్ 181 మొదలగు వాటి గురించి వివరించరు. శక్తి టీమ్ల పనితీరును తెలిపి ప్రతి అమ్మాయి మొబైల్ నందు శక్తి యాప్ ఉండవలెనని శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకునే విధానం తెల్పరు. వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది మహిళలపై జరిగే అత్యాచారాల గురించి వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను తెలిపి లైంగిక వేధింపుల గురించి వివరించి బాల్య వివాహాల గురించి తెలిపా రు. విద్యార్థులకు ఈగల్ టీం వాళ్లు చెడు అలవాట్లకు బానిస కావద్దని మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దని చెప్పినారు శక్తి టీమ్ సిబ్బంది అక్కడ ఉన్న టీచర్లకు శక్తి యాప్ డౌన్లోడ్ చేయించి అవేర్నెస్ ప్రోగ్రాం చేయించారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు అధికారులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రజారోగ్యమే లక్ష్యంగా వైద్య శిబిరాల నిర్వహణ.



**కేసముద్రం, ఫిబ్రవరి 24(నంది పత్రిక):** ప్రజల ఆరోగ్యమే తమ లక్ష్యమని కేసముద్రం మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ పురం రాజమణి రమేష్, 6వ వార్డు కౌన్సిలర్ పాయిరాల శరత్ యాదవ్ తెలిపారు. కేసముద్రం మున్సిపాలిటీ అమీనాపురం పరిధిలో గల 5వ, 6వ వార్డ్ లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలు పెద్ద మొత్తంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యం ప్రతి ఒక్క పేదవాడికి అందేలా ప్రతి నెల రెండుసార్లు నిర్వహించాలని అధికారులను కౌన్సిలర్ లు కోరారు.



# గణపతి ఆచూకీ కనుగొన్న పోలీసులు

## నేపాల్లో ప్రవాసంలో ఉన్నట్లుగా గుర్తింపు

కొన్ని దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీని నడిపించిన అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ రావు ఆచూకీ లభ్యమైంది. గత కొన్నేళ్లుగా భారత్ పొరుగునున్న నేపాల్లో ఆయన మకాం వేశారు. తీవ్ర అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన నడవలేని పరిస్థితిలో ఉన్నారు. అయితే గణపతిని భారత్కు రప్పించేందుకు తెలంగాణ పోలీసులు తమ

ప్రయత్నాలను ముమ్మరం చేశారు. వృద్ధాప్యం కారణంగా మావోయిస్టు పార్టీ కార్యదర్శి పదవిని గణపతి వదిలిపెట్టిన సంగతి తెలిసిందే. మరో వైపు హైదరాబాద్లో పోలీస్ ఉన్నతాధికారుల ఎదుట నలుగురు కీలక మావోయిస్టులు లొంగిపోనున్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సెక్రటరీ దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు, కేంద్ర కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డితోపాటు నున్నె నరసింహారెడ్డిలు లొంగిపోనున్నారు. ఇటీవల ఆసీఫాబాద్ అడవుల్లో ఎస్ఐబీ ఎదుట దేవ్ జీతోపాటు మల్లా రాజిరెడ్డి లొంగిపోయిన సంగతి తెలిసిందే. అదీకాక దేవ్ జీతోపాటు పలువురు అగ్రనేతలు మధ్యప్రదేశ్ నుంచి ఛత్తీస్గఢ్ తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టలకు చేరుకున్నారంటూ నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. ఈ నేపథ్యంలో కర్రెగుట్టల ప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా జరిగిన ఎన్కౌంటర్లో పలువురు మావోయిస్టులు మరణించిన విషయం విదితమే. 2026, మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశిరచుకొంది. ఆ దిశగా వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. దీంతో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో భద్రతా బలగాలు నిరంతరం కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా జరిగిన పలు ఎన్కౌంటర్లలో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. వేలాది మంది ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. పలువురు అరెస్టయ్యారు. భద్రతా బలగాలతో జరిగిన ఎన్కౌంటర్లలో పలువురు అగ్రనేతలు సైతం మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే మావోయిస్టు అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణరావు పోలీసులకు చిక్కితే.. మావోయిస్టు పార్టీ చరిత్రగా మిగిలిపోయే అవకాశం ఉందనే ఒక చర్చ సాగుతోంది.

# ప్రజల పాలిట పాలకూట విషం

కల్తీకి కాదేదీ అర్హం అన్న రీతిలో... ఆహారా పదార్థాల కల్తీ విపరీతం అయ్యింది. అడపాదడపా దాడుల్లో కల్తీలు బయటపడుతున్నా కఠిన చర్యలు కనిపించడం లేదు. కల్తీ చేస్తున్న దగుల్బాజీల్లో భయం కనిపించడం లేదు. కల్తీ కల్లుకు బలవుతున్నారు. కల్తీ మద్యానికి బలవుతున్నారు. ఫుడ్ పాయిజనింగ్‌కు బలవుతున్నారు. చివరకు పాలు కూడా కల్తీ చేస్తున్నారు. యూరియా లాంటివి కలిపి కృత్రిమ పాలతో ప్రజల ప్రాణాలు తోడేస్తున్నారు. నిత్యం తాగే పాలను సైతంకల్తీ చేస్తున్న ఘటన వెలుగులోకి రావడం దారుణం. కల్తీ పాల కారణంగా ఇప్పటికే ఐదుగురు మృత్యువాత పడ్డారు. మరికొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి ఐదుగురు మరణించడం బాధాకరం. స్వచ్ఛతకు మారుపేరుగా పాలను పేర్కొంటారు. అటువంటి పాలను అమితమైన లాభార్జన కోసం కాలకూట విషం కావించడం అమానవీయం. ఒకప్పుడు పాలల్లో నీళ్లు కలపడాన్ని పెద్ద నేరంగా పరిగణించేవారు. ఇప్పుడు పాలంటే హడలెత్తే స్థితికి కల్తీ దందా చేరుకోవడం ఆందోళన కలిగిస్తుంది. పాలు ప్రజలకు నిత్యావసర వస్తువు. పసికందుల దగ్గర నుంచి వృద్ధుల వరకు పాలే జీవనాధారం. పాలు తాగితే చాలా వరకు మన శరీరానికి కావాల్సిన సంపూర్ణ పోషకాలు సమకూరుతాయన్నది ఆరోగ్య నిపుణుల మాట. అటువంటి పాల వ్యాపారంపై ప్రభుత్వ నియంత్రణ అంతంత మాత్రమే. ఎవరైనా డెయిరీ పెట్టవచ్చు. పాలు సరఫరా చేయవచ్చు. అందులో ఏం కలుస్తున్నాయో తెలియడం లేదు. నేరుగా గేదె పాలు పోస్తున్నారన్న నమ్మకంతో ప్రజలు డబ్బాల్లో వచ్చే పాలను ఆశ్రయిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు అడ్రస్ లేకుండా పోయారు. వాటిపై పర్యవేక్షణ ఎవరిదన్న విషయం తెలియదు. కాలం చెల్లిన, నాసిరకం, కల్తీ పాలను గుర్తించే వ్యవస్థ అసలు ఉందా అన్నదే అనుమానం. గతంలో రైతులు తమకు తాముగా నిర్వహించుకునే సహకార వ్యవస్థ బలంగా ఉన్నప్పుడు పాల కల్తీ ఉండేది కాదు. ఎప్పుడైతే ప్రైవేటు డెయిరీలు పుట్టగొడుల్లా పుట్టుకొచ్చాయో అప్పటి నుంచి కల్తీ విచ్చలవిడైందన్న ఆరోపణలు బాగా ముందుకొచ్చాయి. పాడి-పంట.. గ్రామీణ ప్రాంతాల్లో రైతుతో విడదీయరాని బంధం. గ్రామీణ మహిళలే పాడిని నిర్వహిస్తారు. కానీ కష్టపడి పాలను ఉత్పత్తి చేసిన రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. వారి వద్ద నుంచి పాలను సేకరించిన ప్రైవేటు డెయిరీలకు మాత్రం లాభాల పంట పండుతుంది. రోజూ ఉత్పత్తవుతున్న పాలల్లో ప్రైవేటు, సహకారం రెండూ కలిపినా కూడా సంఘటితరంగం కిందికొచ్చేవి సగం కూడా లేదన్నది ప్రభుత్వ అంచనా. ప్రభుత్వం దశలవారీగా సహకార రంగాన్ని నిర్వీర్యం చేయడంతో ప్రైవేటు ఆధిపత్యం అంతకంత కూ పెరుగుతోంది. డెయిరీల మధ్య అనారోగ్య పోటీ నెలకొంది. డెయిరీ ప్రైవేటీకరణ కాస్తా కార్పొరేటీకరణ బాట పట్టింది. ఎప్పుడైతే పరిస్థితి మారిందో చిన్నా చితకా డెయిరీలు సైతం లాభాల కోసం అడ్డదారులు తొక్కుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నాయి. రాష్ట్రంలో పాడిపశువుల సంఖ్యపై అనుమానా లున్నాయి. ప్రజల ఆరోగ్యాలను హరించే సింథటిక్ పాలు, యూరియా వంటి రసాయనాలతో తయారు చేసిన పాలు మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నాయన్న ఫిర్యాదులొస్తున్నాయి. పాల వ్యాపారులు ఏకంగా కృత్రిమ పాలను ఉత్పత్తి చేస్తున్నట్లు కనిపిస్తుంది. దీనికితోడు తనిఖీ బాధ్యతను ఆయా సంస్థలకే వదిలేసినట్లు కనిపిస్తుంది. పాలతో సహా యావత్ ఫుడ్ సేఫ్టీ బాధ్యత ప్రభుత్వానిదే అయినా ఎక్కడా అజమాయిషీ కనిపించడం లేదు. . అందుకు పటిష్టమైన వ్యవస్థ అవసరం. లేదంటే ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందనడానికి రాజయమండ్రి ఘటనే నిదర్శనం. రాజమహేంద్రవరం కేసులకు సంబంధించిన ఇప్పటికీ ఇద్దరు వెంటిలేటర్‌పై ఉండగా, ఎనిమిది మంది తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఒకే వ్యక్తి నుంచి పాలు కొనుగోలు చేసిన వారిలో ఈ వ్యాధి ముదరి ఆస్పత్రి పాలయ్యారు. అనూరియా అంటే మూత్ర విసర్జన ఆగిపోవడం వంటి జబ్బుతో పలువురు ఆస్పత్రిలో చేరారు. రాజమండ్రి నగర శివారుకు చెందిన డజను మంది అనూరియా లక్షణాలతో ఆదివారం ఒకేసారి ఆస్పత్రులల్లో చేరడంతో కలకలం లేచింది. పరిస్థితి డయాలసిస్, కిడ్నీల ఫెయిల్యూర్ వరకు వెళ్లడంతో స్థానిక ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అనారోగ్యం పాలైన వారు వృద్ధులు, చిన్నారులే కావడం పెద్ద విషాదం. అప్రమత్తమైన అధికార యంత్రాంగం కారణాలను అన్వేషించే పనిలో పడింది. కోరుకొండ మండలం పర్సాపురం గ్రామానికి చెందిన వరలక్ష్మి డెయిరీ నుంచి సరఫరా అయిన కల్తీ పాలే పలువురి అస్వస్థతకు మూలమని ప్రాథమికంగా గుర్తించారు. డెయిరీ నిర్వాహకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని కూపీ లాగుతున్నారు. కల్తీ పాల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించడం తో పాటు బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని పేర్కొంది. మృతుల కుటుంబాలకు రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారి పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తానని పేర్కొంది. ఈ మేరకు శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, శాసన మండలిలో హోం మంత్రి అనిత ప్రకటనలు చేశారు. దీనిని ఇంతటితోనే విదిలేస్తే సరిపోదు. పాల సరఫరాచేస్తున్న వారిపై నిఘా పెట్టాలి. కల్తీ పాల వ్యవహారాన్ని గుర్తించాలి. నిజానికి పాడిగేదెలు ఎన్ని ఉన్నాయి..ఎక్కడెక్కడ నుంచి పాలు వస్తున్నాయో వివరాలను ప్రభుత్వం వద్ద నమోదు చేసుకునేలా చేస్తే మంచిది. పాల కల్తీ జనాన్ని కలవర పరుస్తోంది. కాసుల కక్కుర్తితో కొందరు ఈ పాపానికి ఒడిగడుతున్నారు. అనుమతి లేని కేంద్రాలను నడుపుతూ జనం ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. పటిష్ఠ తనిఖీలు, కఠిన శిక్షలు లేకపోవడంతో పాల కల్తీకి అడ్డుకట్ట పడడం లేదు. జిల్లాల్లో అవసరాలకు, ఉత్పత్తికి భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్యాకేజ్డ్ పాల ద్వారా కొంత అవసరాలు తీరుతుండగా.. మిగతా పాలు ఎక్కడివనే తీవ్ర అనుమానాలు రేకెత్తుతున్నాయి. వినియోగానికి అనుగుణంగా ఉత్పత్తి లేకపోవడంతో కొందరు కాసుల కక్కుర్తితో కల్తీకి పాల్పడుతున్నారు. రెండు లీటర్ల పాలల్లో యూరియా, బియ్యం పిండి, సోడా వంటివి కలిపి 5 నుంచి 6 లీటర్లుగా తయారు చేస్తున్నారు. ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లపై నిషేధమున్నా.. పాల దిగుబడి పెంపునకు రహస్యంగా తెచ్చి గేదెలకు ఇస్తున్నారు. గ్లూకోజ్, సోడియం, హైడ్రాక్సైడ్, గంజి పౌడరు, జంతువుల కొవ్వు కొన్ని రకాల పాల పౌడులను పాలలో కలిపేస్తున్నారు. రసాయనాలతో వ్యాధుల ముప్పు: కల్తీ పాలతో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. చిక్కదనం కోసం వాడే యూరియా మూత్రపిండాలను దెబ్బతీస్తుంది. నిల్వ కోసం కలిపే వాడే ఫార్మలిన్ అనే రసాయనంతో జీర్ణకోశ వ్యవస్థ అస్తవ్యస్తమవుతుంది. రసాయనాలతో ఉదర, కాలేయ సంబంధిత సమస్యలొస్తాయి. రాజమండ్రిలో మాత్రమే ఇప్పుడు బయటపడ్డది. ప్రభుత్వం మేలుకోకుంటే మరిన్ని ఘటనలు రావచ్చు.

# ఎంతకాలం ఉంటానో తెలియదు..

### అయినా వెనకడుగు వేసే ప్రసక్తి లేదు

### నన్ను చంపడానికి అందరూ కాచుక్కూచున్నారు

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య

నేను ఎంతకాలం ఉంటానో తెలియట్లేదు' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇటీవల ఫ్లోరిడాలోని తన నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడిన ఘటనపై స్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మార్-ఎ-లాగో రిసార్ట్ లోకి తుపాకీతో చొరబడేందుకు ప్రయత్నించిన ఆగంతుకుడిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్చి చంపిన ఘటనపై డొనాల్డ్ ట్రంప్ తొలిసారి స్పందించారు. ఈ భద్రతా లోపంపై ఆయన కాస్త ఆందోళన, మరికాస్త వ్యంగ్యంగా మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. వైట్ హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్.. నేను ఇంకా ఎంతకాలం ఇక్కడ ఉంటానో నాకు తెలియదు. నా కోసం తుపాకులు పట్టుకుని ఎంతమంది వేచి చూస్తున్నారో చూశారుగా ?' అని వ్యాఖ్యానించారు. గొప్ప నాయకులకే ఇలాంటి ముప్పు ఉంటుందని, అబ్రహం లింకన్, కెన్నడీ వంటి 'ప్రభావశీల' అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని చెప్పారు. బహుశా నేను కొంచెం తక్కువ ప్రభావశీల నాయకుడిగా ఉంటే బాగుండేదేమో.. కాసేపు సాధారణ అధ్యక్షుడిలా ఉందాం అని చమత్కరించారు. ఫిబ్రవరి 22 తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో ఆస్టిన్ టక్కర్ మార్టిన్ (21) అనే యువకుడు షాట్ గన్, ఇంధనం క్యాన్‌తో మార్-ఎ-లాగో ప్రహరీని దాటేందుకు ప్రయత్నించాడు. భద్రతా దళాలు హెచ్చరించినప్పటికీ, అతడు లొంగకుండా తుపాకీని ఎక్కుపెట్టడంతో సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మార్టిన్ అక్కడికక్కడే మరణించాడు. ఆ సమయంలో ట్రంప్ దంపతులు వైట్ హౌస్‌లో ఉన్నారు. గతంలో కూడా ట్రంప్‌పై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. తాజా ఘటనలో చనిపోయిన యువకుడు ఎప్ స్టీన్ ఫైల్స్ విడుదలకు సంబంధించి ప్రభుత్వంపై అసహనంతో ఉన్నట్లు కొన్ని టెక్ట్స్ మెసేజ్‌ల ద్వారా వెల్లడయ్యింది.తనపై జరుగుతోన్న వరుస హత్యాయత్నాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. తనను హత్య చేయడానికి చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నారని.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తాను ఎంత కాలం ఉంటానో కూడా తెలియట్లేదన్నారు. ఇటువంటి షూటర్లు సాధారణ అధ్యక్షుల జోలికి వెళ్లరని.. కేవలం అసాధారణ విజయాలు సాధించే అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని అన్నారు. ఇలాంటి ఎన్ని బెదిరింపులకు పాల్పడినా.. తాను తీసుకునే నిర్ణయాలపై ఏ మాత్రం వెనక్కి తగ్గబోనన్నారు.2024 జులైలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనపై ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. ఆ ఘటనలో ట్రంప్ చెవి భాగం నుంచి తూటా దూసుకెళ్లింది. ఆ తర్వాత ఓసారి ట్రంప్ పామ్ బీచ్ గోల్ఫ్ కోర్స్‌లో రైఫిల్‌తో అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తినీ పోలీసులు అరెస్టు చేశారు.

# ఎఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ నిరసనలు

### యూత్ కాంగ్రెస్ చిల్లర చేష్టలపై విమర్శలు

### యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు చిబ్ అరెస్ట్

ఢిల్లీలోని భారత్ మండపంలో ఇటీవల జరిగిన ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన 'షర్ట్‌లెస్' నిరసనకు సంబంధించి.. యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నిరసన గురువారం సమ్మిట్ ఎగ్జిబిషన్ హాల్‌లో జరిగిన సంగతి తెలిసిందే. ఐదుగురు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు షర్టులు విప్పేసి, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా సందేశాలు రాసిన టీ-షర్టులు పట్టుకొని నిరసన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఆరోపణలు గుప్పించారు. సెక్యూరిటీ సిబ్బంది.. వారిని వెంటనే బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన తర్వాత ఏడుగురు కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.మంగళవారం ఢిల్లీ పోలీసులు ఉదయ్ భానును అరెస్టు చేశారు. ఆయన్ను తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో 15 గంటలకు పైగా విచారించిన తర్వాత అరెస్ట్ చేశారని సమాచారం. దీంతో ఈ కేసులో మొత్తం అరెస్ట్‌ల సంఖ్య ఎనిమిదికి చేరింది. పోలీసులు ఆయనపై.. కుట్రలో పాత్ర ఉందని, విచారణకు సహకరించలేదని, తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. త్వరలోనే కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. భూపేశ్ బాఘేల్ వంటి సీనియర్ నేతలు ఈ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. 'ప్రజాస్వామ్యంలో యువత ప్రశ్నలు వేయడం, నిరసన తెలపడం నేరం కాదు,అది ప్రజాస్వామ్య ఆయుధం' అని బాఘేల్ అన్నారు. ఈ అరెస్ట్‌లను అరాచక, అన్యాయ చర్యలుగా పేర్కొన్నారు. నిరసన శాంతియుతం గా జరిగిందని, యువత బాధలను బయటపెట్టడమే ఉద్దేశ్యమని కాంగ్రెస్ వర్గాలు వాదిస్తున్నాయి. బీజేపీ నేత ప్రదీప్ భండారి ఈ నిరసనను 'నేక్డ్ యాంటీ-ఇండియా ప్రొటెస్ట్' అని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను యాంటీ-ఇండియా, యాంటీ-గ్రోత్ పార్టీగా విమర్శించారు. 'యువతకు కాంగ్రెస్ 'నంగి' పార్టీగా కనిపిస్తోంది' అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో జరుగుతున్న చర్చలు, ప్రదర్శనలకు సంబంధించింది. దీనిని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈవెంట్‌గా చూస్తున్నారు. అయితే.. ఈ నిరసన వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందని, దేశం పరువు మంటగలపాలన్నది వీరి పన్నాగమని బీజేపీ వర్గాలు మండిపడు తున్నాయి.

# పరీక్ష రాయాలంటే..నది దాటాల్సిందే

ఆ విద్యార్థుల కష్టాలు అన్నీఇన్నీ కావు. ఇంటర్ పరీక్షలు రాసేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. పరీక్ష కేంద్రానికి చేరుకునేందుకు పెద్ద సాహసం చేస్తున్నారు. నాగావళి నదిలో దిగి మోకాళ్ల లోతులో ఉన్న నీటిలో నడుచుకుంటూ అవతల ఒడ్డుకు చేరుతున్నారు. అక్కడి నుంచి తడిచిన దుస్తులతోనే పరీక్ష కేంద్రానికి వెళ్తున్నారు. ఇదీ కొమరాడ మండలంలోని ఐదు గ్రామాలకు చెందిన విద్యార్థుల పరిస్థితి.

**ఇదీ పరిస్థితి..** కొమరాడ మండలంలోని తొడుము, లాబేసు, కొట్టు, తులసివలస, రాయపురం గ్రామాలకు చెందిన 11 మంది ఇంటర్ విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ గ్రామాలన్నీ నాగావళి నదికి అవతల ఉన్నాయి. ఈ విద్యార్థులకు నది ఇవతల ఉన్న కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం కేటాయించారు. దీంతో ప్రతిరోజూ నదిలో దిగి మోకాళ్ల లోతులో ఉన్న నీటిలో నడుచుకుంటూ పరీక్ష కేంద్రానికి చేరుతున్నారు. అవతలి ఒడ్డు ఉంచి ఇవతలి ఒడ్డుకు చేరుకునేందుకు గంట సమయం పడుతుంది. సాధారణంగా నీటి ప్రవాహం తక్కువగా ఉంటే ఎటువంటి బెదురు లేకుండా విద్యార్థులు నదిని దాటేస్తుంటారు. కానీ, ఈ నెల 23వ తేదీ రాత్రి ఒడిశాలో కురిసిన వర్షాలతో నాగావళిలో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని నది దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏమాత్రం ఇబ్బంది ఎదురైనా ప్రాణాలు గాలిలో కలిసిపోవాల్సిందే. అయినప్పటికీ ఇంటర్మీడియట్ పాస్ కావాలనే లక్ష్యంతో గుండె నిండా ధైర్యం తెచ్చుకొని నది దాటి వచ్చి విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.



**ఎన్నాళ్లీ కష్టాలు..** కొమరాడ మండలంలో నాగావళి నది అవతల ఉన్న గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అనేకం. ఏ పని కోసమైనా ఇవతల ఉన్న కొమరాడకు రావాల్సిందే. ఈ గ్రామాల నుంచి మండల కేంద్రానికి దూరం నాలుగైదు కిలోమీటర్లు ఉంటుంది. కానీ, మధ్యలో నాగావళి నది ఉండడంతో ప్రయాణానికి ఇబ్బందులు తప్పడం లేదు. వర్షా కాలంలో నదిని దాటేందుకు పడవలను నడుపుతారు. మిగతా రోజుల్లో పడవలు ఉండవు. నదిలో దిగి రాకపోకలు సాగించాల్సిందే. లేదంటే దలైపేట, చీమనాయుడువలస, పెదమేరంగి, పార్వతీపురం తదితర గ్రామాల మీదుగా బస్సులు, ఆటోలు ఇతర వాహనాల్లో 60 కిలోమీటర్లు ప్రయాణం చేసి కొమరాడకు చేరుకోవాల్సి ఉంటుంది. అయితే, ఇంటర్ పరీక్షల కోసం చుట్టూ తిరిగి వెళ్తే సమయం వృథా అవుతుందనే ఉద్దేశంతో విద్యార్థులు ప్రాణాలకు తెగించి నాగావళి నది దాటి కొమరాడలోని కేంద్రానికి హాజరవుతున్నారు. ఈ గ్రామాల్లో 5వ తరగతి వరకు పాఠశాలలు ఉన్నాయి. ఉపాధ్యాయులతో పాటు ఇతర అధికారులు కూడా ఒడిశా రాష్ట్రం వనిజ వంతెన మీదుగా ప్రయాణం చేసి ఈ గ్రామాలకు చేరుకుంటుంటారు. పూర్ణపాడు-లాబేసు వంతెన పూర్తయితే తమకు ఈ కష్టాలు ఉండవని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా వంతెన పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

**పూర్ణపాడు-లాబేసు వంతెనపై నిర్లక్ష్యం..** నాగావళి నది అవతల ఉన్న తొమ్మిది పంచాయతీలకు చెందిన ప్రజల విన్నపం మేరకు గత టీడీపీ ప్రభుత్వం పూర్ణపాడు-లాబేసు వంతెన పనులకు శ్రీకారం చుట్టింది. ఈ వంతెన కోసం రూ. 10 కోట్లు మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టర్ సగం పనులే చేపట్టి వదిలేశాడు. మిగతా పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేస్తామని గత వైసీపీ పాలకులు గొప్పలు చెప్పారు. కానీ, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిధులు మంజూరు చేసింది. అయినప్పటికీ పనులు ప్రారంభంకాలేదు.

# రహదారుల పనులు పూర్తి చేయాలి



డోలీ రహిత జిల్లాగా మార్చేందుకు పలు గ్రామాల్లో చేపడుతున్న రహదారుల పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లు నిర్మాణంలో ఎటువంటి పొరపాట్లుకు తావులేకుండా నాణ్యత, పారదర్శకతతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మొత్తం 81 రోడ్లు మంజూరు చేశామని, ఇప్పటివరకు 50 గ్రౌండింగ్ అయ్యాయని, మిగిలిన పనులు కూడా ప్రారంభించాలని ఆదేశించారు. బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ నెలాఖరులోగా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా ఈఈలు, ఏఈలు బాధ్యత వహించాలన్నారు. ఈఈలు క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీ చేయాలన్నారు. పనులకు సంబంధించి ఫొటోలను తప్పనిసరిగా తీయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్‌కలెక్టర్లు ఆర్.వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్, డ్వామా పీడీ కె.రామచం ద్రరావు, ఈఈలు, ఏఈలు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# చినుకు...వణుకు

జిల్లాలో సోమవారం రాత్రి ఒక్కసారిగా వాతావరణం మారింది. ఆకాశమంతా మేఘావృతమై కొన్ని చోట్ల చిరు జల్లులు పడ్డాయి. మంగళవారం కూడా జిల్లా అంతా మేఘావృతమై ఉంది. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో మినుము, పెసర పంట కోతకు సిద్ధంగా ఉండగా, మరికొన్ని చోట్ల కుప్పల రూపంలో పంట పొలాల్లోనే ఉంది. ఈ సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారడంతో రబీ రైతులు ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావంతో జిల్లాలో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించడంతో రైతులు మరింత దిగాలు చెందుతున్నారు. వర్షం కురిస్తే మినుము, పెసర మొక్కలు తడిసిపోతాయని, గింజలకు మొలకలు వచ్చేస్తాయని ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల పత్తి పంట కోతకు వచ్చింది. కూలీల కొరతతో సకాలంలో పత్తిని ఏరలేని పరిస్థితి ఉంది. వర్షం పడితే పత్తి తడిసిపోయి రైతులకు నష్టం వాటిల్లనుంది.



**తగ్గిన దిగుబడి...**

జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో మినుము, పెసర తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. పొగమంచు కారణంగా పూత మాడిపోవడంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. సాధారణంగా పెసర ఎకరాకి 3 నుంచి ఐదు క్వింటాళ్లు, మినుములు మూడు నుంచి ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి రావాలి. కానీ, ఈ ఏడాది ఈ రెండు పంటలూ క్వింటా, రెండు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ధర మాత్రం కొంత ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో మినుము క్వింటా రూ.7 వేలు, పెసర రూ.8 వేలు పలుకుతుంది. ధర బాగున్నప్పటికీ దిగుబడి లేకపోవడంతో రైతులకు గిట్టుబాటు పరిస్థితి నెలకొంది.

# ఈదురుగాలుల బీభత్సం

మండలంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. సోమవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో మామిడిపల్లి, కందులపథం, అన్నంరాజువలస, మరిపిల్లి తదితర గ్రామాల్లో 62 ఎకరాల్లో అరటి మొక్కలు నేలకూలాయి. అదే విధంగా మామిడిపల్లి, మరిపిల్లి, కందులపథం, కురుకూటి, కొత్తవలస, ఖరాసవలస తదితర గ్రామాల్లో 60 ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట ధ్వంసంమైంది. అరటి పంటకు దాదాపు రూ.12 లక్షల నష్టం వాటిల్లింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. సాలూరు ఏవో కె.శిరీష, హెచ్‌వో ప్రత్యూష మంగళవారం ఆయా గ్రామాల్లో పర్యటించి పంట నష్టం అంచనా వేశారు. నష్టాల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏవో శిరీష తెలిపారు.



# రాహుల్‌కు ఎందుకీ కంటగింపు?

సమర్థ నాయకత్వం, సరైన మార్గదర్శనంతో భారత్ గత పన్నెండేళ్లుగా.. వికసిత భారతదేశ నిర్మాణం కోసం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుంది. ప్రజల భాగస్వామ్యంతో వాటిని సాధించే దిశగా అడుగులేస్తోంది. 'ఆత్మనిర్భర' నినాదంతో దేశీయంగా మన కాళ్లమీద మనం నిలబడే విధంగా చర్యలు తీసుకుంటూ.. విదేశాలతో బలమైన సంబంధాలను ఏర్పర్చుకుంటూ.. దేశ 'బంగారు భవిష్యత్తుకు భరోసా'ను సుస్థిరం చేసుకుంటోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో.. పుష్కరకాలంగా ప్రపంచంలోని ముఖ్య దేశాలు, కీలక కూటములతో భారతదేశం వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకుంటోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, 27 దేశాల సమాహారమైన యూరోపియన్ యూనియన్, బ్రిటన్, ఒమన్, మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాలతో కుదుర్చుకున్న మొత్తం 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో (ఫ్టీూ) భారత్.. ఉత్పత్తి, సేవల, వ్యవసాయ రంగాలకు మన దేశంలో పెద్దఎత్తున కొత్త మార్కెట్లకు ద్వారాలు తెరుచుకున్నాయి. గ్లోబల్ సప్లయ్ చైన్స్ పునర్వ్యవస్థీకృతమవుతున్న ఈ సమయంలో ఫ్టీూల ద్వారా భారత్.. అంతర్జాతీయంగా అనేక దేశాలకు అత్యంత విశ్వసనీయమైన భాగస్వామిగా నిలుస్తోంది. ఇలాంటి వ్యూహాత్మకమైన సమయంలో.. ప్రధాని మోదీ నాయకత్వంలో కుదిరిన భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం ఒక వాణిజ్య ఒప్పందంగా మాత్రమే కాకుండా.. 21వ శతాబ్దపు భారత్ అభివృద్ధి ప్రయాణంలో ఓ కీలక మైలురాయిగా నిలిచిపోనుంది. భారత్, అమెరికా ఒప్పందంపై సరైన అవగాహన లేకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పిస్తున్నారు. కానీ, దేశ ప్రయోజనాలను కాపాడే విషయంలో రాజీపడకుండా.. 140 కోట్ల భారతీయుల విశ్వాసాన్ని సంపాదించుకున్న ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సాధిస్తున్న విజయాలను సహించలేక, చేస్తోన్న మంచి పనులను.. అబద్ధాలతో, అసందర్భంగా కాంగ్రెస్ పార్టీ గుడ్డిగా వ్యతిరేకించడమే పనిగా పెట్టుకుంది. భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని మూడు ప్రధాన కోణాల్లో అర్థం చేసుకోవాలి. మొదటిది.. సాంకేతికతను ఇచ్చిపుచ్చుకోవడం, రెండోది.. పెట్టుబడుల విస్తరణ, మూడోది.. గ్లోబల్ వ్యాల్యూ చెయిన్‌లో భారతదేశ స్థానాన్ని సుస్థిరం చేసుకోవడం, ఇవి ప్రధాన లక్ష్యాలుగా కార్యాచరణ ఏర్పాటు చేసుకున్నాం. ప్రపంచంలో అతిపెద్ద మార్కెట్‌గా, సేవల కేంద్రంగా భారత్ ఎదిగింది. ఇప్పుడు.. ఉత్తమ సాంకేతికత తయారీ, డిజైన్‌లకు కేంద్రంగా మారేందుకు ఈ ఒప్పందం కీలకంగా మారనుంది. సెమీకండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ టెక్నాలజీ, డిఫెన్స్, స్పేస్, సైబర్ సెక్యూరిటీ లాంటి అనేక రంగాల్లో మనం మరింత పురోగతి సాధించేందుకు వీలుపడనుంది. ఈ సాంకేతికత ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా.. అత్యాధునిక పరిజ్ఞానం భారతదేశానికి అందుబాటులోకి వస్తుంది. మన ఇంజనీర్లు, మన స్టార్టప్‌లకు ప్రపంచస్థాయి ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం లభిస్తుంది. దీని కారణంగా.. టెక్నాలజీ దిగుమతిదారుగా ఉన్న భారతదేశం.. ఇకపై గ్లోబల్ స్టాండర్డ్ టెక్నాలజీని ఎగుమతి చేయనుంది. దేశ రాజధాని నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు ఓ స్పష్టమైన, సానుకూలమైన ప్రభావాన్ని చూపించే భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై విపక్షనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు.. రైతులు, ఎగుమతిదారుల్లో అనవసర అనుమానాలను కలిగించేందుకు చేసిన కుటిల ప్రయత్నమే. రోజురోజుకూ దేశ రాజకీయాల్లో అస్తిత్వాన్ని కోల్పోతున్న రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ.. నెగటివ్ రాజకీయాల ద్వారా ప్రజల్లో అశాంతిని, రేకెత్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. పదేళ్ల యూపీఏ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రజలు ఆగ్రహించి ఆ ప్రభుత్వాన్ని గద్దెదించితే.. ఈ పన్నెండేళ్లలో తమ కళ్లముందు జరుగుతున్న పురోగతికి అదే ప్రజలు సంపూర్ణ మద్దతు ఇస్తుండటంతో రాహుల్ జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే.. అవకాశం చిక్కినపుడల్లా అబద్ధాలతో ప్రజలను ప్రభుత్వంపై రెచ్చగొట్టేలా దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం భారత్ రూ.4 లక్షల కోట్ల విలువైన వస్త్రాలను వివిధ దేశాలకు ఎగుమతి చేస్తోంది. 38 అభివృద్ధి చెందిన దేశాల పరిధిలోని 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఫ్టీూం) ద్వారా.. ఈ ఎగుమతులు మరో పదిరెట్లకు పైగా పెరిగి.. రూ.45 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ మార్కెట్‌కు అవకాశాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అమెరికా దాదాపు రూ.10 లక్షలకోట్ల వస్త్రాలను దిగుమతి చేసుకుంటోంది. ఇందులో భారతదేశం నుంచే దాదాపు 10శాతం వస్త్రాలు అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. ఈ కొత్త ఫ్టీూ తర్వాత మన ఎగుమతులు మరింత పెరగనున్నాయి. ఈ పరిస్థితులకు తగ్గట్లుగా.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 7 మెగా టెక్స్‌టైల్ పార్కులను అభివృద్ధి చేస్తోంది. ఇందులో ఒకటి తెలంగాణలోని వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పేరుతో డెవలప్ అవుతోంది. ఇలాంటి ప్రాజెక్టులు అమెరికా మార్కెట్‌తో అనుసంధానమైతే వేలాది యువతకు ప్రత్యక్ష ఉపాధి లభిస్తుంది. దీనివల్ల తెలంగాణలోని చేనేత కార్మికులకు కూడా పెద్దమొత్తంలో లబ్ధి చేకూరనుంది. ఇది ఒక్క వస్త్ర పరిశ్రమ గురించిన ప్రస్తావన మాత్రమే. వివిధ పరిశ్రమలతో తెలంగాణకు మరింత ప్రయోజనం చేకూరడం ఖాయం. వస్త్ర పరిశ్రమ పెరిగితే.. పత్తి ఉత్పత్తికి కూడా డిమాండ్ పెరుగుతుంది. దీని ద్వారా రైతుల ఆదాయం కూడా పెరుగుతుంది. ఇది ఒక చైన్ ప్రాసెస్. కానీ, రాహుల్‌గాంధీ మాత్రం దీనికి భిన్నమైన, అర్థంలేని వాదనతో దేశ వస్త్ర పరిశ్రమ ఎగుమతిదారులను, పత్తి డిమాండ్ తగ్గుతుందని రైతులను భయపెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా అనేక అంశాల్లో రాజీపడిన సంగతి మనందరికీ తెలుసు. 2013లో బాలి దీవిలో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (ఔటూ) మంత్రివర్గ సమావేశంలో ధాన్యం, పత్తిపై కనీస మద్దతు ధర (మీూ) వ్యవస్థను 2017 నాటికి రద్దు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించింది. అనంతరం నరేంద్రమోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే 'ఆహార భద్రత'ను దృష్టిలో ఉంచుకుని.. అభివృద్ధి చెందుతున్న దేశాల పబ్లిక్ స్టాక్‌హోల్డింగ్ కార్యక్రమాలను ఔటూ సవాలు చేయకూడదని ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం కారణంగానే.. ఇవాళ కేంద్ర ప్రభుత్వం, కరోనానంతర పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా 81 కోట్ల మందికి ఉచితంగా ఆహారధాన్యాలను అందిస్తున్నది. తెలంగాణలోనూ 1.92 కోట్ల మంది ఈ పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారు. అన్నదాతల విషయంలో అన్యాయంగా వ్యవహరించినందుకు.. కాంగ్రెస్ పార్టీ సిగ్గుపడాలి. డాక్టర్ ఎమ్మెస్ స్వామినాథన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జాతీయ రైతు కమిషన్ సిఫారసులను అమలు చేసే ప్రసక్తే లేదని.. 2013లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 50శాతం ఎక్కువగా కనీస మద్దతు ధర ఉండాలని స్వామినాథన్ కమిటీ సూచించింది. దీన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించలేదు. అనంతరం, నరేంద్రమోదీ ప్రభుత్వం ఉత్పత్తి వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని కనీస మద్దతు ధరను నిర్ణయించే విధానాన్ని అమలు చేసింది. 2014తో పోలిస్తే.. దాదాపు అన్ని పంటలకు 50శాతం కనీస మద్దతు ధర పెంచడం ద్వారా రైతుల ఆదాయం పెరిగింది. మన దేశంలో హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో యాపిల్ పంట బాగానే ఉన్నప్పటికీ.. దేశీయ అవసరాలకు తగ్గట్లుగా ఉత్పత్తి లేదు. భారతదేశం.. ప్రస్తుతం 5.5లక్షల మెట్రిక్ టన్నుల యాపిల్స్‌ను దిగుమతి చేసుకుంటోంది. అమెరికాతో ఒప్పందం కారణంగా అక్కడి నుంచి యాపిల్స్‌ను మనం దిగుమతి చేసుకోవచ్చు. అయితే.. అమెరికా నుంచి వచ్చే యాపిల్స్ ధర.. హిమాచల్‌ప్రదేశ్‌లో ఉత్పత్తి అవుతున్న ధరకంటే దాదాపు 40శాతం ఎక్కువ. అందువల్ల మన యాపిల్ రైతులకు ఎలాంటి నష్టం ఉండదు. మన దేశంలో ఏటా 6 కోట్ల టన్నుల దాణా అవసరం అవుతున్నది. రానున్న రోజుల్లో ఇది మరింత పెరుగుతుంది. కానీ ప్రస్తుతం అమెరికాతో కుదిరిన ఒప్పందం కారణంగా మనం అక్కడి నుంచి దిగుమతి చేసుకునేది 5 లక్షల టన్నులే. అంటే మన అవసరంలో 1శాతం మాత్రమే. పౌల్ట్రీ ఇండస్ట్రీ ఇంకా ఎక్కువ దాణా దిగుమతి చేయాలని అడిగినా సరే.. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. అందుకే.. ఈ విషయంలో మన రైతులు ఏ మాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇలాంటి చర్యలతో పాటుగా వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో.. దేశం, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే.. రాహుల్‌గాంధీకి మాత్రం కంటగింపుగా మారింది. దేశం, తెలంగాణ పురోగతి చెందడం, యువతకు ఉద్యోగాలు రావడం రాహుల్‌కు ఇష్టంలేదని అర్థమవుతోంది. ఇప్పటివరకు వరుసగా 100 ఎన్నికల్లో వరుస పరాజయాల తర్వాత రాహుల్‌గాంధీ నిరాశ, నిస్పృహలతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అందుకే ప్రధానిపై ఉన్న వ్యతిరేకతను దేశంపై వ్యతిరేకతగా మలచుకున్నారు. మోదీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న ప్రగతిని చూసి జీర్ణించుకోలేక, అధికారం దక్కదన్న అసహనంతో.. దేశంలో అన్నదాతలను, ఎగుమతిదారులను రెచ్చగొట్టేందుకు విఫలయత్నం చేస్తున్నారు. సందర్భోచితంగా మోదీ సర్కారు చేసుకుంటున్న ఒప్పందాలపై అసందర్భోచిత విమర్శలతో దేశ ప్రజలముందు మళ్లీ మళ్లీ తన పరువు తానే తీసుకుంటున్నారు. వీటిని కూడా దేశ ప్రజలు, తెలంగాణ ప్రజలు హర్షించరు. కచ్చితంగా ఈ కుట్రలను తిప్పికొడతారు.

# బాధ్యతలు నెరవేరిస్తేనే హక్కులు దక్కుతాయి




భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ ప్రతి పౌరుడికీ సమాన హక్కులు ఉన్నాయి. అదే సమయంలో, దేశం అభివృద్ధి చెందడానికి, సామాజిక సమగ్రత కాపాడడానికి పౌరులందరిపై కొన్ని బాధ్యతలు కూడా ఉంటాయి. హక్కులు, బాధ్యతలు ఆధునిక ప్రజాస్వామ్యంలో పరస్పరం విడదీయలేనివి. హక్కులు మనకు స్వేచ్ఛ, గౌరవం, సమానత ఇస్తే... బాధ్యతలు ఆ స్వేచ్ఛను సరిగా ఉపయోగించడానికి మార్గనిర్దేశం చేస్తాయి. ప్రతి పౌరుడు తన హక్కులను వినియోగించడం ఎంత ముఖ్యమో, తన బాధ్యతలను నిర్వర్తించడం కూడా అంతే ముఖ్యం. భారత రాజ్యాంగం 1950లో అమలులోకి వచ్చినప్పుడు ప్రజలకు స్వేచ్ఛ, రక్షణ, న్యాయం వంటి విలువలను అందించే మౌలిక హక్కులను దాంట్లో చేర్చారు. శతాబ్దాలుగా కొనసాగుతున్న అసమానతలు, వివక్ష, అణచివేతకు ముగింపు పలుకుతూ, ప్రతి వ్యక్తికి గౌరవం, భద్రతను ఇచ్చే విధంగా ఈ హక్కులను రూపొందించారు. అయితే మౌలిక కర్తవ్యాలను అప్పట్లో రాజ్యాంగంలో ప్రత్యేకంగా చేర్చలేదు. 1970వ దశకంలో దేశంలో ఏర్పడిన రాజకీయ అస్థిరత, విలువల క్షీణత, ప్రజా క్రమశిక్షణ తగ్గిపోవడం వంటి సమస్యల నేపథ్యంలో కర్తవ్యాలను కూడా స్పష్టంగా చేర్చాల్సిన అవసరం వచ్చింది. స్వరణ్‌సింగ్ కమిటీ సిఫార్సుల ఆధారంగా 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా పౌరులు పాటించాల్సిన పదకొండు మౌలిక కర్తవ్యాలను రాజ్యాంగంలో చేర్చారు. దేశభక్తి, క్రమశిక్షణ, సామరస్యం, పర్యావరణ రక్షణ, సంస్కృతి పరిరక్షణల వంటి విలువలను మనలో పెంపొందించే విధంగా వీటిని రూపొందించారు. హక్కులు ఉన్నాయని ఇతరుల హక్కుల్ని కించపరచడం, వ్యక్తిగత స్వేచ్ఛ పేరుతో సమాజంలో అశాంతిని కలిగించడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం ఇవన్నీ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తాయి. పౌరులు బాధ్యతలను పాటించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది. ఉదాహరణకు, మనకు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఉంది. మన అభిప్రాయాన్ని చెప్పడానికి ఎవ్వరూ అడ్డంకి కల్పించరు. కానీ మన మాట వల్ల ఇతరుల గౌరవానికి భంగం కలగకుండా చూడటం ఒక బాధ్యత. తనకు నచ్చని విషయాన్ని ఎవరైనా మాట్లాడితే, కోపంతో హింసను ప్రేరేపించడం, దుర్భాషలాడడం స్వేచ్ఛా హక్కును తప్పుగా వినియోగించడమే. అలాగే, సమానత్వ హక్కు ప్రతి ఒక్కరికి ఉన్నప్పటికీ, మన సమాజంలోని విభిన్నతను గౌరవించడం, ఇతరుల పట్ల వివక్ష చూపకుండా ఉండడం మన బాధ్యత. జాతి, కులం, మతం, భాష, లింగం ఆధారంగా ఎవరికీ అవమానం కలిగించకపోవడం అనేది మనలో ప్రతి ఒక్కరూ పాటించి తీరవలసిన పౌర ధర్మం. హక్కులు మనకు సమానతకు హామీ ఇస్తాయి, బాధ్యతలు ఆ సమానతను కాపాడే నైతిక బాధ్యతలను గుర్తుచేస్తాయి. దేశాన్ని గౌరవించడం, దాని చిహ్నాలను పరిరక్షించడం కూడా మన బాధ్యతే. జాతీయ పతాకం, జాతీయ గీతం పట్ల గౌరవం చూపడం కేవలం ఒక ఆచారం కాదు; అది మనలో దేశభక్తిని పెంపొందించే ఒక విలువ. ఈ విలువలు ఉన్నప్పుడే మన హక్కులు సురక్షితంగా ఉంటాయి. దేశం మనకు ఇచ్చే విద్యా హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా సమాజంలో మంచి పౌరుడిగా మారడం, ఇతరులకు సహాయం చేయడం, నిజాయితీగా ఉద్యోగం చేయడం, అవినీతి వంటి చెడు పనులకు దూరంగా ఉండడం అనేవి బాధ్యతల్లో భాగం. పర్యావరణాన్ని కాపాడటం కూడా ప్రతి పౌరుడి ప్రధాన బాధ్యత. శుభ్రమైన గాలి పీల్చడం, స్వచ్ఛమైన నీరు త్రాగడం మనకు ఒక హక్కు. అలాగే చెట్లు నాటడం, వన్యప్రాణులను కాపాడడం, కాలుష్యాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యలు తీసుకోవడం మన బాధ్యత. మనం ఈ బాధ్యతను పట్టించుకోకపోతే, రేపటి తరాలకు ఈ హక్కులు అందుబాటులో ఉండవు. ప్రభుత్వ బస్సులు, పాఠశాలలు, ఆసుపత్రులు, రోడ్లు ఇవన్నీ ప్రజల డబ్బుతోనే నిర్మిస్తారు. వీటిని ధ్వంసం చేయడమంటే మన ఆస్తిని మనమే నాశనం చేసినట్టు. ప్రజల ఆస్తి మన హక్కులతో ముడిపడి ఉందని అర్థం చేసుకుంటే వాటిని కాపాడాలనే అవగాహన సహజంగానే మనకు వస్తుంది. మన రాజ్యాంగం ప్రతి పౌరునికి సమాన హక్కు ఇచ్చింది. కాబట్టి మహిళలు కూడా సమాన గౌరవానికి అర్హులే. వారి భద్రత, విద్య, అవకాశాలు వారికి సమాజం ఇచ్చే హక్కులు. అయితే వారిని అవమానించడం, వేధించడం, హింసించడం అనేవి బాధ్యత మరచిన జీవనశైలి అవుతుంది. మనం మహిళల పట్ల గౌరవంగా ప్రవర్తించినప్పుడే వారు తమ హక్కులను నిజంగా అనుభవించగలరు. ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడం కూడా ఒక బాధ్యత. మూఢ నమ్మకాలను, అజ్ఞానంతో కాలం చెల్లిన ఆచారాలను ప్రోత్సహించడం వల్ల సమాజం వెనకడుగు వేస్తుంది. విజ్ఞానాన్ని, తర్కాన్ని ఆధారంగా చేసుకొని నిర్ణయాలు తీసుకోవడం వల్ల సమాజం ముందుకు సాగుతుంది. శాస్త్రీయ దృక్పథం కలిగిన ప్రజలు ఉన్నప్పుడే దేశం నూతన ఆవిష్కరణలు చేసి, అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతుంది. మొత్తం మీద, హక్కులు, బాధ్యతలు వాహనానికి రెండు చక్రాలవంటివి. ఒక చక్రం లేకపోతే వాహనం ముందుకు కదలనట్లే, బాధ్యతలను విస్మరిస్తే జీవనం సజావుగా సాగదు. మనం హక్కులను మాత్రమే డిమాండ్ చేసి, బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తే ప్రజాస్వామ్యం తన బలాన్ని కోల్పోతుంది. పౌరులు తమ హక్కులను గౌరవిస్తూ, బాధ్యతలను నిజాయితీగా పాటించడంతోనే దేశం బలమైనదిగా, శాంతిమయమైనదిగా అభివృద్ధి చెందుతుంది. ఆదర్శవంతమైన ప్రజాస్వామ్యంగా నిలబడుతుంది.

## గుంటూరు ఛానల్ ఆధునీకరణకు 369 కోట్లు

**ప్రభుత్వ పరిశీలనలో అంచనాలు**

**మండలిలో ప్రశ్నలకు మంత్రి నిమ్మల సమాధానం**

గుంటూరు ఛానల్ ఆధునీకరణకు 369 కోట్ల రూపాయలతో అంచనాలు రూపొందించారని నీటిపారుదల శృాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ అంచనాల అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. 2014–19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.370 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీఓ జారీ చేసిందన్నారు. అయితే.. 2021లో ఆ నిధులను రద్దుచేస్తూ కొత్త అంచనాలు రూపొందించాలని నిర్ణయించినట్లు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.369 కోట్లతో పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. గుంటూరు ఛానల్ ఆధునీకరణపై ఏపీ శాసనమండలిలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ప్రశ్న లేవనెత్తారు. గుంటూరు ఛానల్ సంబంధిత కట్టలు దెబ్బతిన్నాయని తెలిపారు. మంగళగిరి పట్టణం నుంచి మురుగు నీరంతా ఈ ఛానల్‌లో కలుస్తోందని చెప్పారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఈ ఛానల్ మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గ పరిధిలో ఉండటంతో ఆయనే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హనుమంతరావు ప్రశ్నపై నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానిమస్తూ.. ఛానల్ పొడిగింపునకు రూ.285 కోట్లు విడుదల చేశామని మంత్రి నిమ్మల వెల్లడించారు. మంగళగిరిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గుంటూరు ఛానల్‌లో మురుగు కలవకుండా చూడాలని, దీనిపై మంత్రి నారా లోకేశ్ కూడా స్పందించి చర్యలు తీసుకోవాలని ఆలపాటి రాజా కోరారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. మొదటి దశ కింద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుచేయాలని నిర్ణయించామని తెలిపారు.

## కొండప్రాంతాల్లో రహదారుకలు అడవితల్లి బాట

**రూ.1,077 కోట్లతో ఈ కార్యక్రమం అమలు**

**అసెంబ్లీలో ప్రశ్నకు మంత్రి నాదెండ్ల సమాధానం**

గిరిజన గ్రామాలు, కొండ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల కోసం 'అడవితల్లి బాట' కార్యక్రమం చేపట్టినట్లు అసెంబ్లీలో మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రూ.1,077 కోట్లతో ఈ కార్యక్రమం అమలవుతోందని.. దీని ద్వారా సుమారు 4 వేల కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం జరుగుతోందని మంత్రి వివరించారు. ఏపీ అసెంబ్లీ సమావేశాలు తొమ్మిదో రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ 'అడవితల్లి బాట' కార్యక్రమంపై ప్రశ్న లేవనెత్తారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సభలో లేకపోవడంతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమాధానం ఇచ్చారు. మన్యం ప్రాంతంలో సరైన రోడ్లు లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడేవారని మంత్రి అన్నారు. అనారోగ్యానికి గురైనప్పుడు వైద్యం కోసం డోలీల ద్వారా రోగులను తరలించాల్సి వచ్చేదని చెప్పుకొచ్చారు. ఈ పరిస్థితిని మార్చాలనే ఉద్దేశంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 'అడవితల్లి బాట' కార్యక్రమాన్ని చేపట్టారని నాదెండ్ల మనోహర్ వివరించారు. అలాగే ఒడిశా సరిహద్దులోని కొటియా గ్రామాల సమస్యను కొణతాల రామకృష్ణ సభలో ప్రస్తావించారు. ఈ గ్రామాల ప్రజలు రెండు రాష్ట్రాల్లో ఓటుహక్కును కలిగి ఉన్నారన్నారు. అయితే.. ఏపీ అధికారులు అక్కడికి వెళ్లకుండా ఒడిశా పోలీసులు అడ్డుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ సమస్యపై ప్రభుత్వం జోక్యం చేసుకుని త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు.

## మృతి చెందిన సభ్యులకు అసెంబ్లీ సంతాపం

మంగళవారం శాసనసభలో పలువురు దివంగత నేతలకు నివాళి అర్పించారు. ఇటీవల మరణించిన పలువురు మాజీ శాసనసభ్యులకు సభ సంతాపం తెలియజేసింది. గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్ రెడ్డి, విజయవాడ వెస్ట్ మాజీ ఎమ్మెల్యే ఆసిఫ్ పాషా, రైల్వే కోడూరు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్, పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే గంటె సుమన్, శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండు అప్పల సూర్యనారాయణ, తాడేపల్లిగూడెం మాజీ ఎమ్మెల్యే ఈలి వరలక్ష్మి, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే రత్నాబాయి మృతి పట్ల సభ సంతాపం తెలిపింది. ప్రజా జీవితంలో వారు చేసిన సేవలను సభకు వివరించారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు. మాజీ శాసనసభ్యుల మృతికి గౌరవసూచకంగా సభ్యులందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

## పర్యాటకంగా విశాఖలో పలు అభివృద్ధి పనులు

**రూ.8,650 కోట్ల పెట్టుబడులతో 50 ఒప్పందాలు**

**అసెంబ్లీలో మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి**

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో విశాఖ నగరం కీర్తి కిరీటంగా నిలుస్తుందని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా విశాఖపట్నం దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీ కృష్ణ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల అభివృద్ధికి రూ.8,650 కోట్ల పెట్టుబడులతో 50 ఎంవోయూ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు మంత్రి తెలిపారు. హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో విశాఖను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ÷ఖ–ప్లేన్, క్రూజ్ సర్క్యూట్, హెలీ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మంత్రి దుర్గేశ్ చెప్పారు. విశాఖను అడ్వెంచర్ , యాంకర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ప్రసాద్ స్కీమ్ కింద సింహాచలం దేవస్థానానికి రూ.54.04 కోట్లు, స్వదేశీ దర్శన్ 2.0 కింద బొర్రా గుహల అభివృద్ధికి రూ.28.87 కోట్లు మంజూరు చేసి పనులు వేగవంతం చేశామని వివరించారు. రుషికొండ, తిమ్మాపురం, సాగర్ నగర్ బీచ్, గోస్తనీ బ్యాక్ వాటర్స్‌లో స్కూబా డైవింగ్, పారా మోటరింగ్ వంటి 10 రకాల జలక్రీడలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడంతో మరింత ఊతం వచ్చిందని మంత్రి అన్నారు. క్యారవాన్ పాలసీలో భాగంగా అన్ని ప్రాంతాల్లో క్యారవాన్ పార్కుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. విశాఖలో 'హాప్–ఆన్, హాప్–ఆఫ్ డబుల్ డెక్కర్ బస్సులు' సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. హోమ్ స్టే పాలసీ, బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ విధానంతో 490 హోమ్ స్టేలు ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. 'సీఆర్‌జెడ్ 19' అమల్లోకి వస్తే పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణాలకు ఉన్న అడ్డంకులు తొలగిపోతాయన్నారు. 2019–24 కాలంలో కుదేలైన పర్యాటక రంగాన్ని కూటమి ప్రభుత్వం పట్టాలెక్కించిందని ఆయన వివరించారు. నూతన పర్యాటక పాలసీ 2024–29తో విస్తృతంగా పెట్టుబడులు వచ్చాయన్నారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను పర్యాటక హబ్‌లుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి దుర్గేశ్ స్పష్టం చేశారు.

## పశు వైద్యశాల ఆధునీకరణకు చర్యలు

**అవసరమైన ఉపకరణాల సరఫరా**

**అసెంబ్లీలో మంత్రి అచ్చన్నాయుడు**

పశు వైద్యశాలల్లో సౌకర్యాలు, ఉపకరణాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి అచ్చన్నాయుడు తెలిపారు. వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ఉచితంగా మందుల సరఫరా చేస్తున్నామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తరాలు సందర్భంగా రాష్ట్రంలోని పశు వైద్యశాలల్లో సౌకర్యాల కొరత, వైద్యుల నియామకాలపై పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు ప్రశ్నకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుసమాధానం ఇచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమైన శాఖలకు తాళాలు వేశారని.. అన్ని శాఖల్లో నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేశారని విమర్శించారు. ఇబ్బందులను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి వివరించారు. వెటర్నరీ ఆసుపత్రుల భవనాలు చాలా వరకు శిథిలావస్థకు చేరాయని చెప్పారు. 2014–19 మధ్య కాలంలో నాబార్డ్ నిధులతో 326 భవనాలు మంజూరు చేశామని.. వాటిలో కొన్ని భవనాల నిర్మాణాలను అప్పట్లో పూర్తి చేశామని గుర్తుచేశారు. అయితే.. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక కొత్త భవనాల నిర్మాణం నిలిపేసిందన్నారు. ఈ ఏడాది బ్జడెట్‌లో భవనాల మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. త్వరలోనే వైద్యులు, సిబ్బంది నియామకాలు చేపడతామని మంత్రి అచ్చెన్నాయుడు సభలో ప్రకటించారు.

## పోలవరం ప్రాంతంలో మరోమారు పులికలకలం

పోలవరం జిల్లాలో మరోసారి పులి సంచారం కలకలం రేపుతోంది. రంపచోడవరం మండలం అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇదే పులి సంచరించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఈ పులిని అటవీ అధికారులు ఎంతో చాకచక్యంగా బంధించి విశాఖపట్నం జూకు తరలించారు. అక్కడ చికిత్స అందించిన తర్వాత, ప్రత్యేక కమిటీ నిర్ణయం మేరకు పాపికొండలు అభయారణ్యంలో వదిలిపెట్టి.. ఆ వీడియోలను మీడియాకు విడుదల చేశారు. అయితే, ఇదే పులి గత రెండు రోజులుగా మారేడుమిల్లి మండలం అటవీ ప్రాంతంలో కనిపించింది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com